


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




తమిళనాడు రాష్ట్రంలో రెండో రోజు ఎన్డీయే అభ్యర్థుల తరపున ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పోటెత్తిన ప్రజలు



# ఎన్డీయేతోనే భవిష్యత్!

- రెండురోజుల ఎన్నికల ప్రచారంతో ఊపునిచ్చిన ఏపీ ముఖ్యమంత్రి
- అభివృద్ధి మంత్రం... సుపరిపాలనే లక్ష్యంగా ప్రచారం
- డబుల్ ఇంజిన్ సర్కారుగా ఏపీని చూపించిన వైనం..
- మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై డీఎంకే తీరుపై నిప్పులు
- కర్ణాటక-తమిళనాడు వివాదాలకు చెక్ పెట్టేలా గంగా-కావేరి అనుసంధానంపై ప్రస్తావన
- తమిళనాడుకు పునర్వైభవం ఎన్డీఏతోనే సాధ్యమంటూ సభల్లో స్పష్టత

2



ఎన్నికల ర్యాలీలో ఆనందంతో సీఎం చంద్రబాబుపై పూలవర్షం కురిపిస్తున్న తమిళ మహిళలు



పర్యాటకానికి
## ప్రథమస్థానం

- 'దివ్యభారత్' నివేదికలో ఆంధ్రప్రదేశ్ టాప్

కూటమి ప్రభుత్వ దక్షతతో జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. భారత దేశంలోని వివిధ రాష్ట్రాల వైవిధ్యభరితమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సహజ సౌందర్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ నీతి ఆయోగ్ విడుదల చేసిన "దివ్యభారత్-ఎ విండో టు ది సోల్ ఆఫ్ ఇండియా" నివేదికలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి పెద్దపీట వేసింది. కూటమి ప్రభుత్వ కృషితో రాష్ట్ర పర్యాటక రంగం నేడు అద్భుత ప్రగతి ప్రయాణం సాగిస్తోందని నివేదిక చాటిచెప్పింది.

- 8వ పేజీలో



## మిషన్ సింగపూర్

- పౌర సౌకర్యాలు, పెట్టుబడుల ఆకర్షణపై దృష్టి
- సింగపూర్ పర్యటనలో ఏపీ మంత్రుల బృందం
- ద్వైపాక్షిక సంబంధాలు, అభివృద్ధి వ్యూహాలపై చర్చ
- ఆధునిక పరిపాలనపై అధ్యయనం



- 6వ పేజీలో

నాడు వివేకా..
నేడు పెద్ద దస్తగిరి..

## వైసీపీ 'రక్తచరిత్ర'

5

- రాత్రికి హత్య.. తెల్లారి మొసలికన్నీరు వారి నైజం
- వారే చంపుతారు.. వారే వెళ్లి పరామర్శిస్తారు
- పరామర్శకు వెళతానన్న జగన్ ఎందుకు వెళ్లలేదు
- ఫొటోలు, ఆర్థిక లావాదేవీలే వారి సంబంధానికి సాక్ష్యం
- గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజం

# తమిళనాడుకు పూర్వవైభవం


ఎన్డీయే గెలుపుతోనే సాధ్యమంటూ చెన్నై మీడియా సమావేశంలో చంద్రబాబు




- కేంద్రం ప్రతిపాదించినదే మెరుగైన డీలిమిటేషన్ ఫార్ములా
- మాతృభాషను గౌరవిద్దాం... ఇతర భాషలపై ద్వేషాన్ని వదిలేద్దాం
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం ప్రెస్‌కాన్ఫరెన్స్

తమిళనాడుకు ఎన్డీయేతోనే పూర్వ వైభవమని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అభివృద్ధి, ఉద్యోగాలు, సంక్షేమం ఏది అందాలన్నా ఎన్డీఏతోనే సాధ్యమన్నారు. తమిళనాడులో రెండు రోజుల ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం చంద్రబాబు చెన్నైలో మీడియాతో మాట్లాడారు. తమిళనాడునుంచి వచ్చిన ఎంతోమంది ప్రముఖులు, ఐఏఎస్ అధికారులు దేశానికి ఎలాంటి సేవలు అందించారో వివరించారు. ఇదే సందర్భంలో రాజకీయ కారణాలతో తమిళనాడు రాష్ట్రానికి ఇప్పుడు జరుగుతున్న నష్టాన్ని ముఖ్యమంత్రి మీడియాకు వివరించారు.

3



చైతన్యరథం

# ఎన్డీయేతోనే భవిష్యత్!

- రెండురోజుల ఎన్నికల ప్రచారంతో ఊపునిచ్చిన ఏపీ ముఖ్యమంత్రి
- అభివృద్ధి మంత్రం... సుపరిపాలనే లక్ష్యంగా ప్రచారం
- డబుల్ ఇంజిన్ సర్కారుగా ఏపీని ఉదహరించిన వైనం..
- మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై డీఎంకే తీరుపై నిప్పులు
- కర్ణాటక-తమిళనాడు వివాదాలకు చెక్ పెట్టేలా గంగా - కావేరి అనుసంధానంపై ప్రస్తావన
- తమిళనాడు పునర్వైభవం ఎన్డీఏతోనే సాధ్యమంటూ సభల్లో స్పష్టత









తమిళనాడు (చైతన్యరథం): తమిళనాడులో రెండు రోజులపాటు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిజీ షెడ్యూల్‌తో పలు కీలక ప్రాంతాలను ఎన్డీఏ తరపున ప్రచారం చేశారు. సోమ, మంగళవారాల్లో కోయంబత్తూర్, కృష్ణగిరి, విరుధ్‌నగర్, మధురై, చెన్నై జిల్లాల్లో పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభలు, రోడ్ షోలు, స్థానిక వ్యాపారవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్డీఏ అభ్యర్థులకు మద్దతు కూడగట్టారు. కోయంబత్తూర్ నార్త్, కోయంబత్తూర్ సౌత్, సింగనల్లూర్, కౌండం పాలాయం, సూలూర్, థలి, అన్నానగర్, టీ.నగర్, విల్లివాక్కం, సాత్తూర్, కోవెల్‌పట్టి నియోజకవర్గాల ఎన్డీఏ అభ్యర్థులు ఏపీ సీఎం నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ ప్రచారంలో ముఖ్యంగా అభివృద్ధిలో తమిళనాడు వెనుకబాటు, అవినీతి, క్షీణించిన శాంతి భద్రతలువంటి అంశాలపై ఆయన దృష్టి సారించారు. అలాగే తమిళనాడుకు ఎన్డీయే అవసరాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి సాధిస్తున్నామని, అదేవిధంగా ఎన్డీయేకు అవకాశం ఇస్తే తమిళనాడు కూడా వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి ఆయా సభల్లో వివరించారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి, గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్ సహా వివిధ ప్రముఖ కంపెనీలనుంచి వచ్చే పెట్టుబడులకు కేంద్రం ఇస్తున్న చేయూతే కారణమని ముఖ్యమంత్రి వివరించారు. తమిళనాడుకు పునర్వైభవం రావాలంటే ఎన్డీయేతోనే సాధ్యమవుతుందని ప్రతీసభలో సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక తమిళనాడు- కర్ణాటక రాష్ట్రాల మధ్య నిత్యం ఉండే నీటి తగాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలంటే నదుల అనుసంధానమే మార్గమనే అంశాన్ని ఏపీ సీఎం వివరించారు. దీనికి గంగా-కావేరి నదుల అనుసంధానమే మార్గమని... ఇది జరగాలంటే ఎన్డీయేకు ఓటేయాలని కోరారు. తమిళనాడులో ఎన్డీయే అధికారంలోకి వస్తే.. అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టవచ్చుని... అలాగే చాలా సమస్యలకు శాశ్వత పరిష్కారం కూడా లభిస్తుందని సీఎం వివిధ సభల్లో వివరించారు. ఇక చెన్నైకు తెలుగు గంగ ప్రాజెక్ట్ ద్వారా తాగునీటి సరఫరావంటి అంశాలను గుర్తుచేస్తూ రెండు రాష్ట్రాల మధ్య సహకారాన్ని ప్రస్తావించారు. అన్నదమ్ముల్లా కలిసి ఉందామని... కలిసి అభివృద్ధి చెందుదామని సీఎం చంద్రబాబు చెప్పారు. అలాగే తెలుగు- తమిళ ప్రజల అనుబంధం, ఎన్టీఆర్-ఎంజీఆర్ స్నేహం, దేశాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న కృషిని సీఎం చంద్రబాబు ప్రచార సభల్లో వివరించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై డీఎంకే వైఖరిని తీవ్రంగా విమర్శించిన ఏపీ సీఎం... మహిళలకు అన్యాయం చేసిన పార్టీలను ప్రజలు తిరస్కరించాలన్నారు. మహిళలను ఓడించిన డీఎంకేను ఓడించాలంటూ తమిళ ప్రజలకు ఏపీ ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఇక డిలిమిటేషన్ ప్రక్రియలో జనాభాతో సంబంధం లేకుండా 50 శాతం సీట్ల పెంచుతామన్న కేంద్ర ప్రతిపాదనను తమిళులకు అర్థమయ్యేలా వివరించారు. జనాభా ఆధారంగా జరిగే డిలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు కలిగే నష్టాన్ని కూడా వివరిస్తూ మాట్లాడారు. డీఎంకే, కాంగ్రెస్ పార్టీల విధానాల వల్ల మహిళలకు, దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లిందని ప్రతి సభలోనూ సీఎం ప్రస్తావించారు. ప్రతి సభలోనూ తమిళంలో మాట్లాడి ప్రజలను ఆకట్టుకున్న సీఎం చంద్రబాబు.... స్థానిక భావోద్వేగాలను గౌరవిస్తూ ప్రచారం నిర్వహించారు.

## సాంతూర్‌లో దుమ్ములేపిన చంద్రబాబు

తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండోరోజు సాతూర్ నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు -సాత్తూర్‌లో వివిధ సామాజిక వర్గాలకు చెందిన నేతలు, కార్యకర్తలతో సమావేశమై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... "ఎన్డీఏ పాలన వస్తేనే తమిళనాడు అభివృద్ధి చెందుతుంది. ఏపీలో 2019-24 మధ్య విధ్వంసం జరిగింది. మేం అధికారంలోకి వచ్చాక కేంద్రం సహకారంతో రాష్ట్రం పునర్నిర్మాణం జరుగుతోంది. తమిళనాడుకు ఉజ్వల భవిష్యత్ కావాలంటే ఎన్డీఏ అభ్యర్థులు గెలిచి తీరాలి. మధురై.. ఏపీలోని రాయలసీమ తరహా ప్రాంతం. చాలా అభివృద్ధి జరగాల్సి ఉంది. అభివృద్ధికి మారుపేరు ఎన్డీఏ ప్రభుత్వమే. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఎన్డీఏ పాలన రావాలి. తమిళ, తెలుగు, కన్నడ, కేరళ అంతా ద్రవిడ ప్రాంతానికి చెందిన వారమే. చెన్నైకి తెలుగు గంగ ద్వారా తాగునీటిని ఇచ్చిన నేతగా ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారు. ప్రజలు తమ ఓటు ద్వారా తమిళనాడు భవిష్యత్తును మార్చాల్సి ఉంది. గతంలో చెన్నై దక్షిణ భారతదేశానికి అత్యంత కీలకమైన ప్రాంతం. ఇప్పుడు చెన్నై అభివృద్ధి శూన్యం. ఇప్పుడు మళ్లీ దానిని పునరుద్ధరించే బాధ్యతను ఎన్డీఏ తీసుకుంటుంది. ఎన్డీఏ అభ్యర్థులను గెలిపిస్తే తమిళనాడు ప్రజలు గెలిచినట్టే" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.





# ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వవైభవం

- కేంద్రం ప్రతిపాదించినదే మెరుగైన డీలిమిటేషన్ ఫార్ములా
- మాతృభాషను గౌరవిద్దాం... ఇతర భాషలపై ద్వేషాన్ని వదిలేద్దాం
- చెన్నైలో మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం ప్రెస్‌కాన్ఫరెన్స్







చెన్నై (చైతన్య రథం): తమిళనాడు రాష్ట్రానికి ఎన్డీయేతోనే పూర్వ వైభవం వస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అభివృద్ధి కావాలన్నా.. ఉద్యోగాలు రావాలన్నా... సంక్షేమం అందాలన్నా అది ఎన్డీఏతోనే సాధ్యమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. తమిళనాడులో రెండు రోజుల ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం చంద్రబాబు చెన్నైలో మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఏపీకి, తమిళనాడుకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. తమిళనాడు పూర్వ వైభవాన్ని వివరించారు. తమిళనాడునుంచి వచ్చిన ఎంతోమంది ప్రముఖులు, ఐఏఎస్ అధికారులు దేశానికి ఎలాంటి సేవలు అందించారో వివరించారు. ఇదే సందర్భంలో రాజకీయ కారణాలతో తమిళనాడు రాష్ట్రానికి ఇప్పుడు జరుగుతున్న నష్టాన్ని ముఖ్యమంత్రి మీడియాకు వివరించారు. గతంలో మొత్తం దక్షిణ భారతదేశానికే కేంద్రంగా ఉండే తమిళనాడు, చెన్నై... ఇప్పుడు బెంగళూరు, హైదరాబాద్‌వంటి నగరాలతో పోటీ పడగలుగుతున్నాయా? అనే విషయాన్ని తమిళ ప్రజానీకం ఆలోచించాలన్నారు. తమిళ ప్రజలు ప్రోగ్రెసివ్ ఆలోచనలు చేస్తారని... ఇప్పుడు కూడా తమిళ ప్రజలు ఆ దిశగానే ఆలోచించి ఓట్లు వేయాలని ఏపీ సీఎం కోరారు. అర్ధంపర్థం లేని వ్యతిరేకతతో మహిళలకు, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసిన డీఎంకే, కాంగ్రెస్‌వంటి పార్టీలను ఈ ఎన్నికల్లో దూరం పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తమిళ ఓటర్లకు సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

"తిరువళ్ళూర్ నుంచి అబ్దుల్ కలాం వరకు ఎంతోమంది ప్రముఖులు ఈ గడ్డనుంచి వచ్చారు. తమిళనాడుకు చెందిన ఎంతోమంది ఉన్నతాధికారులు దేశానికి సేవ చేశారు, చేస్తున్నారు. తమిళ ప్రజలకు మాతృభాష అంటే ఎంతో ప్రేమ. కష్టించి పని చేసే మనస్తత్వం వారిది. ఘనమైన వారసత్వం, సంపద కలిగిన రాష్ట్రం తమిళనాడు. ఏపీ, తమిళనాడు రాష్ట్రాల ప్రజలది అన్నదమ్ముల బంధం. చెన్నై దాహార్తిని తీర్చేందుకు నాడే ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా తాగు నీరు అందించారు. ఇప్పుడు నదుల అనుసంధానం సాకారమైతే తమిళనాడుకు నీళ్లు సమృద్ధిగా అందుతాయి. ఇలాంటివి ఎన్డీఏతోనే సాధ్యం. మన దేశానికి ఓ సంస్కరణవాది ప్రధానిగా ఉన్నారు. రాష్ట్రాలమధ్య అభివృద్ధి పోటీ ఉంది. దీనికి కేంద్ర ప్రోత్సాహం కూడా ఉంది. కానీ తమిళనాడులోని డీఎంకే, పశ్చిమ బంగాలోని టీఎంసీ, యూపీలోని సమాజ్ వాదీ, ఇక జాతీయ స్థాయిలో కాంగ్రెస్ వంటి పార్టీలు మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రాన్ని ఓడించామని భావిస్తున్నాయి. కానీ వారంతా కలిసి ఈ దేశ మహిళలను ఓడించారు. దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం చేకూర్చారు. జనాభాతో సంబంధం లేకుండా 50శాతం మేర నియోజకవర్గాలను పెంచాలనే కేంద్రం ప్రతిపాదన వల్ల జరిగే నష్టమేంటో డీఎంకే పార్టీ చెప్పగలదా..? కేంద్ర ప్రతిపాదనవల్ల దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదని తెలిసినా... రాజకీయ కారణాలతో రెండు బిల్లులను వ్యతిరేకించారు. కొత్త సెన్సస్ ప్రకారం అయితే దక్షిణాది నష్టపోతుంది. ప్రస్తుతం ఉన్న సీట్లపై 50 శాతం అదనంగా సీట్ల సంఖ్య పెరిగితే దానిపై మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వచ్చేవి. దీనికన్నా మంచి ఫార్ములా మరొకటి ఉంటుందా..? మహిళలకు, పురుషులకు దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టమూ లేదు. బిల్లులను అడ్డుకున్న రాహుల్ గాంధీ, స్టాలిన్ ఏం సాధించారు...? మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడం ద్వారా డీఎంకేకు ఏం కలిసి వచ్చింది...? రాజకీయాల కోసం బిల్లులను అడ్డుకోవడం సరికాదు. మహిళా, డీలిమిటేషన్ బిల్లులను గుడ్డిగా వ్యతిరేకించడం వల్ల మహిళలకు, దక్షిణాది రాష్ట్రాలకే నష్టం. నేను ఇలా మాట్లాడుతోంటే దక్షిణాదికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నానని నాపై ముద్ర వేస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేను... దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఎందుకు చేస్తాను.? నేను దక్షిణాది రాష్ట్రాలవైపే మాట్లాడుతున్నాను. 2001లో వాజ్‌పేయి హయాంలో డీలిమిటేషన్ ప్రతిపాదన వస్తే జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు నష్టమని చెప్పి ఆపించాను. ఈ విషయం ఇండి కూటమి పార్టీలు గుర్తుంచుకోవాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

### తమిళనాడుకు గత వైభవమేదీ..?

"తమిళనాడులో అభివృద్ధి ఆగింది. చెన్నైలాంటి నగరాలనుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. శాంతి భద్రతలు, మహిళలపై నేరాలు, కస్టోడియల్ మరణాలు, డ్రగ్స్ పెరిగాయి. గతంలో తమిళనాడుకు ఓ ఘన చరిత్ర ఉంది. ఇతర రాష్ట్రాలు తమిళనాడు నుంచి చాలా నేర్చుకున్నాయి. కానీ ఇప్పుడు పరిస్థితి ఏమిటి..? తమిళనాడు, చెన్నై దక్షిణాదిలో అభివృద్ధి చెందిన బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలతో పోటీ పడగలుగుతున్నాయా..? ఒకప్పుడు దక్షిణాది ప్రాంతానికి చెన్నై నగరం కేంద్రంగా ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి ఉందా..? గతంతో పోల్చుకుంటే తమిళనాడులో అభివృద్ధి లేదు. జరిగిన కాస్తో కూస్తో అభివృద్ధి కూడా కేంద్రం ఇస్తున్న నిధుల వల్లే జరుగుతోంది. చెన్నై రైల్వే స్టేషన్ ఆధునీకరణకు పెద్ద ఎత్తున నిధులు ఇచ్చారు. త్వరలో చెన్నై, బెంగుళూరు, అమరావతి లాంటి నగరాలను అనుసంధానించేలా హై స్పీడ్ రైలు కారిడార్ ను కేంద్రం ఆమోదించింది. గూగుల్ లాంటి కంపెనీలకు తమిళనాడు నుంచి వెళ్లిన సుందర్ పిచాయ్ నేతృత్వం వహిస్తున్నారు. తమినాడు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కావాలి. డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా బులెట్ స్పీడ్ అభివృద్ధి వస్తుంది. డీఎంకేలాంటి రాజకీయ పార్టీలవల్ల అభివృద్ధి జరగటం లేదు. అభివృద్ధి కావాలంటే ఎన్డీఏకి ఓటు వేయాల్సిందే. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్‌లాంటి కంపెనీల నుంచి పెట్టుబడులు వస్తున్నాయి. మేము ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతున్నాం. అభివృద్ధి కోసం పని చేస్తున్నాం. ఇదంతా కేంద్రం నుంచి వస్తున్న సహకారం వల్లే సాధ్యమైంది. డబ్బులు లేకున్నా వినూత్న విధానాలతో ల్యాండ్‌పూలింగ్ పద్ధతిన భూమిని తీసుకుని రాజధాని నిర్మిస్తున్నాం. దానికి కేంద్రం సహకరిస్తోంది. ఇదే విధంగా తమిళనాడు అభివృద్ధి కోసం పని చేసే అవకాశం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు ఇవ్వాలి. జాతీయ ప్రయోజనాలతో పని చేస్తున్న ప్రధానికి మేం పూర్తి మద్దతు ఇస్తున్నాం. అదే విధంగా తమిళ ప్రజలు కూడా మద్దతివ్వాల్సి ఉంటుంది" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

"భిన్న సంస్కృతులున్నా.. మనమందరం భారతీయులం. తమిళ సంస్కృతి సంప్రదాయాలను ప్రధాని మోదీ ప్రమోట్ చేస్తున్నారు. ఒకే దేశంగా అన్ని రాష్ట్రాలూ కలిసి పనిచేయాలి. కావేరి నది నీటి కోసం కర్ణాటక, తమినాడుల మధ్య వివాదం నడుస్తుంది. ఏపీలో కృష్ణా గోదావరి నదులు అనుసంధానం జరుగుతోంది. గంగా కావేరిల నదుల అనుసంధానం జరిగితే అన్ని రాష్ట్రాలకు నీటి భద్రత లభిస్తుంది. ఇది జరగాలంటే ప్రధానికి మరింత అండగా నిలవాల్సి ఉంటుంది. ప్రధాని మోదీపై వ్యతిరేకతతో భాషా పరమైన భేదాలు తీసుకురావడం సరికాదు. హిందీని కేంద్రం జాతీయ భాషగా ప్రకటించలేదు. మాతృ భాషను గౌరవించాలి... మాతృ భాషతోనే మన సంస్కృతిని కాపాడుకోగలం. కానీ వివిధ భాషలు నేర్చుకోవడం వల్ల అభివృద్ధి సాధించగలం. మాతృ భాషలోనే విద్యా బోధన జరగాలని ప్రధాన మంత్రి చెబుతున్నారు. ఏపీలో గత ప్రభుత్వం పాఠశాలల్లో బలవంతంగా ఇంగ్లీష్ అమలు చేయాలని చూస్తే.. కేంద్రమే అడ్డుకుంది. భాష అనేది ఇప్పుడు ఓ సమస్య కాదు. భాష కారణంగా అభివృద్ధిని అడ్డుకునేలా ఆలోచనలు చేయడం సరికాదు. భాషను అభివృద్ధి చేసుకోవాలి...రాష్ట్రాన్నీ అభివృద్ధి చేసుకోవాలి. దేశాభివృద్ధి కోసం రాష్ట్రం కూడా ప్రగతి మార్గంలో నడవాలి. అభివృద్ధి సాధిస్తేనే సంపద సృష్టి జరుగుతుంది సంక్షేమం సాధ్యం అవుతుంది. అది ఎన్డీఏ మాత్రమే చేయగలదు. రాజకీయాల్లోకి కొత్తగా వచ్చి పార్టీ పెట్టిన విజయ్ ఏ మేరకు రాణించగలడో ఇంకా చెప్పలేం" అని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

## బయోమైనింగ్ పనులకు రెండురోజుల్లో ఉత్తర్వులు

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్
- మంత్రి నిమ్మలతో కలిసి డంపింగ్ యార్డు పనుల పరిశీలన

పాలకొల్లు(చైతన్యరథం): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో డంపింగ్ యార్డు(బయోమైనింగ్) పనులు త్వరితగతిన జరగడానికి బయో రెమిడియేషన్ (నేల, నీటిలోని విషపూరిత కాలుష్య కారకాలను హాని లేని పదార్థాలుగా మార్చే సహజమైన, పర్యావరణ అనుకూల ప్రక్రియ)కు సంబంధించిన ఉత్తర్వులను ఒకటి రెండు రోజుల్లో జారీ చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. పాలకొల్లు పట్టణం 9వ వార్డులో యడ్ల బజారు ప్రాంతంలోని, 12వ వార్డులోని సూర్యతేజ్ నగర్‌లో జరుగుతున్న డంపింగ్‌యార్డు పనులను మంగళవారం జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి చైర్మన్ పట్టాభిరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు మరింత సౌకర్య వంతంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛాంధ్ర' పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆయన సారధ్యంలో రాష్ట్రాన్ని త్వరలోనే డంప్ యార్డు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు మున్సిపల్ ప్రత్యేక అధికారి, రెవెన్యూ డివిజన్ అధికారి దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, తహశీల్దార్ వై.దుర్గా కిషోర్, పబ్లిక్ హెల్త్ డీఈ ఆర్.విజయ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ కృష్ణమూర్తి, పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొన్నారు.



### పాలకొల్లులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పాలకొల్లు నియోజకవర్గంలో రూ.3.04 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల రామానాయుడు శంకు స్థాపన చేశారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి రూ. 14లక్షల కోట్ల అప్పుమిగిల్చి వెళ్లిపోయాడు. వైసీపీ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి సున్నా. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

చైతన్యరథం

# అధికారులు ప్రతిరోజూ ఒక పాఠశాలలో భోజనం చేయాలి

- 'తల్లికి వందనం' బాధ్యత డీఈవో బాధ్యత తీసుకోవాలి
- విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తే కూటమి ధ్యేయం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్




అద్దంకి (చైతన్యరథం): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భవిష్యత్తు అందించడమే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన అద్దంకి నియోజవర్గంలో పర్యటించారు. తొలుత సంతమాగులూరు మండలం కొప్పరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 72 మంది విద్యార్థులకు ఆసిస్ట్ స్వచ్ఛంధ సంస్థ సహకారంతో ఉచితంగా సైకిళ్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి విద్యార్థులతో ఇష్టాగోష్ఠిగా సంభాషించారు. ఇప్పటి వరకు అద్దంకి నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 11,044 సైకిళ్లు పంపిణీ ఉచితంగా పంపిణీ చేశామన్నారు. అందుకు ఎందరో దాతలు సహకరించారన్న మంత్రి గొట్టిపాటి మంచి పని చేయడానికి అందరూ ముందుకు వస్తారని తెలిపారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందన్న ప్రశ్నకు విద్యార్థులు బావుందని సమాధానం చెప్పారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక పాఠశాలలో అధికారులు మధ్యాహ్న భోజనం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ విషయాన్ని ఇంతకుముందే చెప్పినా ఎందుకు పాటించట్లేదని ప్రశ్నించారు. తల్లిదండ్రులు కూడా మధ్యాహ్న భోజనం చేస్తూ పాఠశాల భోజనం నాణ్యతను పరిశీలించాలన్నారు.

## అధికారులు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి

కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థ అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. గతంలో ఒక్కో స్కూలుకు ఒకే టీచర్ ఉన్న పరిస్థితులు ఉన్నాయని గుర్తు చేశారు. నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అనేక సంస్కరణలు అమలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని డీఎస్సీ ద్వారా ఒకేసారి 16వేలకు పైగా టీచర్ పోస్టులను భర్తీ చేశారన్నారు. నాణ్యమైన బ్యాగ్, యూనిఫాం, షూలతో పాటు చదివే అందరికీ 'తల్లికి వందనం' అందజేస్తున్నామన్నారు. ఆ నగదు అందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత డీఈవో, ఎంఈవో, ఇతర అధికారులదేనని మంత్రి తేల్చి చెప్పారు. కొప్పరం పాఠశాలకు త్వరలోనే డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు అయ్యాయని, పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు.

అనంతరం మంత్రి గొట్టిపాటి గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులకు అందించిన ఆయన వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కొప్పారం గ్రామంలోని మసీదును మంత్రి సందర్శించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నేతలు మంత్రి గొట్టిపాటిని సన్మానించారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల పక్షపాతి అయిన కూటమి ప్రభుత్వంలోనే అందరికీ రక్షణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడులో రూ.50 లక్షలతో నిర్మించిన కాపు కమ్యూనిటీ భవనాన్ని మంగళవారం మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దాతల సహాయంతో సుమారు 30 కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నామ న్నారు. కొమ్మాలపాడులోనే ఇప్పటివరకు సుమారు రూ.1.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. మండలంలో ప్రస్తుతం జరుగుతున్న విద్యుత్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే ఏల్చూరు దగ్గర 11 ఎకరాల్లో 132 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. పెండింగులో వున్న వ్యవసాయ కనెక్షన్లను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైసీపీ పాలన, సంక్షేమ, అభివృద్ధి బాటలో దూసుకుపోతున్న కూటమి పాలనలో తేడాను ప్రజలే గమనించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

# అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్‌లు



- బీసీల అభ్యున్నతే సీఎం చంద్రబాబు లక్ష్యం
- చట్టసభల్లో అన్ని బీసీ కులాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నదే చంద్రన్న ధ్యేయం
- త్వరలో ప్రారంభమయ్యే ఆదరణ 3.0లో విశ్వ బ్రాహ్మణులకు ప్రాధాన్యం
- విశ్వబ్రాహ్మణుల కోసం మంగళగిరిలో శిక్షణ కేంద్రం ఏర్పాటు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అనంతపురం (చైతన్యరథం): అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్‌లు నిర్మిస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. చట్టసభల్లో అన్ని కులాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. త్వరలో అమలు చేయబోయే ఆదరణ 3.0 పథకంలో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యమిస్తామని వెల్లడించారు. అనంతపురంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ పాలకమండలి సభ్యుల అభినందన కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. బీసీల అభ్యున్నతికే అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు వెనుబడిన వర్గాలకు అన్ని విధాలా ప్రాధాన్యమిస్తున్నారన్నారు. బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు కోసం వెన్నుదన్నుగా నిలుస్తున్నార న్నారు. చట్టసభల్లో అన్ని బీసీ కులాలకూ ప్రాతినిధ్యం కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవనాల నిర్మాణానికి గతంలో రూపొందించిన అంచనాలను సవరిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా విశ్వబ్రాహ్మణులను అన్ని విధాలా ప్రోత్సాహించాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. త్వరలో అమలు చేయబోయే ఆదరణ 3.0 పథకంలో వారికి ఆధునిక పరికరాలు అందించే ఆలోచన చేస్తున్నామన్నారు. మారుతున్న కాలంతో పాటు నేటి తరం అభిరుచులకు అనుగుణంగా విశ్వ బ్రాహ్మణులకు శిక్షణ ఇవ్వడానికి మంగళగిరిలో స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. విశ్వ బ్రాహ్మణుల ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూ విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించామన్నారు. గత ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ పాలక మండలి సభ్యులను ఆ సామాజిక వర్గీయులు మంత్రి చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పార్వతమ్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు, విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**

**చిన్నమండెంలో రూ.1.89 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**



చిన్నమండెం (చైతన్యరథం): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని, అందులో భాగంగానే మారుమూల ప్రాంతాల్లో సైతం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా చిన్నమండెం మండలంలో సుమారు రూ.1.89 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారం భోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

మోడల్ స్కూల్ సీసీ రోడ్డు: రూ.20 లక్షలు

రైతు బజార్ (చిన్నమండెం): రూ.20 లక్షలు

సినిమా హాల్ సీసీ రోడ్డు: రూ.10 లక్షలు

బెస్తపల్లి నుంచి డి.కాయలవాండ్లపల్లి వరకు బీటీ రోడ్డు: రూ.1.39 కోట్లు

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారులు బాగుంటేనే ఆ ప్రాంతం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాల కల్పన ద్వారా ప్రజలకు మరింత ప్రగతిని చేరువ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నాడు వివేకా.. నేడు దస్తగిరి..

# వైసీపీ రక్త చరిత్ర సీరియల్

- రాత్రికి హత్య.. తెల్లారి మొసలికన్నీరు వారి నైజం
- బాధితుల దగ్గరకు వెళ్లి సానుభూతి నాటకాలు
- గంజాయి బ్యాచ్ గొడవగా చిత్రీకరించి పక్కదారి
- ఏపీ ప్రతిష్ఠను వైసీపీ అధఃపాతాళానికి తొక్కేసింది
- విధ్వంసం, హత్యలపైనే ఆ పార్టీ మనుగడ
- రవీంద్రనాథ్‌రెడ్డి కుటుంబసభ్యుల పేర్లపై ఉన్న
- పదుల డాక్యుమెంట్లు దస్తగిరి వద్ద ఎందుకున్నాయి?
- పరామర్శకు వెళతానన్న జగన్ ఎందుకు వెళ్లలేదు
- వాస్తవాలు బయటపడతాయన్న భయం పట్టుకుందా?
- ఫొటోలు, ఆర్థిక లావాదేవీలే వారి సంబంధానికి సాక్ష్యం
- తాడేపల్లి పెద్దలకు తెలియకుండానే జరుగుతున్నాయా?
- గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి

మంగళగిరి(చైతన్యరథం): ఒకప్పుడు దేశ రాజకీయాల్లో ఎంతో గౌరవం, పేరు ప్రఖ్యాతులు ఉన్న ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్రతిష్ఠను వైసీపీ అధఃపాతాళానికి తొక్కేసిందని గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. అధికారం,ఆస్తి కోసం వైసీపీ నేతలు ఎంతటి నీచానికైనా దిగజారుతారని మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ మనుగడ మొత్తం విధ్వంసం, భయాందోళనలు, హత్యలు అనే మూడు రెక్కల మీద సాగుతోందని విమర్శించారు.

వివేకా హత్య నుంచి నేటి దస్తగిరి హత్య వరకు ఆ పార్టీ అనుసరిస్తున్న పనితీరు ఒకేలా ఉందని ఆరోపించారు. నాడు అప్పట్లో వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని నమ్మించే ప్రయత్నం చేసి ఆపై సానుభూతి కోసం నాటకాలు ఆడారు. దస్తగిరి మరణాన్ని కూడా గంజాయి బ్యాచ్ గొడవగా చిత్రీకరించి పక్కదారి పట్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. హంతకులే బాధితుల వద్దకు వెళ్లి మొసలికన్నీరు కార్చడం అత్యంత హేయమైన చర్య అని ధ్వజమెత్తారు.



### దస్తగిరి నివాసంలో పత్రాలు.. వైసీపీ దోపిడీకి నిదర్శనం

2019 నుంచి 2024 వరకు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు దస్తగిరి వంటి వారిని వాడుకుని వేల కోట్ల ఆస్తులు కూడబెట్టారని పేర్కొన్నారు. దస్తగిరి నివాసంలో పోలీసుల సోదాల్లో ప్రాథమికంగా రూ.150 కోట్ల విలువైన పత్రాలు దొరికినట్లు తెలిసినా.. లోతుగా పరిశీలిస్తే అవి రూ.500 కోట్ల వరకు ఉండవచ్చని ప్రజలు చర్చించుకుంటున్నారని వెల్లడించారు. సామాన్యుల నుంచి లాక్కున్న అగ్రిమెంట్లు, ఖాళీ పత్రాలు ఆ పార్టీ దోపిడీకి నిదర్శనాలని పేర్కొన్నారు. హత్యలు చేయించడం, మళ్ళీ ఆ కుటుంబాలను పరామర్శించడం, తమ సొంత మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను, పోలీసులను తప్పుదోవ పట్టించడం వైసీపీకి అలవాటుగా మారిందని విమర్శించారు. ఇలాంటి నేరపూరిత చరిత్ర కలిగిన పార్టీ రాజకీయాల్లో ఉండటానికి అర్హత ఉందో లేదో కేంద్ర ఎన్నికల సంఘం పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.సొంత చిన్నాన్నను చంపినప్పుడే లేని జాలి, నేడు దస్తగిరి విషయంలో ఉంటుందని ప్రజలు నమ్మరు. వైసీపీ అంటేనే ఒక విధ్వంసకర శక్తుల అడ్డాగా మారిపోయిందని ధ్వజమెత్తారు.

### అవినాష్‌రెడ్డికి, రవీంద్రనాథ్‌రెడ్డికి దస్తగిరి ఆప్తమిత్రుడు

దస్తగిరి ఎవరో ప్రజలందరికీ తెలియాల్సిన అవసరం ఉంది. ఆయన సాధారణ వ్యక్తి కాదు. ఎంపీ అవినాష్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి అత్యంత ఆప్తమిత్రుడు. తాడేపల్లి ప్యాలెస్ పెద్దలతో కూడా ఆయనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పులివెందలలో జరిగే ప్రతి రహస్య మంత్రాంగంలోనూ, రాజకీయ కుట్రల్లోనూ దస్తగిరి పాత్ర ఉండేదని కడపలో ప్రతి ఒక్కరూ చెప్పుకుంటున్నారని గుర్తు చేశారు. వైసీపీ రాజకీయాల్లో అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే రాత్రికి రాత్రే చీకట్లో హత్యలు చేయించి తెల్లవారేసరికి ఏమీ తెలియనట్లు మొట్టమొదటిగా వెళ్లి ఆశవాల దగ్గర నివాళులర్పించి మొసలి కన్నీరు కార్చడం. ఈరోజు ఎవరైతే ప్రధాన కుట్రదారుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారో అదే వ్యక్తి వెళ్లి దస్తగిరి భౌతికకాయాన్ని పరామర్శించడం అత్యంత ఘోరం. హత్య చేసిన నిందితులు, ఘటన జరిగిన మూడు గంటల్లోనే నిత్యానందరెడ్డి అనే వ్యక్తి వద్దకు వెళ్లి ఆశ్రయం పొందినట్లు పక్కా ఆధారాలు లభించాయని స్పష్టం చేశారు.

### జగన్ పరామర్శను ఎందుకు విరమించుకున్నారు

దస్తగిరి కుటుంబాన్ని పరామర్శిస్తానని స్వయంగా ప్రకటించిన జగన్‌రెడ్డి చివరకు ఎందుకు వెళ్లలేకపోయారని ప్రశ్నించారు. అక్కడ వాస్తవాలు బయటపడతాయనే భయంతోనే తన పర్యటనను విరమించుకున్నారని విమర్శించారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని విధ్వంసం చేయడమే లక్ష్యంగా వైసీపీ పరిపాలన సాగిందని మండిపడ్డారు. దస్తగిరిని అడ్డుపెట్టుకుని కడపలో అమాయక ప్రజలను భయపెట్టి చిత్రహింసలు పెట్టి కారుచౌకగా భూములను లాక్కున్నారని ఆరోపించారు. దస్తగిరి ఇంట్లో దొరికిన 175కు పైగా డాక్యుమెంట్లు వైసీపీ నేతల భూదోపిడీకి నిలువెత్తు సాక్ష్యాలని పేర్కొన్నారు. అంతేకాకుండా గూడూరు వద్ద రవీంద్రనాథ్ రెడ్డి కోసం దస్తగిరి ఒక విలాసవంతమైన భవనాన్ని నిర్మించిన మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. ఇప్పటికీ ఆ భవనానికి గృహ ప్రవేశం కూడా జరగలేదని గుర్తు చేశారు. దస్తగిరికి, తమకు సంబంధం లేదని కడప వైసీపీ నేతలు చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలని, వారి మధ్య ఉన్న ఫొటోలు, ఆర్థిక లావాదేవీలే అందుకు సాక్ష్యాలని స్పష్టం చేశారు. ఈ అరాచక రాజకీయాలకు ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

### హత్యారాజకీయాలకు డెన్‌గా వైసీపీ

వైసీపీ రాజకీయ పార్టీ కాదు..అది హత్య రాజకీయాలకు ఒక 'డెన్' (నిలయం)గా మారిందని ధ్వజమెత్తారు. అధికారం కోసం కార్యకర్తలను వాడుకుని, అవసరం తీరాక వారిని అడ్డు తొలగించుకోవడం ఆ పార్టీ నైజమని మండిపడ్డారు. దస్తగిరి వద్దలభించిన డాక్యుమెంట్లు వైసీపీ అగ్రనేతల బినామీ వ్యవహారాలను స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. రామాంజిరెడ్డి పేరుతో 30 డాక్యుమెంట్లు, రవీంద్రనాథ్‌రెడ్డి కుమారుడి పేరుతో మరో 30డాక్యుమెంట్లు, అలాగే ఆయన సతీమణి అరుణ్‌కుమార్ పేరుతో మరి కొన్ని పత్రాలు లభించాయని వెల్లడించారు. వీరంతా ఎవరికి బినామీలో ప్రజలు ఆలోచించాలని, దస్తగిరిని చంపాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో దీనిని బట్టే అర్థమవుతుందని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు తమ పార్టీ కార్యకర్తల పేదరికాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడతారని విమర్శించారు. తమ అసలు పేర్లు బయటకి రాకుండా ఉండేందుకు వాడుకున్న వ్యక్తులనే హతమార్చడం వైసీపీ విధానమని పేర్కొన్నారు.

### నిందితులకు వైసీపీ నాయకుడి షెల్టర్

నిందితులకు వైసీపీ నాయకుడు నిత్యానందరెడ్డి షెల్టర్ ఇవ్వడం వెనుక ఉన్న మర్మమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.గత ఐదేళ్లలో వైసీపీ చేసిన పాపాలు అంతులేనివని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద వృద్ధ దంపతులను బెదిరించి భూములు లాక్కోవడం,మన ప్రాణాలు కాపాడే పోలీస్ డిపార్ట్‌మెంట్ సంక్షేమం కోసం కేటాయించిన భూములను కబ్జా చేయడం,బుక్కవంక జలాశయం వద్ద 35 ఎకరాల భూకబ్జా, రైల్వే ఉద్యోగుల ప్లాట్ల ఆక్రమణ, ఈ అరాచకాలన్నీ తాడేపల్లి పెద్దలకు తెలియకుండానే జరిగాయా? అని ప్రశ్నించారు. తెలిసీ చర్యలు తీసుకోలేదంటే ఇవన్నీ వారి ఆశీస్సులతోనే జరిగాయని ప్రజలు నమ్మాల్సి ఉంటుందని చెప్పారు. రియల్ ఎస్టేట్ వివాదాలు ఉంటే ఎవరైనా పోలీసుస్టేషన్లకు లేదా కోర్టులకు వెళతారని, కానీ వైసీపీ నాయకులకు మాత్రం 'హత్యే' ఏకైక పరిష్కారమని ఎద్దేవా చేశారు. న్యాయస్థానాలు అక్కర్లేదు..నేరుగా ఎలిమినేషన్ ప్రాసెస్ ఒక్కటే మా పద్ధతి అన్నట్లుగా వైసీపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దస్తగిరి హత్య, ఆయన ఇంట్లో దొరికిన పత్రాలు, వారి మధ్య లావాదేవీల వెనుక ఖచ్చితంగా వైసీపీ పెద్దల హస్తం ఉందని వ్యాఖ్యానించారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కుమారుడు రామాంజిరెడ్డి పేరుతో 30 డాక్యుమెంట్లు, ఆయన సతీమణి పేరుతో మరికొన్ని పత్రాలు లభించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

### భూకబ్జాలపైనా విచారణ జరుపుతుంది

గత ఐదేళ్లలో కడప జిల్లాలో అమాయకులను బెదిరించి కారుచౌకగా లాక్కున్న ప్రతి అంగుళం భూమిపై ప్రభుత్వం విచారణ జరుపుతుందని హామీ ఇచ్చారు. 2019లో వివేకా హత్య కేసులో ఏ విధంగా ప్రజలను మబ్బి పెట్టారో, ఇప్పుడు దస్తగిరి కేసులో అటువంటి కుతంత్రాలు సాగవని హెచ్చరించారు. ఈ హత్యల వెనుక ఎంతటి పెద్ద నాయకులు ఉన్నా, వారెంతటి పలుకుబడి కలిగిన వారైనా ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఇటువంటి అరాచక శక్తులను గుర్తించి చీకటి రాజకీయాలకు చరమగీతం పాడాలని సూచించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. నిందితులకు ఆశ్రయం ఇచ్చిన వారితో సహా ఈ మొత్తం కుట్రలో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ బోనులో నిలబెడతామని స్పష్టం చేశారు.

## విద్యార్థులకు మరో విద్యా పథకం

### ఏపీ వక్ఫ్‌బోర్డ్ కీలక నిర్ణయం



విజయవాడ(చైతన్యరథం): ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 14వ వక్ఫ్ బోర్డ్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆయా అజెండాలపై ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారు. ఈ మేరకు ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ విద్య ఖర్చులను వక్ఫ్ బోర్డ్ భరిస్తుందని తెలిపారు. 'తాలీం ఏ హునర్' పేరుతో వక్ఫ్‌బోర్డు ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు నడుపుతోందని.. అదే పేరుతో ఈ విద్యా పథకం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం 500 మందికి ఉచిత ఇంటర్మీడియట్ రెసిడెన్షియల్ విద్యను అమలు చేస్తామని వెల్లడించారు. రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ విద్యతో పాటు జేఈఈ మెయిన్స్, నీట్ కోసం ఉచిత శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. మొదటి ఏడాది 250 మందితో ఈ పథకాన్ని ప్రారంభిస్తామని.. రెండో ఏడాది నుంచి ఏటా 500 మందికి ఉచిత విద్య అందజేస్తామని తెలిపారు. ట్యాలెంట్ టెస్ట్ ద్వారా ముస్లిం విద్యార్థులను ఎంపిక చేస్తామని అన్నారు. వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో నాణ్యమైన ఉన్నత విద్యకు ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. పదోతరగతి ఫలితాల తర్వాత టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు.

## కేడీసీసీబీకి ఐఓఎస్ సర్టిఫికెట్ అభినందనీయం

- మంత్రి కొలుసు పార్థసారథి
- చైర్మన్ నెట్టెం రఘురాంకు ప్రశంసలు

విజయవాడ(చైతన్యరథం): కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(కేడీసీసీబీ)కు ఐఓఎస్ 9001-2015 సర్టిఫికెట్ రావడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిలువుటద్దమని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సమర్థవంతమైన పరిపాలనలో కేడీసీసీబీ బ్యాంకు ఈ ఘనతను సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు మూలనపడిన విషయం అందరికీ తెలిసిందే. కానీ ప్రజలకు, రైతులకు నిత్యం ఈ బ్యాంకులను అందుబాటులో ఉంచేందుకు, సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. దీని ఆధారంగానే నేడు కేడీసీసీబీ బ్యాంకు అరుదైన సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. ఈ సర్టిఫికెట్‌ను సాధించేలా కృషి చేసిన కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాంను అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటివి మరెన్నో మైలురాళ్లు దాటాలని, కూటమి ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.



# పౌర సౌకర్యాలు, పెట్టుబడుల ఆకర్షణపై దృష్టి

- సింగపూర్ పర్యటనలో ఏపీ మంత్రుల బృందం
- ద్వైపాక్షిక సంబంధాలు, అభివృద్ధి వ్యూహాలపై చర్చలు
- ఆధునిక పరిపాలనపై అధ్యయనం

సింగపూర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, అత్యాధునిక పరిపాలనా విధానాల అధ్యయనమే లక్ష్యం గా మంత్రుల బృందం సింగపూర్‌లో పర్యటిస్తోంది. పర్యటనలో భాగంగా మంత్రులు మొదటిరోజు పౌర సౌకర్యాలు, స్మార్ట్ సిటీ మేనేజ్‌మెంట్, పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి సారిం చారు. మొదటగా సింగపూర్ విదేశీ వ్యవహారాలు, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి గన్ సియో హువాంగ్‌తో ఏపీ మంత్రులు భేటీ అయ్యారు. భారత్ హై కమిషనర్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పి.నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డి, వంగలపూడి అనిత, కింజరాపు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. భారత్- సింగపూ ర్ మధ్య ఉన్న దీర్ఘకాలిక స్నేహాన్ని, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, మౌలికవసతులు, లాజిస్టిక్స్, పునరుత్పాదక శక్తి రంగాల్లో పరస్పర సహకారం, ఫిన్‌టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ సిటీస్, అర్బన్ ప్లానింగ్, వ్యర్థాల నిర్వహణలో సింగపూర్ నైపుణ్యాన్ని ఏపీలో వినియోగించు కోవడం, ఏపీ యువతకు వృత్తిపరమైన విద్య, శిక్షణ కార్యక్రమాల్లో సింగపూర్ సహకారంపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత విస్తృతమవుతాయని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.



'అవర్ టాంపైన్స్ హబ్' సందర్శన

అనంతరం పర్యటనలో భాగంగా మంత్రుల బృందం సింగపూర్‌లో అతిపెద్ద లైఫ్ స్టైల్ సెంటర్ అయిన 'అవర్ టాంపైన్స్ హబ్'ను సందర్శించింది. అక్కడ క్రీడలు, థియేటర్లు, లైబ్రరీలు, షాపింగ్ మాల్స్ వంటి అన్ని ప్రజా సౌకర్యాలను ఒకే చోట చేర్చి ఒక గొప్ప రిక్రియేషన్ హబ్‌గా తీర్చిదిద్దిన విధానాన్ని మంత్రులు పరిశీలించారు. వాటితో పాటు 'ఫెస్టివ్ ఆర్ట్స్ థియే టర్'ను సందర్శించి సింగపూర్ సామాజిక నిర్మాణం, ప్రజలకు కల్పిస్తున్న అత్యాధునిక సౌకర్యాల పై అధికారుల ద్వారా ప్రజం టేషన్ తీసుకున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సింగపూర్ మంత్రి గన్ సియో హువాంగ్ అక్కడి విశిష్ట పరిపాలనా విధాన మైన 'మీట్-ది-పీపుల్ సెషన్' గురించి మంత్రుల బృందానికి ప్రత్యేకంగా వివరించారు. తాను ప్రాతి నిధ్యం వహిస్తున్న మేరీమౌంట్ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, అక్కడ ప్రజలతో మమేకమయ్యే విధానం పై ప్రజంటేషన్‌లో మంత్రులకు వివరించారు. సింగ పూర్‌లో ప్రతి వారం ఎంపీలు తమ ప్రాంతాల్లో ఎంపీఎస్ నిర్వ హించి స్థానిక ప్రజల సమస్యలను నేరుగా విని ఎలా పరిష్కరిస్తారో వివరించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సింగపూర్ ప్రతినిధులు అనుసరిస్తున్న ఈ విధానంపై ఏపీ మంత్రుల బృందం ఆసక్తి కనబరిచింది. తమకున్న సందేహాలను నివృత్తి చేసుకుంది. ఈ పర్య టన ద్వారా లభించిన అంతర్జాతీయ స్థాయి అవగా హన, రాష్ట్రంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు, పరిపాలన సంస్కరణలకు దోహదపడనుం దని మంత్రుల బృందం పేర్కొంది. సింగపూర్‌లో ఒక వారపు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



### మంత్రుల బృందానికి ఘనస్వాగతం

అంతకుముందు సింగపూర్ చేరుకున్న మంత్రుల బృందానికి ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఉదయం మంత్రులు అచ్చెన్నా యుడు, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి సింగపూర్ చేరుకున్నారు. సింగపూర్ లోని తెలుగు అసోసియేషన్ ఘన స్వాగతం పలికింది. మంగళవారం నుంచి ఏప్రిల్ 27 వరకు 7 రోజుల పాటు సింగపూర్‌లో మంత్రుల బృందం అధికారికంగా పర్యటించనుంది.

# సమర్ధవంతమైన సేవలు అందించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్
- రాష్ట్ర సచివాలయంలో సివిల్ సర్వీసెస్ దినోత్సవ వేడుకలు




అమరావతి (చైతన్యరథం): 'సివిల్ సర్వెంట్స్ రూల్ ఆఫ్ లా' కు లోబడి సమర్ధవంతమైన సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో 18వ సివిల్ సర్వీసెస్ దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది 'వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర-2047 సిటిజన్ సెంట్రిక్ గవర్నెన్స్ ఫర్ లాస్ట్ మైల్ డెలివరీ' నినాదంతో ఈ వేడుక నిర్వహించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా, ప్రభుత్వ పథకాలు సమాజంలోని దిగువ అంచున ఉన్న ప్రతి వ్యక్తికీ చేరాలనే సంకల్పాన్ని ఈ థీమ్ ప్రతిబింబిస్తోంది. సీఎస్ మాట్లాడుతూ... '1947 ఏప్రిల్ 21న భారత తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నూతనంగా నియమితులైన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లనుద్దేశించి ప్రసంగిస్తూ సివిల్ సర్వెంట్లను "భారతదేశ ఉక్కు చట్రం"గా అభివర్ణించారు. ఆ చారిత్రక ఘట్టానికి గుర్తుగా ప్రతిఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు' అని గుర్తు చేశారు. భారతదేశ పరిపాలన వ్యవస్థకు సివిల్ సర్వెంట్లు వెన్నెముక వంటివారని వీరి అంకితభావాన్ని, నిరంతర కృషిని గౌరవిస్తూ ప్రతి ఏడాది ఏప్రిల్ 21న 'జాతీయ పౌర సేవల దినోత్సవం' నిర్వహిస్తున్నారన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అధికారులను ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశ్యమని సీఎస్ సాయిప్రసాద్ చెప్పారు.

'సివిల్ సర్వెంట్'గా రూల్ ఆఫ్ లాకు లోబడి మన విధులను సమర్ధవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని సీఎస్ సాయిప్రసాద్ పునరుద్ఘాటించారు. సమాజంలోని ప్రతి వ్యక్తీ సౌకర్యవంతంగా ఉండాలని కోరుకుంటారని, అందుకు మనపై అనేక ఆశలు పెట్టుకుంటారని పేర్కొన్నారు. సివిల్ సర్వెంట్‌గా ఎల్లప్పుడూ ఆదర్శవంతంగా ఉండాలని, అదే సమయంలో తన పనితీరును మెరుగుపర్చుకునేందుకు నిరంతరం విజ్ఞానాన్ని, ఆధునిక సాంకేతికతను అలవర్చుకోవాలని సూచించారు.

ఆలోచనలు, మానసిక స్థితి ఎల్లప్పుడూ సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. సివిల్ సర్వెంట్‌గా విధి నిర్వహణలో టఫ్‌గా ఉండాలని, అదే సమయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రొసీజర్, బిజినెస్ రూల్స్, సంప్రదాయాలను పాటిస్తూనే సమస్యలకు పరిష్కార మార్గాలను కనుగొనాలని సూచించారు. ప్రజా సేవ కోసం వచ్చాం... అందుకోసమే పని చేయాలని, ప్రజా హితానికి వ్యతిరేకంగా ఎంతమాత్రం పని చేయరాదని సివిల్ సర్వెంట్లకు మరీ ముఖ్యంగా యువ సివిల్ సర్వెంట్స్‌కు సీఎస్ సాయిప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి స్వాగతం పలికిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ మాట్లాడుతూ... ఈ ఏడాది వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర-2047 సిటిజన్ సెంట్రిక్ గవర్నెన్స్ ఫర్ లాస్ట్ మైల్ డెలివరీ అనే నినాదంతో సివిల్ సర్వీసెస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజాభివృద్ధిలో సివిల్ సర్వెంట్స్ పాత్ర ఎంతో కీలకమన్నారు. సివిల్ సర్వెంట్లు వారి పనితీరును మెరుగుపర్చుకునేందుకు సాంకేతికతను ఉపయోగించుకోవాలని సూచించారు. ఏపీ సివిల్ సర్వెంట్స్‌కు దేశంలో మంచి గుర్తింపు ఉందని, దానిని నిలుపుకునేందుకు వీలుగా ప్రతి సివిల్ సర్వెంట్ మరింత సమర్ధవంతంగా పని చేయాలని సూచించారు.

ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఆర్పీ సిసోడియా, సునీత, ఎంటీ కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శులు జె.శ్యామలరావు, వినయ్‌చంద్, ఎన్.యువరాజ్, హరి జవహర్‌లాల్, సీఎం కార్యదర్శులు ప్రద్యుమ్న, కార్తికేయ మిశ్రా తదితర ఉన్నతాధికారులు మాట్లాడారు.

'వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా దేశ సమగ్రత, స్వేచ్ఛను కాపాడతానని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల ఫలాలు చిట్టచివరి వ్యక్తి వరకు సక్రమంగా అందేలా... పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చిత్తశుద్ధి అంకితభావంతో పని చేస్తానని' పాల్గొన్నవారితో సీఎస్ సాయిప్రసాద్ సివిల్ సర్వీసెస్ రీడెడికేషన్ ప్రతిజ్ఞ చేయించారు. పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధిపతులు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### అనంతబాబు ఇంట్లో పోలీసుల సోదాలు

# అరెస్టుకు రంగం సిద్ధం



కాకినాడ(చైతన్యరథం): డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సంబంధించిన కాకినాడలోని అపార్ట్‌మెంట్‌లో పోలీసులు మంగళవారం ఆకస్మికంగా సోదాలు చేపట్టారు. ముగ్గురు సిఐల బృందం అక్కడికి వెళ్లి సోదాలు నిర్వ హించినట్లు సమాచారం. సాక్ష్యాల ఆధారంగా ఆయనను అరెస్టు చేసేందుకు పోలీసు లు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, పోలీ సులు చేరుకునే సమయానికి అనంతబాబు అక్కడ లేకపోవ డం గమనార్హం. పోలీసులు వస్తున్నారనే సమాచారాన్ని ముందుగానే తెలుసుకుని ఆయన పరార్ అయినట్లు తెలుస్తోంది. అనంతబాబు కోసం పోలీసులు గాలింపు చర్యలు వేగవంతం చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక సాక్షులను ప్రభావితం చేయడానికి ఆయన ప్రయత్నించారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చా యి. సాక్షుల నుంచి సేకరించిన సమాచారం, ఆధారాల ఆధారంగా పోలీసులు ఈ దిశగా చర్య లు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సిట్ సీసీటీవీ ఫుటేజ్, కాల్ రికార్డులు వంటి కీలక ఆధారాలను సిట్ సేకరించింది.దర్యాప్తులో భాగంగా ఈ హత్య లో అనంతబాబు పాత్ర ఉందని సిట్ తేల్చినట్లు సమాచారం. అలాగే ఆయన భార్య అనంత లక్ష్మీ దుర్గను ఈ కేసులో ఏ-2గా చేర్చడం కూడా కీలక పరిణామంగా మారింది.

# జగన్‌ను బీసీలు ఎప్పటికీ నమ్మరు

- వారిని వేధించడం వల్లే ఓడగొట్టారు
- త్వరలో ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం
- బీసీ సంక్షేమ మంత్రి సవిత



అనంతపురం(చైతన్యరథం): అధికారంలో ఉన్నప్పుడు బలహీన వర్గాలను జగన్ అణగదొక్కారని, ఇప్పుడు ఆయనకు బీసీలు గుర్తు కొస్తున్నారని, వారిపై ఎక్కడాలేని ప్రేమ కురిపిస్తున్నారని మంత్రి ఎస్.సవిత ధ్వజమెత్తారు. బీసీలపై జగన్‌ది కపటి ప్రేమేనని, ఆయ నను ఎవరూ నమ్మే పరిస్థితి లేదని హితవుపలికారు. నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం నిర్వహించిన విలేకరు ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీలు అంటేనే టీడీపీ అని స్పష్టం చేశారు. బీసీల అభివృద్ధి కోసం అన్న ఎన్టీఆర్ టీడీపీని ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తూ బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నాం. బీసీ రక్షణ చట్టానికి తుది రూపు తీసుకొస్తున్నాం. త్వరలోనే ఈ చట్టాన్ని అమలు చేయబోతున్నామని వివరించారు. ప్రతి బీసీ కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దుతున్నా మని తెలిపారు. త్వరలో ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. చట్ట సభల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామ న్నారు. స్థానిక సంస్థల్లోనూ 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. బీసీలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.

### జగన్‌కు బీసీలు ఇప్పుడు గుర్తుకొచ్చారా?

అధికారంలో ఉన్నప్పుడు బీసీలను జగన్ అన్ని విధాలా వేధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులు బనాయిం చి బీసీలను వేధించడం వల్లే ఎన్నికల్లో జగన్‌కు బీసీలు తగిన గుణపాఠం చెప్పారు. మరోసారి బీసీలను మోసగించడానికి సిద్ధ మవుతున్నారు. ఇన్నాళ్లకు జగన్‌కు బీసీలు గుర్తుకొస్తు న్నారా? అని నిలదీశారు. జగన్ మాయమాటలను బీసీలు నమ్మే పరిస్థి తిలో లేరని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనని మంత్రి సవిత స్పష్టం చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచి పోవడానికి ముఖ్యకారణం జగన్. పట్టిసీమ ప్రాజెక్టు చేపటొద్దని ఆనాడు జగన్ అనలేదా? అని నిలదీశారు. రాయలసీమను రూ.40 వేల కోట్లతో హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. జనాభా భారం కాదు..ఆస్తి అని సీఎం చంద్రబాబు చెప్పారు. పెరిగే జనాభాకు నుగుణంగా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నారని తెలిపారు.

# ఇంటికో ఒక పారిశ్రామికవేత్త సాకారం కావాలి



- ఇండస్ట్రియల్ ప్రమోషనల్ అధికారిని నామినేట్ చేస్తాం
- ఎంఎంస్ఎంఈపై మంత్రి కొండపల్లి సుదీర్ఘ సమీక్ష

అమరావతి(చైతన్యరథం): ఒక కుటుంబంలో ఒక పారిశ్రా మివేత్తను తయారు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యా నికి అనుగుణంగా ఎంఎంస్ఎంఈ పనిచేయాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాం ధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మంగళగిరి ఏపీఐఐసీ టవర్స్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో ఎంఎస్ఎంఈపై మంత్రి సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల శాఖ పనితీరుతో పాటు అమలుచేస్తోన్న వివిధ పథకాల పురోగతిపై చర్చించారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఏపీ చీఫ్ మినిస్టర్స్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ప్రోగ్రామ్, ఏపీ క్లస్టర్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ అమలుకు తీసు కోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఎంఎం స్ఎంఈలకు కావాల్సిన అవసరాలు తీర్చడంలో ప్రతి నియోజక వర్గానికి ఒక ఇండస్ట్రియల్ ప్రమోషనల్ అధికారిని నామినేట్ చేస్తామని.. వారు నియోజకవర్గ విజన్ ప్లాన్‌లో పరిశ్రమల కోసం పనిచేసే సిబ్బందితో సమన్వయం చేసుకుంటారని మంత్రి తెలిపా రు. ఈ విషయంలో ఆదేశాలు జారీ చేయాలని డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్‌కు మంత్రి సూచించారు. ప్రభుత్వ సంస్థలు, కార్పొరేట్ సంస్థల నుంచి ఎంఎస్ఎంఈలకు రావాల్సిన బకాయిలు డిలే అయితే ఫెసిలిటేషన్ కౌన్సిల్ ద్వారా ఓడీఆర్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉంచి తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్‌ను ఆదేశించారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే జిల్లా పరిశ్రమల ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ ముందు ఎంఎంస్ఎంఈను పటిష్టం చేసేలా ఎజెండాలు తయారు చేయా లని జిల్లా పరిశ్రమల అధికా రులకు సూచించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలు తయారు చేయాలని పరిశ్రమల శాఖ డైరెక్టర్‌కు సూచించారు. ఎంఎస్ఎంఈని పటిష్టం చేసేందుకు గ్రామ, మండల, నియోజ కవర్గ స్థాయి నుంచి హెచ్‌వోడీ వరకు అందరూ సమన్వయంతో పని చేసి ముఖ్యమంత్రి రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధి కోసం తీసుకున్న చర్యలను కలిసికట్టుగా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఈ సమీక్షలో సెక్రటరీ ఇండస్ట్రీస్ డాక్టర్ ఎన్.యువరాజ్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ శుభం బన్సాల్, ఏపీ ఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ, ఇతర పరిశ్రమల అధికారులు మరియు వివిధ జిల్లాల పరిశ్రమల అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# చంద్రబాబు విజన్ ప్రపంచానికే ఆదర్శం



- విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత రచయితలదే
- సమాచార మంత్రి కొలుసు పార్థసారథి
- “అజేయుడు” పుస్తకావిష్కరణ

విజయవాడ(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మది నోత్సవాన్ని పురస్క రించుకుని సీనియర్ జర్నలిస్ట్ టీడీ ప్రసాద్ “అజేయుడు” పేరిట రచించిన పుస్తకాన్ని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి ఆవిష్కరించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో పలువురు సీని యర్ పాత్రికే యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్ర బాబు నాయకత్వంలో కొనసాగు తున్న ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వా ములు కావడం మనందరి అదృష్ట మన్నారు. 76 ఏళ్ల వయసులోనూ రాష్ట్ర అభివృద్ధి కోసమే తపిస్తున్న చంద్రబాబుపై ఎంత సాహిత్యం వచ్చినా, ఎన్ని పుస్తకాలు రాసినా తక్కువే. చంద్రబాబు విజన్ ప్రపం చానికే ఆదర్శమని.. దానిని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత పాత్రికేయులు, రచ యితలపై ఉందని పేర్కొన్నారు. వెటరన్ జర్నలిస్టుగా ప్రసాద్ ముఖ్యమంత్రిపై మంచి రచనలు చేయడం ముదావహ మని ప్రశంసించారు. సహా రచయితగా వ్యవహరించిన సీనియర్ ఫ్రీలాన్స్ జర్న లిస్ట్ డాక్టర్ రవికుమార్ బొప్పన ముఖ్య మంత్రితోపాటు రాష్ట్ర మానవ వనరులు, మంత్రి నారా లోకేష్ నాయకత్వ పటిమపై మంచి వ్యాసాలను రచించి ఈ పుస్తకంలో ప్రచురింపచేశారని కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కనదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ సభ్యుడు సతీష్, కృష్ణా జిల్లా పరిషత్ సీఈవో జె.అరుణ, సీనియ ర్ తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# ఎండల తీవ్రతతో విద్యార్థులకు అస్వస్థత

## అధికారులకు మంత్రి సంధ్యారాణి కీలక ఆదేశాలు





అల్లూరి సీతారామరాజు జిల్లా (చైతన్యరథం): అల్లూరి సీతారా మరాజు జిల్లాలో పెదబయలు ఏకలవ్య పాఠశాల లో విద్యార్థులు మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయంపై ఏపీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెంటనే స్పందించి కలెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకు న్నారు. పిల్లలు అస్వస్థతకు గురవడం ఫుడ్‌పాయిజన్ వల్ల కాదని, ప్రస్తుతం ఉన్న ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్లే అలసట, అస్వస్థతకు గురయ్యారని వైద్యులు ప్రాథమికంగా గుర్తించారని మంత్రికి అధికారులు వివరించారు. ఈ ఘటనపై మంత్రి సంధ్యారాణి జిల్లా అధికారులతో, పెదబయలు మెడికల్ ఆఫీసర్‌తో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలపై ఆరా తీశారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేకం గా దృష్టి పెట్టాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. అలాగే పిల్లలకు ఓఆర్ఎస్‌లు తాగించడంతోపాటు అవసరమైన వైద్య చికిత్స అందిస్తున్నా మని మంత్రికి అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఆస్పత్రికి తరలించిన సుమారు పదిమంది విద్యార్థులు చికిత్స అనంతరం కోలుకుని హాస్టల్‌లో ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. హాస్టల్లోనే మరో 48 గంటలు డాక్టర్ల పర్యవేక్షణలో విద్యార్థులు ఉండాలని అధికారులకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు.

# వైరా-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభం

## హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు తగ్గనున్న దూరం

## బైక్‌లు, ఆటోలు, ట్రాక్టర్లకు ప్రవేశం లేదు



కొయ్యలగూడెం(చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం తెలంగాణ లోని వైరా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లి వరకు నిర్మించిన గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి ప్రారంభమైంది. వైరా వద్ద ప్రాజెక్ట్ పీడీ దివ్య టోల్‌గేట్‌లను ప్రారంభించారు. వైరా నుంచి ఏలూరు జిల్లా పొంగుటూరు వరకు ఉన్న 116వ కిలోమీటర్ దాకా టోల్‌గేట్‌లు ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి ఈ రహదా రిపై ప్రయాణించే వాహనాలకు టోల్ బిల్లు పడనుంది. అయితే ఎంత మేర ప్రయాణిస్తే అంతవరకే ఫీజు వసూలు చేస్తారు. తెలంగాణలో 33వ కిలోమీటర్ నుంచి ఏపీలోని పొంగుటూరు 149 కిమీ వరకు టోల్‌చార్జీలు పడనున్నాయి. ఈ రహదారి వల్ల హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లే వారికి 50 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఈ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలు, ట్రాక్ట ర్లు, ఆటోలకు అనుమతి లేదు.

### నీతి ఆయోగ్ ‘దివ్య భారత్’ నివేదికలో

# ఏపీ పర్యాటకానికి అగ్రతాంబూలం

## కూటమి ప్రభుత్వ దక్షతతో జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు



అమరావతి (చైతన్యరథం): భారత దేశంలోని వివిధ రాష్ట్రాల వైవిధ్యభరితమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సహజ సౌందర్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ నీతి ఆయోగ్ విడుదల చేసిన “దివ్య భారత్-ఎ విండో టు ది సోల్ ఆఫ్ ఇండియా” నివేదికలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి పెద్దపీట వేసింది. కూటమి ప్రభుత్వ కృషితో రాష్ట్ర పర్యాటక రంగం నేడు అద్భుత ప్రగతి ప్రయాణం సాగిస్తోందని ఈ నివేదిక చాటిచెప్పింది.

**ప్రపంచ పటంలో ఏపీ పర్యాటక వైభవం:**

నీతి ఆయోగ్ విడుదల చేసిన 13 పేజీల సమగ్ర నివేదిక, 1.20 నిమిషాల నిడివి గల ప్రత్యేక వీడియో ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక గమ్యస్థానాలను ప్రపంచానికి పరిచయం చేశారు. భవిష్యత్తు అంతా పర్యాటకానిదే అని ఆకాంక్షించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆశయాలకు ఈ నివేదిక మరింత బలాన్ని చేకూర్చింది.

ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించేందుకు అక్టోబరు నుంచి ఫిబ్రవరివరకు అత్యంత అనువైన సమయమని పేర్కొన్న నీతి ఆయోగ్...ఏయే నెలల్లో ఏ ప్రాంతాలను సందర్శించాలో విపులంగా వివరించింది. కూచిపూడి, విలాసిని నాట్యాల వంటి సంప్రదాయ కళలకు ఏపీ కేంద్రమని, ఇక్కడి ఆత్మీయ ఆతిథ్యం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుందని అభివర్ణించింది. రాష్ట్రంలోని ప్రకృతి ప్రాంతాలు, ప్రసిద్ధ చారిత్రక కట్టడాలు, పురాతన కోటలు, సహజసిద్ధంగా ఏర్పడ్డ గుహలు, విశాల సముద్రతీరం, అద్యాత్మిక ప్రాంతాలు, ప్రఖ్యాతి గాంచిన స్థానిక వంటకాలు, సంప్రదాయ వస్త్రాలు, హస్త కళాకృతులు, బౌద్ధారామాలు, పర్యాటక ఉత్సవాలు, ఘనమైన వారసత్వం తదితర విశేషాలను నీతి ఆయోగ్ తన నివేదికలో పేర్కొంది.

**నివేదికలో ప్రస్తావించిన ప్రధాన పర్యాటక ప్రాంతాలు:**

***ప్రకృతి ఒడిలో:*** అరకు వ్యాలీ, లంబసింగి, మారేడుమిల్లి, పాపికొండలు, కురుపాం అటవీ ప్రాంతాలు, దట్టమైన నల్లమల్ల అడవులు, హార్సిలీ హిల్స్, కొల్లేరు,పులికాట్ సరస్సు,అందమైన కోనసీమ.

***జలపాతాలు, రిజర్వాయర్లు:*** కొత్తపల్లి, రంప, తలకోన, ఎత్తిపోతల జలపాతాలు, కంభం చెరువు, అనకాపల్లి కోనం మరియు తాటిపూడి రిజర్వాయర్లు.

***వన్యప్రాణి సంరక్షణ:*** కంబాలకొండ, కోరింగ మడ అడవులు, నేలపట్టు, ఉప్పలపాడు పక్షి సంరక్షణ కేంద్రాలు.

***చారిత్రక, సాహస యాత్రలు:*** బొర్రా గుహలు, బెలూం గుహలు, ఉండవల్లి, మొగల్రాజపురం, ఉదయగిరి గుహలు. గండికోట (గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియా), కొండపల్లి కోట, చంద్రగిరి, గుత్తి కోటలు

***తీర ప్రాంత సౌందర్యం:*** రుషికొండ, సూర్యలంక, కొత్తపట్నం బీచ్‌లు, ఎర్రమట్టి దిబ్బలు, కాకినాడ హోప్ ఐల్యాండ్ మరియు గిన్నీస్ రికార్డులో నిలిచిన 5 శతాబ్దాల నాటి తిమ్మమ్మ మర్రిమాను.

***ఆధ్యాత్మిక వైభవం:*** తిరుమల వేంకటేశ్వరస్వామి, శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ, అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, విశాఖ అప్పికొండ శ్రీసోమేశ్వర ఆలయం, పాలకొల్లు క్షీరారామ క్షేత్రం, మహానంది, యాగంటి, పరిటాల ఆంజనేయ స్వామి, రామతీర్థం, శ్రీముఖ లింగం.

***వారసత్వ కట్టడాలు:*** లేపాక్షి ఆలయం, అమరావతి మహాచైత్యం, బావికొండ బౌద్ధ స్మారకాలు, కడప పెద్ద దర్గా, నెల్లూరు బారా షాహిద్ దర్గా, గుంటూరు జేఎం బాప్టిస్ట్ చర్చి, చేబ్రోలు చర్చి.

***ప్రత్యేక ఆకర్షణలు:*** రాజమహేంద్రవరం రైల్వే వంతెన, కోనసీమ దిండి, కృష్ణా నది, వేంకటేశ్వర నేషనల్ పార్క్, ఓర్వకల్లు రాక్ గార్డెన్, కదిరి క్షేత్రం.

**సంస్కృతి-రుచులు-కళలు**

***రుచులు:*** పులిహోర, పూతరేకులు, కాజా, పెసరట్టు, గోంగూర పచ్చడి, ఉలవచారు, బొబ్బట్లు, రాగి సంగటి, ఆంధ్రా చికెన్ కర్రీ, చేపల పులుసు, గుత్తి వంకాయ, అరిసెలు.

***ఉత్సవాలు:*** తిరుమల బ్రహ్మోత్సవాలు, లేపాక్షి, విశాఖ, లుంబిని ఉత్సవాలు, కోనసీమ సంక్రాంతి సంబరాలు, ఫ్లెమింగో ఫెస్టివల్, దక్షిణ హస్త కళా మేళా.

***వస్త్రాలు, హస్తకళలు:*** మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ జామ్దానీ, కలంకారీ చీరలు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, నరసాపురం లేస్, బుడితి మెటల్ క్రాఫ్ట్స్.

**ఇవే గాక మరిన్ని పర్యాటక ప్రాంతాలు, ఇతర అంశాలకు జాబితాలో చోటు దక్కింది**

ఈ సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. “ముచ్చటైన ముక్కోణపు పాలనలో ప్రపంచ పర్యాటక చిత్రపటంపై ఏపీ వైభవం వెలుగుతోంది. నీతి ఆయోగ్ నివేదికలో పేర్కొన్న ప్రతి ప్రాంతాన్నీ అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నాం. ఏపీలోని ప్రతి జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటికి విశేష ప్రాచుర్యం కల్పిస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచనలు, కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఇది సాధ్యమైంది. 2030 నాటికి భారతదేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఏపీని నిలుపుతాం. కొత్త పర్యాటక పాలసీ, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా, అనుబంధ పాలసీలు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు, ఎక్స్‌ప్రెస్‌వేలతో పర్యాటకానికి ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారుతుంది. సందర్శించండి స్వర్ణాంధ్రను.. ఆస్వాదించండి అడుగడుగునా ఆత్మీయ ఆతిథ్యాన్ని!” అని పిలుపునిచ్చారు.

# ఇంకానా.. అబద్ధాల గారడీ!?

## ‘మహిళా పక్షపాతి’నని చెప్పుకుంటే సరిపోతుందా జగన్..

“మహిళా పక్షపాతి” అంటూ వైసీపీ చేసిన ప్రచారం ఎంత గట్టిగా వినిపించినా.. వాస్తవ జీవితంలో మహిళలు ఎదుర్కొన్న అనుభవాలు మాత్రం పూర్తిగా విరుద్ధ దిశలో సాగాయి. మాటల్లో మహిళలమీద గౌరవం, సభల్లో హామీలు, పోస్టర్లలో పెద్ద పెద్ద నినాదాలు.. ఇవన్నీ కనిపించినా.. వాస్తవానికి జగన్ హయాంలో మహిళలకు భద్రత లోపించడం, వేధింపులు పెరగడం, న్యాయం కోసం ముందుకొచ్చిన మహిళలను అణచివేయడం వంటి సంఘటనలు వరుసగా చోటుచేసుకున్నాయి. మహిళా సాధికారత పేరుతో ప్రచారం చేసిన గత ప్రభుత్వం, అదే మహిళలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుక సాధనాలుగా మార్చిందనే భావన సమాజంలో బలంగా వేళ్లూనుకుంది. ప్రచారం ఒకవైపు.. వాస్తవం మరోవైపు అన్న విరుద్ధ దృశ్యం మహిళల్లో అసంతృప్తిని, ప్రజల్లో ఆగ్రహాన్ని మరింతగా పెంచింది.

**వైసీపీ హయాంలో మహిళల ఆవేదన**

అమరావతి మహిళా రైతులు తమ భూములిచ్చి భవిష్యత్తు కోసం ఆశలు పెట్టుకుంటే... వారిని ఆదుకోవాల్సిన అప్పటి వైసీపీ ప్రభుత్వం వారిపైనే కేసులు పెట్టడం, రోడ్లపై ఈడ్చడంవంటి ఘటనలు మరచిపోలేనివి. ఇది కేవలం రాజకీయ వైఫల్యం కాదు.. మహిళల గౌరవంపై దాడిగా ప్రజలు భావించారు. అదే సమయంలో కొంతమంది వైసీపీ నాయకులు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, అవమానకరంగా మాట్లాడడం.. ఆ పార్టీ అసలు మనస్తత్వాన్ని బయటపెట్టింది. మహిళల గౌరవం గురించి మాట్లాడే హక్కు అసలు వారికి ఉందా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తింది. వైసీపీ హయాంలో మద్యం విధానం మరో పెద్ద దెబ్బగా మారింది. కుటుంబాలు చీలిపోయాయి, మహిళలు మానసికంగా, ఆర్థికంగా నష్టపోయారు. భర్తలు మద్యానికి బానిసవడంతో వారి వల్ల ఎంతోమంది మహిళలు కష్టాలు పడాల్సి వచ్చింది. సంక్షేమం పేరుతో డబ్బు ఇస్తూనే.. అదే డబ్బు, మద్యం ద్వారా తిరిగి తీసుకునే విధానం అమలు చేయడం ఎంత పెద్ద విరుద్ధమో ప్రజలు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైసీపీ పాలనపై మహిళల్లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం పెరిగింది. అప్పుడే వైసీపీ “మహిళా పక్షపాతి” కాదు “మహిళా కక్షపాతి” అనే నిజాన్ని తెలుసుకున్నారు.

**కూటమి పాలనలో మహిళల సాధికారత**

నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితుల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పరిపాలనలో సమతుల్యత, బాధ్యత, స్పందన కనిపిస్తోంది. మహిళల భద్రతను కేవలం మాటల్లో కాకుండా కార్యాచరణలో చూపించాలనే దృక్పథం స్పష్టంగా కనిపిస్తోంది. సమస్య వచ్చిన వెంటనే స్పందించడం, బాధితులకు న్యాయం జరిగేలా చూడడం, మహిళల గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవస్థలను బలోపేతం చేయడం... ఇవన్నీ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి. కూటమి ప్రభుత్వం మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా, సమాజ నిర్మాణంలో కీలక శక్తిగా గుర్తిస్తోంది. వారికి అవకాశాలు కల్పించడం, నిర్ణయాల్లో భాగస్వామ్యం ఇవ్వడం, భద్రతా వ్యవస్థలను మరింత బలపరచడం.. ఇవన్నీ నిజమైన సాధికారత దిశగా వేస్తోన్న అడుగులు. చంద్రబాబు పాలనలో ముందే చూసిన అభివృద్ధి, పరిపాలనా అనుభవం ఇప్పుడు మళ్లీ మహిళల జీవితాల్లో భరోసా నింపే దిశగా ఉపయోగపడుతోంది. కేవలం నినాదాలు కాదు.. ఫలితాల ద్వారా నమ్మకం సంపాదించాలనే లక్ష్యం కనిపిస్తోంది. అదే కూటమి ప్రభుత్వానికి ప్రధాన బలం. మహిళలను గౌరవించని రాజకీయానికి భవిష్యత్తు లేదు. వారిని అవమానించే నేతలు ఎంత పెద్దగా మాట్లాడినా ప్రజలు క్షమించరు. వైసీపీ నాయకుల మాటలు, వారి వైఖరి ఈ విషయాన్ని స్పష్టంగా చూపించాయి. అందుకే ఈరోజు ప్రజలు ఆలోచిస్తున్నారు.. ఎవరు నిజంగా మహిళల పక్షాన నిలిచారు? ఎవరు కేవలం ప్రచారం చేసుకున్నారు? ప్రజల అనుభవం ఒకటే చెబుతోంది.. వైసీపీపై పెరిగింది ఆగ్రహం, కూటమి అంటే నమ్మకం. ఇక్కడే మహిళల గౌరవం, భద్రత, భవిష్యత్తు కోసం ప్రజలు తీసుకునే నిర్ణయం స్పష్టంగా కనిపిస్తోంది.

**- శాంతి జలసూత్రం,**
**అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

# మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

- అన్ని విభాగాలను పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర
- అస్తవ్యస్త పార్కింగ్‌పై అసంతృప్తి.. వెంటనే చర్యలకు ఆదేశం
- ఓపీ రద్దీ, సిబ్బంది కొరత, పరికరాల అవసరంపై సమీక్ష



మచిలీపట్నం(చైతన్యరథం): సర్వజన ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటు న్నామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం మంత్రి ఆకస్మికంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని తనిఖీచేశారు. స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుకుంటూ ఆసుపత్రి ప్రాంగణంలోకి వచ్చిన ఆయన, అక్కడ అస్తవ్యస్తంగా నిలిపి ఉన్న వాహనాలను గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పర్యవేక్షకులు, పార్కింగ్ ఇన్‌చార్జిని పిలిపించి, వాహనాలను నిర్దిష్ట పార్కింగ్ ప్రదేశంలోనే నిలిపేలా కఠిన చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్‌లో స్థలం లేకుంటే ఆసుపత్రి బయటే ఉంచేలా పర్యవేక్షిం చాలని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించిన ఆయన ఏర్పాట్లు, వసతులు, పారిశుధ్యాన్ని సమీక్షించారు. మరోసారి తనిఖీ చేస్తానని, అప్పటికి ఏ లోపం కూడా లేకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని హెచ్చరించారు. రోగులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, తేడా వస్తే సహించేది లేదని తెలిపారు. వైద్యులు అందుబాటులో ఉన్నారా,మందులు సక్రమం గా ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం పర్యవేక్షకులు, సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లతో సమా వేశమై ఆసుపత్రిలో ఉన్న పరికరాలు, అవసరమైన సదుపాయాలపై చర్చించారు. ప్రతిరోజూ సుమారు 1600మంది ఓపీ రోగులు వస్తున్నారని, 605 పడక లతో ఆసుపత్రి ప్రభుత్వ వైద్యకళాశాలకు అనుబంధం గా నడు స్తోందని మంత్రి తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు మచిలీపట్నంలోనే నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పా రు. స్టాఫ్‌నర్సుల కొరత సుమారు 90మంది ఉందని, దాన్ని త్వరలో భర్తీ చేయాల్సి ఉందన్నారు. కొన్ని పరికరాలు, వెంటిలేటర్ల అవసరం ఉన్నట్లు వైద్యులు తన దృష్టికి తీసుకొచ్చారని,సీఎస్ఆర్ నిధులు, ప్రభు త్వ నిధులతో వాటిని సమకూర్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ప్రతి మంగళవారం సదరం పరీక్షలు ఉండ టంతో సాధారణ ఓపీ రోగులకు ఇబ్బంది కలుగుతు న్నట్లు గమనించా మని, ఈ రెండు సేవలకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. డైట్ భవనంలో ఏర్పాట్లుచేసే విషయమై డీఎంహెచ్ఓ తో చర్చిస్తామని చెప్పారు. ఈ పర్యటనలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ లీలా ప్రసాద్, ఆర్ఎంఓ నిరం జన్‌కుమార్,సీనియర్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, భగత్‌సింగ్‌నాయక్, ఎస్సీ విజిలెన్స్ కమిటీ సభ్యులు విద్యాసాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దేవగుప్తం సొసైటీలో నిధుల స్వాహా

- వైసీపీ నేత జున్నూరు రామారావుపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- గత ప్రభుత్వంలో పట్టా భూమి ఆక్రమణ... తప్పుడు కేసుల పేరుతో బెదిరింపులు
- చీటీల పేరుతో రూ.7.65 లక్షల మోసం... డబ్బులు అడిగితే బూతులు తిడుతూ దౌర్జన్యం
- అప్పు పేరుతో భూమి దోపిడీ... న్యాయం చేయాలంటూ వినతి
- అర్జీలు స్వీకరించిన గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి
- సమస్యల పరిష్కారానికి నేతల కృషి



మంగళగిరి(చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్రకార్యాలయంలో మంగళవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన గెద్దం సత్య నారాయణ వినతి.... 'దేవగుప్తం సొసైటీ మాజీ చైర్మన్, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర నాయకుడు జున్నూరు రామా రావు(బాబీ) హయాంలో భారీగా నిధుల దుర్వినియోగం జరిగింది. సొసైటీ చైర్మన్‌గా పనిచేసిన కాలంలో కమిషన్ల కోసం రామారావు పలు అక్రమాలకు పాల్పడి, సొసైటీ నిధులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకున్నారు. ఈ అక్రమాలపై గతంలో ఫిర్యాదు చేయగా విచారణకు ఐదుగురు అధికారులను నియమించినా ఇప్పటివరకు ఆ నివేదికను బయట పెట్టలేదు. స్థానిక నాయకులు, సహ కార సంఘం అధికారుల అండదండలతో విచారణను తొక్కిపెడుతున్నారు. దీనివల్ల సొసైటీకి రైతులకు అన్యా యం జరుగుతోంది' అన్నారు.

పల్నాడుజిల్లా వినుకొండ మండలం సొలగంగవరం గ్రామానికిచెందిన బాలకోటయ్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. మా గ్రామంలో నాకు సర్వేనంబర్లు 17/6,17/7, 17/8 లో పట్టా భూమి వుంది. కొంతకాలంగా మా గ్రామానికి చెందిన దారా చెన్నయ్య, దారా వెంగళరావు అనే వ్యక్తులు మా భూమిలోని కొంత భాగాన్ని 60సెంట్లు ఆక్రమించు కున్నారు. సొంత భూమిని నాకు విడిచిపెట్టమని అడిగి నందుకు, వారు నన్ను అత్యంత దారుణంగా దూషిస్తూ ఎదురుదాడికి దిగుతున్నారు. అంతేకాకుండా "ఎక్కువ మాట్లాడితే నీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం" అని భయభ్రాంతులకు గురిచేస్తున్నా రు. గత ప్రభుత్వ హయాంలో ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా ఎలాంటి న్యాయం జరగలేదు.

ప్రకాశంజిల్లా ఒంగోలుకు చెందిన నాగరత్నమ్మ గ్రీవెన్స్ లో అర్జీ...మంగమూరురోడ్డు ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ సమీపంలో నివసిస్తున్నాను. నా భర్తతో కలిసి కూలిపనులు చేసుకుం టూ జీవనం సాగిస్తున్నాను. మనవడైన పాలేరు పూర్ణ చంద్రరావు ప్రస్తుతం లండన్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ పోషణ,వైద్యఖర్చుల కోసం రూపాయి రూపాయి జాగ్రత్తగా పొదుపు చేస్తున్నాడు. ఈ క్రమంలో సింగరాయకొండకు చెందిన జవ్వాజి అశోక్‌రెడ్డి, అతని భార్య సుస్మిత మాకు పరిచయమై మా మనవడిని నమ్మించి చీటీలు వేస్తున్నామ ని మాయమాటలు చెప్పారు. వారిమాటలు నమ్మి 20.4. 2024 నుంచి 10.10.2025 వరకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వారి బ్యాంక్‌ఖాతాకు మొత్తం రూ.7,65,390 పంపించాము. సదరు గడువు ముగిసిన తర్వాత మాకు డబ్బులు తమకు ఇవ్వమని అడగ్గా... వారు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారు. ఇటీవల మా బంధు వులతో కలిసివారి ఇంటికి వెళ్లగా ఆ భార్యాభర్తలు ఇద్దరూ అత్యంత దారుణంగా ప్రవర్తించారు. "మీకు రూపాయి కూడా ఇవ్వం, ఏం చేసుకుంటారో చేసుకోండి, మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు"అంటూ బూతులు తిడుతూ, మాపై దౌర్జన్యం చేసి ఇంటి నుంచి గెంటివేశారు. నా మనవడు విదేశాల్లో రాత్రి పగలు కష్టపడి తన ఆరోగ్యం కోసం దాచుకున్న డబ్బు అది. ఈ వయసులో దిక్కులేని స్థితిలో ఉన్న మమ్ములను వారు మోసం చేశారు. గ్రామ పెద్దలకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది.

సత్యసాయిజిల్లా ముదిగుబ్బ మండలం తప్పేటవారి పల్లి గ్రామానికి చెందిన బిజయ్య అర్జీ... మా గ్రామంలో సర్వే నెం. 256లో మాకు మొత్తం 13.75 ఎకరాల భూమి ఉంది. 9.75 ఎకరాలకు పాసు పుస్తకం ఉండగా మిగిలిన 4 ఎకరాలు అదే సర్వే నెంబర్లో తూర్పు భాగంలో ఉంది. తమ అన్న జయరాజు గతంలో చేసిన రూ.25వేలు అప్పు కోసం పరికెట్టి వెంగముని ఐదు ఎకరాలు రాయించుకున్నారు. కానీ ప్రస్తుతం వెంగముని, అతని తమ్ముడు శేషచలపతి, ఇతరులు కలిసి తన ఆధీనంలో ఉన్న మిగిలిన భూమిని కూడా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. రెండుసార్లు సర్వే కోసం చలానా కట్టినప్పటికీ అధికారులు భూకబ్జాదారులకు వత్తా సు పలుకుతూ సర్వే చేయకుండానే "క్లోజ్ చేశాం" అని అబద్ధాలు చెప్తున్నారు. డివిజన్ సర్వేయర్ మురళీకృష్ణ నన్ను బెదిరించి, ఖాళీ పేపర్లపై సంతకాలు చేయించుకుని రికార్డులను తారుమారు చేశారు. ఎస్సీ కులం కావడంతో మమ్మల్ని చులకనగా చూస్తూ "మీకున్న భూమి కూడా లేకుండా చేస్తాం" అని అధికారులు బహిరంగంగా బెదిరి స్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు.

కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం తిప్పనూరు గ్రామానికి చెందిన సుభాష్‌చంద్రబోస్ అర్జీ... మా గ్రామ సర్వే నెం.462లో మొత్తం 4.29 ఎకరాల భూమి మా తాతగారైన పట్టాదారు బజ్జారి పేరు మీద ఉండేది. ఈ మొత్తం భూమిలో ఇప్పటికే 3.24ఎకరాలకు సంబంధించి నా పేరిట పట్టాదారు పాసు పుస్తకం (ఖాతా నంబరు: 2015) మంజూరైంది. మిగిలిన 1.05 ఎకరాల భూమిని గత ప్రభుత్వ హయాంలో పొరపాటున 'రాఘన్న గౌడు' అనే వ్యక్తి పేరు మీద ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. వాస్తవా నికి ఆ భూమి నాదే అని గుర్తించిన స్థానిక తహసీల్దారు కూడా ఆ 1.05ఎకరాలను నా పేరిట మార్చాలని గతం లోనే సిఫారసు చేసి ఉన్నారు.

కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకి గ్రామాని కి చెందిన జయప్రద అర్జీ...పశ్చిమ గోదావరిజిల్లా పెద వేగి మండలం లక్ష్మీపురంలోని సర్వే నెం.556/2లో రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం అసైన్ చేసింది. దానికి సంబంధించి నావద్ద డి-ఫామ్ పట్టా,పాసు పుస్తకం ఉన్నా యి. గతంలో నేను ఆ భూమిలో వ్యవసాయం చేస్తూ ప్రభు త్వానికి శిస్తుచెల్లించాను. అయితే వృద్ధాప్యం, ఆర్థిక ఇబ్బం దులతో మధ్యలో కొంతకాలం సాగు చేయలేకపోయాను. ప్రస్తుతం ఆ భూమి నా స్వాధీనంలోనే ఉంది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం ఆ భూమిని 'డి-రిజర్వ్' చేయ వలసిందిగా కలెక్టర్‌ను కోరగాఆయన ఈ ఫైలును భూపరి పాలన ప్రధాన కమిషనరుకు పంపారు. ఈ విషయమై సీసీఎల్ఏ కార్యాలయంలో సంప్రదించగా వారు ఈ విష యాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చెప్పారు. కానీ నేటికీ ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో ఆ భూమిని పూర్తిస్థాయిలో సాగు చేసుకోలేక నా వైద్య ఖర్చులకు, జీవనానికి చాలా ఇబ్బంది పడుతున్నాను.

సత్యసాయిజిల్లా బుక్కపట్నం మండలం చింతలయ్య గారిపల్లి గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ వినతి... నాకు సర్వే నంబర్లు 179, 182, 189, 206, 254, 886, 887లో గల భూములకు గౌరవప్రదమైన కోర్టు ద్వారా భాగాలు కేటాయించారు. కోర్టు తీర్పు ప్రకారం నాకు రావలసిన భూమిలో సర్వే నెం.886,887కు సంబంధించి న కొంత భూమిని వేరొక వ్యక్తి అతడి పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడు. ఈ విషయమై నేను బుక్కపట్నం తహ సీల్దారు,వీఆర్వోలను కలిసి కోర్టు తీర్పుపత్రాలను చూపిం చి, అక్రమంగా నమోదైన పేరును తొలగించి నాకు పాసు పుస్తకాలు ఇవ్వమని కోరాను. నెలలు గడుస్తున్నా అధికా రులు మమ్మల్ని కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారే తప్ప సమస్యను పరిష్కరించట్లేదు. ప్రతిసారీ వాయిదా వేస్తూ నాకు న్యాయం జరగకుండా అడ్డుపడుతున్నారు.

పల్నాడుజిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లకు చెంది న పచ్చా హనుమంతరావు వినతి... సర్వే నెం.179-1 పరిధిలో మొత్తం 5.30ఎకరాల భూమి ఉంది. ఇందులో ఒక భాగంలో 1.10ఎకరాలు, మరో భాగంలో 1.25 ఎక రాలు, ఇతర సర్వే నెంబర్ల పరిధిలోని భూమి అంతా కలి పి మొత్తం 5.30ఎకరాల భూమి నా స్వాధీనంలో ఉంది. సంబంధిత వివరాలను అడంగల్/ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేయమని,నాకు పాసుపుస్తకం మంజూరు చేయ మని గత పది నెలలుగా సత్తెనపల్లి తహసీల్దారు కార్యాల యం చుట్టూ తిరుగుతున్నాను. అధికారులు సమస్యను పట్టించుకోవట్లేదు. పదే పదే వాయిదాలు వేస్తూ ఇబ్బంది పెడుతున్నారు.

నెల్లూరుకి చెందిన బాలమురళీకృష్ణ అర్జీ... తిరుపతి జిల్లా సూళ్ళూరుపేట మండలం కొణ్ణంబట్టులో సర్వే నెం.96/15లోని 0.48 సెంట్ల భూమి నా తల్లి (లేటు) మిరాయి కుప్పాబాయి వారసత్వంగా నాకు సంక్రమించి నది. ఈ భూమి ప్రస్తుతం నా స్వాధీనంలోనే ఉంది. మా పేద కుటుంబానికి ఇదే ఏకైక జీవనా ధారం. సొంత భూమిని రెవెన్యూ రికార్డులలో పొరపాటున అదే గ్రామా నికి చెందిన ఆశి చెంగయ్య పేరు మీద నమోదై ఉంది. దీనిని సరిచేయమని నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు.

ఏలూరుజిల్లా ముసునూరుకు చెందిన పూర్ణచంద్రావతి గ్రీవెన్స్‌లో అర్జీ...మా మామగారైన (లేటు) దేవినేని సూర్య నారాయణకు తాళ్ళవల్లి గ్రామంలో సర్వే నెం.30/1, 28/1లో మొత్తం 54.91 ఎకరాల భూమి ఉంది. మా కుటుంబ సభ్యుడైన బాబూరాజేంద్ర ప్రసాద్ తన వాటా కింద 17.83ఎకరాలను విక్రయించగా అది ఇప్పుడు జొన్నలగడ్డ రామకృష్ణ అనే వ్యక్తి ఆధీనంలో ఉంది. ఆయ న కొనుగోలుచేసింది కేవలం 17.83 ఎకరాలు మాత్రమే. కానీ క్షేత్రస్థాయిలో ఎల్‌పీఎం నెం.91, 163, 164ల్లో ఆయనమొత్తం 19.25ఎకరాలను ఆక్రమించాడు. అంటే సుమారు 1.42 ఎకరాల భూమిని ఆక్రమించి మాపై దౌర్జ న్యం చేస్తున్నాడు. గతంలో సబ్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేయగా సర్వేయర్ సర్వే చేసినప్పటికీ ఆ 1.42 ఎకరాల అదనపు భూమిని మాకు అప్పగించ కుండానే అర్జీని ముగించారు.

పై వాటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా... మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## పేదరికం లేని సమాజమే సీఎం చంద్రబాబు లక్ష్యం : ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

**●దత్తత గ్రామం మలిచర్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం**



విజయనగరం (చైతన్యరథం): రాష్ట్రంలో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూపొందించిన “పి-4” (ఆరోగ్యం-ఆనందం - ఐశ్వర్యం) విధానంలో భాగంగా శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు దత్తత తీసుకున్న మలిచర్ల గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మలిచెర్ల గ్రామంలో నిర్వహించిన “ఉచిత హోమియోపతి వైద్య శిబిరం”మునకు ముఖ్య అతిథిగా హాజరైనారు. శిబిరానికి వచ్చిన వారికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచేందుకు విద్యాశాఖ నిర్వహిస్తున్న “బడి పిలుస్తోంది” కార్యక్రమంలో భాగంగా మలిచెర్ల - సుంకరిపేట జడ్పీహెచ్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కూటమి ప్రభుత్వం అందిస్తుందని, విద్యార్థులకు బోధన కోసం కాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశామని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తున్నామని, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యాశాఖ సమర్థవంతంగా పనిచేస్తుందని అన్నారు. మలిచెర్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను పర్యటనలో భాగంగా శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభించారు.

## పోషకాహార లోపంపై పోరాడేందుకు పోషణ్ పక్వాడ

**●మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కార్యక్రమం**

**●15 రోజుల పాటు జాతీయ పోషకాహార అవగాహన సదస్సు... పాల్గొన్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**



పార్వతీపురం (చైతన్యరథం): ఏప్రిల్ 9 నుండి ఏప్రిల్ 23 వరకు దేశవ్యాప్తంగా పోషణ్ పక్వాడ నిర్వహించనున్నట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పోషణ్ పక్వాడ కేవలం కార్యక్రమం మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక గొప్ప ప్రజా ఉద్యమమని మంత్రి పేర్కొన్నారు. చిన్నారుల జీవితంలోని తొలి ఆరు సంవత్సరాలు వారి భవిష్యత్తును నిర్ణయించే అత్యంత కీలకమైన కాలమని మంత్రి తెలిపారు. అనంతరం బోనెల విజయచంద్ర మాట్లాడుతూ... అంగన్‌వాడీల సేవలు అభినందనీయమని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పోషణ్ పక్వాడ మెదడు అభివృద్ధి మరియు ఐక్యూ చిన్నారులలో ఆరు సంవత్సరాల వయస్సు వచ్చేసరికి సుమారు 90% పైగా మెదడు అభివృద్ధి చెందుతుందని, ఈ సమయంలో వారికి సరైన పోషకాహారం అందించడం ద్వారా మంచి ఐక్యూ సాధించవచ్చన్నారు. ప్రస్తుత తరంలో చిన్నారులు జంక్ ఫుడ్‌కు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, ఇది వారి ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు. సహజసిద్ధమైన ఆహారం మరియు మన పూర్వీకులు అందించిన రాగి తోప, నువ్వుల ఉండలు, బెల్లం వంటి సాంప్రదాయ వంటకాలను పిల్లలకు అలవాటు చేయాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం మరియు ఐసీడీఎస్ విభాగం ద్వారా అమలు చేస్తున్న 'పోషణ్ భీ - పఢ్డై భీ', 'పోషణ్ కీ కహానీ', మరియు 'రెసిపీ డెమాన్‌స్ట్రేషన్' వంటి కార్యక్రమాలు పిల్లల వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు.

**ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల అప్రమత్తత**

పిల్లలలో మాటలు రావడం ఆలస్యం కావడం లేదా ప్రవర్తనలో మార్పులు ఉంటే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గుర్తించాలనన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో 'భవిత' వంటి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక విద్యా సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నమ్మకంతో అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తున్నారని, అక్కడ పని చేసే కార్యకర్తలు పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అంతర్జాతీయ సంస్థల ప్రమాణాలకు అనుగుణంగా మన రాష్ట్రంలో అంగన్‌వాడీ వ్యవస్థ నడుస్తోందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు

**● రొట్టవలస ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించుట కొరకు, అడ్మిషన్ల పెంపు కోసం భారీ అవగాహన ర్యాలీ చేపట్టిన ఎమ్మెల్యే కూన రవికుమార్**



ఆముదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గం సరుబుజ్జిలి మండలంలో రొట్టవలసలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ల పెంపు మరియు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న నూతన విద్యా విధానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో ఉన్నత విద్య, ఉన్నత ప్రమాణాలు అనే నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యారంగాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పలు సంస్కరణలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఆధునిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత బోధన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందుతున్నాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ క్లాసులు, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సమానంగా విద్యా నాణ్యత పెరిగిందని ఆయన స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యపై నమ్మకం పెంపొందించడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ర్యాలీలో కూటమి ముఖ్య నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధం

**● ఇంటర్మీడియట్, పదవ తరగతి సీబీఎస్‌సీ ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే శిరీషాదేవి**



రంపచోడవరం (చైతన్యరథం): ప్రపంచంలో అత్యంత విలువైనది విద్య మాత్రమే అని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరిషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ ఆమె క్యాంపు కార్యాలయంలో సోమవారం ఇటీవల విడుదల అయిన ఇంటర్మీడియట్, సీబీఎస్‌సీ పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వై. రామవరం గురుకుల కళాశాలలో చదివి రాష్ట్ర గురుకుల కళాశాలల్లోనే మొదటి స్థానం సాధించిన దూరిపల్లి శర్వాణి, సునంద ఎంపీసీ గ్రూప్‌లో 986/1000 సాధించగా... ఆమెకు రూ. 15000లు నగదు అందజేశారు. అలాగే ఒకేషనల్ గ్రూప్‌లో 985/1000 మార్కులు సాధించిన బి. వెంకటసాయి మంజులకు రూ. 10,000లు నగదు అందజేశారు. బైపీసీ గ్రూప్‌లో 976/1000 మార్కులు సాధించిన తామా వెంకటేష్‌కు రూ. 5000లు నగదు అందజేశారు. బైపీసీ గ్రూపులో 975/1000 మార్కులు సాధించిన ఎన్. అఖిల 971/1000, పల్లాల రవీంద్ర రెడ్డి 966/1000 మార్కులు సాధించిన బి. సత్యశ్రీలను అభినందించారు. ఏకలవ్య పాఠశాలల్లో రాష్ట్రస్థాయిలో సీబీఎస్‌సీ ఫలితాల్లో ఎమ్. జయ రామకృష్ణ 478/500 మార్కులు సాధించిగ... రూ. 5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన బి. నవతేజ, తృతీయ స్థానంలో నిలిచిన వెంకటలక్ష్మిలకు రూ. 5వేలు చొప్పున ప్రోత్సాహం నగదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు ఆమె స్వయంగా వండిన ఆహార పదార్థాలను వడ్డించి స్వీట్ ప్యాకలను అందించి ఘనంగా సన్మానించారు. వీరు ప్రభుత్వ కళాశాల, పాఠశాలలో చదివి ఇలాంటి మార్కులు సాధించినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వారి తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారికి ఇంతటి మంచి తర్ఫీదు ఇచ్చి విద్యాబోధన చేసిన అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. మట్టిలో మాణిక్యాలైన వారికి ఉన్నత చదువులకు తన వంతుగా ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎలాంటి సహకారం కావాలన్న అందించేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే శిరీషాదేవి తెలిపారు.

## కొత్తవలస క్యాంటీన్‌కు రూ.45 వేల విలువైన ప్లేట్లు, గ్లాసుల విరాళం



శృంగవరపుకోట/ కొత్తవలస (చైతన్యరథం): కొత్తవలసలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌లో ప్లేట్లు, గ్లాసుల కొరత ఉందన్న విషయాన్ని తెలుసుకున్న నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వెంటనే స్పందించారు. పేదలకు భోజన సమయంలో ఎటువంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఆమె ప్రత్యేక చొరవ తీసుకుని వసతులను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తన వంతుగా 100 ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. అలాగే, గులివిందాడకు చెందిన టీడీపీ నాయకులు గవర శివశంకర్ 150 ప్లేట్లు, గ్లాసులను విరాళంగా ఇచ్చారు. మొత్తం 250 సెట్ల ప్లేట్లు, గ్లాసుల విలువ సుమారు రూ.45 వేలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ వస్తువులను క్యాంటీన్‌కు అందజేసిన అనంతరం, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు స్వయంగా క్యాంటీన్‌కు వచ్చిన పేదలకు భోజనం వడ్డించారు. ప్రజలకు, ముఖ్యంగా పేదలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి, క్షేత్రస్థాయిలో కనీస అవసరాలను తీర్చడానికి కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఏపీలో ఎండల తీవ్రత... తిరుపతి జిల్లాలో 44.4 డిగ్రీల నమోదు

అమరావతి (చైతన్యరథం): ఏపీలో ఎండల తీవ్రత పెరిగింది. వడగాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇవాళ తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో అత్యధికంగా 44.4 డిగ్రీలు, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం 76 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 134 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. గురువారం 51 మండలాల్లో తీవ్ర వడగాలులు, 94 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. బుధవారం శ్రీకాకుళం జిల్లాలో 19, విజయనగరం 21, పార్వతీపురం మన్యం 3, అల్లూరి సీతారామరాజు 4, పోలవరం 5, విశాఖ 1, అనకాపల్లి 15, కాకినాడ 6, తూర్పుగోదావరి జిల్లాలో 2 మండలాల్లో తీవ్ర వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య బయటకు రావొద్దని, తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# చినరాజప్ప నివాసంలో నేతల ఆత్మీయ విందు



పెద్దాపురం (చైతన్యరథం): కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. జిల్లాలోని అచ్చంపేటలో ఉన్న పెద్దాపురం శాసనసభ్యులు, సీనియర్ నేత నిమ్మకాయల చినరాజప్ప నివాసంలో జిల్లా పార్టీ నేతల ఆత్మీయ విందు కార్యక్రమం అత్యంత కోలాహలంగా జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఈ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమ్మేళనం కేవలం విందుకే పరిమితం కాకుండా పార్టీ భవిష్యత్ కార్యాచరణకు వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా నాయకులంతా ఒకచోట చేరి జిల్లాలో పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా పార్టీ కమిటీల నియామకం, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు తదితర కీలక అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. నాయకుల మధ్య సమన్వయం పెంచేందుకు రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఆత్మీయ సమావేశాలు మరిన్ని నిర్వహిస్తామని అధ్యక్షులు నవీన్, నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ విందు కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఎస్.వి.ఎస్.ఎన్ వర్మ, కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో కోలాహలంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు

**●పలు సేవా కార్యక్రమాలు... మెగా రక్తదాన శిబిరం నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్**

జగ్గంపేట (చైతన్యరథం): రాజకీయానికే రాజసం తెచ్చిన రాజకీయ రారాజు చంద్రబాబు నాయుడని అభివృద్ధి అంటే ఏమిటో ఎలా ఉంటుందో చేసి చూపించిన పరిపాలన చాణిక్యుడు చంద్రబాబు నాయుడని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 76 కేజీల భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ అనంతరం జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 410 మంది ఎన్టీఆర్ ట్రస్ట్ కు రక్తదానం చేశారు. వారందరికీ ఎన్టీఆర్ ట్రస్ట్ సర్టిఫికెట్, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ సర్టిఫికెట్స్ అందజేసి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఎన్టీఆర్ అన్న క్యాంటీన్లోనూ, జగ్గంపేట అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలోనూ అన్నదానం నిర్వహించి కేక్ కట్ చేసి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1950 ఇదే రోజున రాష్ట్రానికి ఒక ధ్రువ తారగా జన్మించిన ఆయన రాష్ట్ర ప్రజల కోసం 76 ఏళ్ల యువకుడిగా పనిచేస్తున్నారని అన్నారు. అధినేత పుట్టినరోజును పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజారోగ్య అభివృద్ధికి శ్రీకారం : ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**●రూ.36 లక్షల వ్యయంతో కునికినపాడులో వెల్‌నెస్ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన**

నందిగామ (చైతన్యరథం): కంచికచర్ల మండలం కునికినపాడు గ్రామంలో మంగళవారం నాడు 36 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించబోయే వెల్‌నెస్ హెల్త్ సెంటర్ శంకుస్థాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వెల్‌నెస్ హెల్త్ సెంటర్ నిర్మాణం ద్వారా కునికినపాడు గ్రామ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు మరింత చేరువ కానున్నాయని తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య భద్రత, మహిళలు-పిల్లల వైద్య సదుపాయాలు, నిరంతర ఆరోగ్య పరీక్షలు, పోషకాహార అవగాహన కార్యక్రమాలు వంటి సేవలు ఈ కేంద్రం ద్వారా అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# పేద కుటుంబాలకు ఆశాకిరణంగా ముఖ్యమంత్రి సహాయనిధి

**●లబ్ధిదారులకు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**



కాకినాడ (చైతన్యరథం): పేద కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు సిఫార్సుతో రూ.7,35,965 విలువైన 15 సిఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేయగా, అదనంగా ప్రధానమంత్రి సహాయనిధి (PMRF) ద్వారా రూ.3,00,000 సహాయం అందించారు. ఈ సహాయం పేద కుటుంబాల్లో ఆనందాన్ని నింపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెద్దకొడుకుగా పేదల ఆరోగ్యానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. గత రెండేళ్లలో 1,43,314 మంది రోగులకు రూ.1293 కోట్లకు పైగా సాయం అందించడం ఆయన సంకల్పానికి నిదర్శనమన్నారు. ఉగాది, నూతన సంవత్సరం, జన్మదినం వంటి సందర్భాల్లో సీఎంఆర్ఎఫ్ నిధుల విడుదలపై తొలి సంతకం చేయడం ఆయన సేవాభావాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వారికి పెద్ద ఊరటనిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూజ్యబాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం మన ప్రజాప్రభుత్వంతోనే సాధ్యం

**●స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల ద్వారా మంచి ఫలితాలు : చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్**



ఏలూరు (చైతన్యరథం): మన రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దుటకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో ఒక ఉద్యమంగా ముందుకుతీసుకు వెళ్ళుతున్నారని ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ అతిథి గృహంలో మంగళవారం కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సంయుక్తంగా మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, పట్టాభిరామ్ మాట్లాడుతూ... స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) 2.0 క్రింద ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలోని శ్రీవెంకటేశ్వర స్వామి సన్నిధి గోశాలలో గోబర్ధన్ బయోగ్యాసు ప్లాంటును విజయవంతంగా ప్రారంభించామని, స్వామివారిని దర్శించుకుని ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎంతో సంతృప్తి కలిగిందన్నారు. రోజుకు 1 టన్ను సామర్థ్యంతో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ ప్లాంటు గోశాల అనుసంధానంగా సేంద్రీయ వ్యర్థాలను బయోగ్యాస్, సేంద్రీయ ఎరువుగా మారుస్తుందని అన్నారు. ఈ ప్లాంటు ద్వారా రోజుకు సుమారు 40 ఘన మీటర్ల బయోగ్యాసు, గంటకు 8–10 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి, రోజుకు 700--800 కిలోలు బయో స్లర్రీ ఉత్పత్తి అవుతుందన్నారు. ఇది సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రమైన పరిసరాలు, పునరుత్పాదక శక్తి ప్రోత్సాహం లభించడంతో పాటు ఎల్పీజీ, ఇంధన వినియోగం తగ్గుతుందని అన్నారు. ఇది "చెత్త నుండి సంపద", సుస్థిర గ్రామీణ అభివృద్ధి దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందన్నారు. ఎమ్మెల్యే కోరిన చోట మరో కోటి రూపాయలతో ఇంకో ప్లాంటు నెలకొల్పుతామన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 22 నెలలు కాలంలో రూ. 12.64కోట్ల వ్యయంతో ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాలలో కూడా డోరు టు డోరు చెత్త సేకరణ చెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పక్కగా ఆదేశాలు జారీ చేశారన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు ఎన్ని కావాలంటే అన్ని మంజూరు చేస్తామని చెప్పారు. మీ నియోజక వర్గంలో త్వరలో 37 గ్రామ పంచాయతీలకు ఎలక్ట్రికల్ వాహనాలు అందిస్తామని, ఆ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేత ప్రారంభించడానికి సన్నహాలు చేసుకోవలసి ఉందన్నారు.

**గోపాలపురం నియోజకవర్గంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: మద్దిపాటి**

కూటమి ప్రభుత్వం గోపాలపురం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వ్యాఖ్యానించారు. ఏపీ స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు జరుపుకున్నామని, ఇది మంచి శుభ పరిణామం అన్నారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, అలాగే వ్యక్తిగత దాడులతో నానా ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ ఇబ్బందులు పడ్డ వారిలో కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఒకరని అన్నారు. అల్లరి మూకలను తరిమికొట్టి ప్రజలందరూ ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, ఇప్పుడు కూడా అల్లరి మూకలు రాకుండా సమిష్టిగా పోరాడి మనకు కావలసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో చేసుకుందామని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ బి.అనిల్ కుమార్‌రెడ్డి, డైరెక్టరు కూచిపూడి ఉదయ భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వెలుగు కార్యక్రమంలో భాగంగా 175 ఆండ్రాయిడ్ ఫోన్లు అందజేసిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



పెడన (చైతన్యరథం): నియోజకవర్గంలోని తోటముల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గూడూరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, మండలాల గ్రామ సమాఖ్య సహాయకుల 175 ఉచిత 5+ ఆండ్రాయిడ్ ఫోన్లను నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కాగితకృష్ణ ప్రసాద్ పంపిణీ చేశారు. గ్రామీణ మహిళల సాధికారత కోసం తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన "వెలుగు" కార్యక్రమం ఎంతో శక్తివంతమైన వేదికగా నిలిచిందని, ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ ఫోన్లు వారి పనిని మరింత సమర్థవంతంగా చేయడంలో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామాభివృద్ధి – మహిళా సాధికారత మా ముఖ్య లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కాగితకృష్ణ ప్రసాద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల గుమ్మం వద్దకే కూటమిపాలన

**● వీ.వో.ఏలకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**



గుడివాడ (చైతన్యరథం): "ప్రజల గుమ్మం వద్దకు కూటమి ప్రభుత్వ పాలన చేరాలన్నదే మా లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆ దిశగా గ్రామ స్థాయిలో పనిచేసే బుక్ కీపర్లకు స్మార్ట్ ఫోన్లను ప్రభుత్వం అందించిందన్నారు. గుడివాడ మండల పరిధిలోని విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (బుక్ కీపర్) లకు ప్రభుత్వం సమకూర్చిన స్మార్ట్ ఫోన్లను ప్రజా వేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే రాము మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బుక్‌కి ఎమ్మెల్యే రాముకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు మంచి చేయడంలో అందరం కలిసి పని చేద్దామని బుక్ కిపర్లతో ఎమ్మెల్యే రాము అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... స్మార్ట్ ఫోన్లు అందుకున్న బుక్ కీపర్ సోదరీమణులందరికీ అభినందనలు చెప్తున్నానన్నారు. మీరు గ్రామ స్థాయిలో ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేయాలన్నారు. మీపని మరింత సులభతరం చేయడానికి, డిజిటల్ పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన స్మార్ట్ ఫోన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేరుగా ఆన్‌లైన్‌లోనే లెక్కలు, రికార్డులు మెయింటైన్ చేయడం వల్ల పారదర్శకత పెరిగి అవినీతికి తావు ఉండదని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేస్తున్నామని, బుక్ కీపర్లకు టెక్నాలజీ అందించడం అందులో భాగమేనన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఎండిఓ విష్ణుప్రసాద్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు పశ్చిమలో మహిళా గ్రీవెన్స్



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ఆదేశాల మేరకు, నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో "మహిళా గ్రీవెన్స్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు, స్థానిక ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, అంగన్వాడీ అధ్యక్షురాలు నంది సరస్వతి, డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పంచుమర్తి కల్పన, టీడీపీ పార్లమెంట్ సెక్రటరీ గంటా మౌళికలు పాల్గొని అర్జీలు స్వీకరించారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అర్జీలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారం కోసం కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. మహిళలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మహిళలకు తమ సమస్యలు వెల్లడించే వేదిక కల్పించడం జరిగిందని వారు పేర్కొన్నారు.

# జీవితంలో గురువు పాత్ర కీలకం : ఎమ్మెల్యే నసీర్

**●గుంటూరులో ఇక్బాల్ మాస్టర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం**



గుంటూరు (చైతన్యరథం): జీవితంలో ఉన్నత మార్గంలో పయనించేందుకు గురువు పాత్ర ఎంతో కీలకమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుడంపాడు పాఠశాల టీచర్‌గా ఇక్బాల్ ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం స్థానిక పొన్నూరు రోడ్డులోని ఎం.కన్వెన్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు రిటైర్ అవడం అంటే కేవలం ఉద్యోగం ముగియడం కాదని, ఎంతో అనుభవం దూరమవ్వడమేనని చెప్పారు. గురువు అంటే కేవలం పాఠాలు చెప్పేవారు కాదని, జీవితానికి గమ్యం నేర్పే మార్గదర్శి అని, అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన దీపాన్ని వెలిగించే మహనీయులని కొనియాడారు. పాఠ్యపుస్తకాల్లో ఉన్న విషయాలను మాత్రమే కాదని, మన జీవితం ఎలా నిలబడాలో, ఎలా ఆలోచించాలో, ఎలా మంచి మనుషులుగా మారాలో నేర్పిస్తారని తెలిపారు. ఎన్ని సంవత్సరాలు గడిచినా, మన గురువు తరగతి గది జ్ఞాపకాలు మన హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని అన్నారు. పరీక్షల ముందు ఇచ్చిన ప్రోత్సాహం, తప్పులు చేసినప్పుడు చూపిన సహనం, విజయాన్ని సాధించినప్పుడు ఇచ్చిన అభినందనలు గురువు మన ఉన్నతికి వేసే పునాదులని అన్నారు. ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఇక్బాల్ మాస్టర్ శేష జీవితం సంతోషంగా సాగాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు.

# ఎమ్మెల్యే ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీలోకి షేక్ అబ్దులా

**●ప్రత్తిపాటి సమక్షంలో కుటుంబసమేతంగా టీడీపీలో చేరిన వైసీపీనేత, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ అబ్దుల్లా**



చిలకలూరిపేట (చైతన్యరథం): ఐదేళ్ల పాలనతో విసిగివేసారిపోయే ప్రజలు 2024 ఎన్నికల్లో జగన్‌కు గట్టిగా బుద్ధిచెప్పి, వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేశారని, అయినా వైసీపీ నాయకత్వ ఆలోచనల్లో ఏమాత్రం మార్పురాలేదని శాసనసభ్యులు, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. చిలకలూరిపేట మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, పార్టీ ఆవిర్భావం నుంచి వైసీపీలో కొనసాగుతున్న ఆ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ అబ్దుల్లా మంగళవారం ప్రత్తిపాటి సమక్షంలో తన కుటుంబసభ్యులతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అబ్దుల్లాకు, ఆయన కుటుంబసభ్యులకు తెలుగుదేశం కండువాలు కప్పి, ప్రత్తిపాటి పార్టీలోకి స్వాగతించారు.

**చంద్రబాబుపై ఈర్ష్యాద్వేషాలే జగన్‌ను పతనం చేస్తాయి**

ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఈర్ష్యాద్వేషంతో జగన్ తనను తాను పతనావస్థకు చేర్చుకుంటున్నాడని, వ్యక్తులపై ద్వేషంతో రాష్ట్రానికి అన్యాయం చేయాలనుకోవడం ముమ్మాటికీ మూర్ఖత్వమే అవుతుందన్నారు. అబ్దుల్లా చేరికతో పట్టణంలో టీడీపీ మరింత బలపడుతుందన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా అబ్దుల్లా క్రమశిక్షణతో పనిచేస్తారనే నమ్మకం తమకుందన్నారు.

**టీడీపీలో చేరిన షేక్ అబ్దుల్లా మాట్లాడుతూ...** తన ఆరోగ్యాన్ని, వయసును లెక్కచేయకుండా ప్రజల సంతోషం కోసం చంద్రబాబు పడుతున్న కష్టం చూస్తుంటే ఎవరికైనా మనసుకు బాధకలుగుతుందని, అలాంటిది జగన్, వైసీపీ నేతలు మాత్రం నిత్యం కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై దుమ్మెత్తిపోయడమే పనిగా పెట్టుకున్నారని అబ్దుల్లా పేర్కొన్నారు. జగన్ అమరావతిపై ఎన్ని కుట్రలు చేసినా, చంద్రబాబు అనుకున్నది సాధించి తీరతాడన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గాన్ని వేల కోట్ల నిధులతో సమగ్రంగా అభివృద్ధి చేసి, రాష్ట్ర రాజకీయ చిత్ర పటంలో చిలకలూరిపేటకు ఎనలేని గుర్తింపును తెచ్చిన ప్రత్తిపాటి పుల్లారావు నాయకత్వంలో పని చేయడానికి తాను సిద్ధపడి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందని ఈ సందర్భంగా షేక్ అబ్దుల్లా తెలియజేశారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రత్తిపాటి పుల్లారావు వంటి నిబద్ధత కలిగిన నాయకుడిని ఎన్నడూ చూడలేదని, మూడు దశాబ్దాల ప్రత్తిపాటి రాజకీయ ప్రస్థానం పేట అభివృద్ధి రూపంలో ప్రతి ఒక్కరికీ కనబడుతుందని,ఆ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడినై ఈ రోజు పార్టీలో చేరడం జరిగిందని ఈ సందర్భంగా అబ్దుల్లా తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 20 లక్షల పీఎం సూర్య ఘర్ కనెక్షన్లు

**●రాష్ట్ర విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు**

**●కొరత, కోతలు లేని విధంగా విద్యుత్ సేవలు అందిస్తాం : ఛీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ, ప్రధాని మోడీ సహకారంతో రాష్ట్రంలో విద్యుత్ కొరత మరియు కోతలు లేని రోజులు రాబోతున్నాయని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ పట్టణంలోని 10వ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గత 2019-24 మధ్య కాలంలో జగన్ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరుతో సామాన్య ప్రజలను తీవ్రంగా పీడించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గుపై మాత్రమే ఆధారపడకుండా, ప్రత్యామ్నాయ మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తి చేసేలా కీలక అడుగులు వేస్తోందని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల కనెక్షన్ల లక్ష్యంతో పీఎం సూర్య ఘర్ పథకాన్ని అమలు చేస్తున్నామని, దీని ద్వారా ప్రతి ఒక్కరు తమ ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. ఈ పథకం కోసం ప్రభుత్వం 1200 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, ఇందులో భాగంగా బీసీలకు 98,000 రూపాయలు, ఓసీలకు 78,000 రూపాయల రాయితీ కల్పిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు 6 లక్షల సోలార్ కనెక్షన్లను పూర్తి ఉచితంగా అందజేస్తామని, ఈ వేసవి పూర్తయ్యేలోపు కనెక్షన్ల ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీలకు ప్రతి నెలా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని జీవీ గుర్తు చేశారు. లో-వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేశామని, భవిష్యత్తులో విద్యుత్ సమస్య అనేది వినిపించదు, కనిపించదు అని ఇది చంద్రబాబు నాయుడు ఇస్తున్న భరోసా అని స్పష్టం చేశారు.

# చిన్నారికి అండగా నిలిచి టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్

విజయవాడ (చైతన్యరథం): నగరంలోని 3వ డివిజన్ గుణదల మైత్రి నగర్‌కు చెందిన వెలకపాటి మౌనిక కుమార్తె ఆరాధ్య ఆరోగ్య సమస్యలతో బాధపడుతోంది. 8వ నెలలోనే జన్మించిన ఈ చిన్నారి అవయవాలు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో పాటు గుండె సంబంధిత సమస్యతో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ప్రస్తుతం పాపకు 8 నెలలు కాగా, వేసవి కాలంలో పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల మరింత ఇబ్బంది పడుతున్నట్లు తల్లి మౌనిక తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం సహాయం కోసం గద్దె క్రాంతి కుమార్‌ను సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తల్లి మౌనిక కూలర్ కావాలని అడిగిన మేరకు తక్షణమే కూలర్ కొనుగోలు చేసి, మైత్రి నగర్‌లోని వారి నివాసానికి స్వయంగా వెళ్లి అందజేశారు.

# కేడీసీసీబీకి ఐఓఎస్ సర్టిఫికెట్ రావడం అభినందనీయం : మంత్రి పార్థసారథి



విజయవాడ (చైతన్యరథం): కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు(కేడీసీసీబీ)కు ఐఓఎస్ 9001-2015 సర్టిఫికెట్ రావడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిలువుటద్దమని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమర్థవంతమైన పరిపాలనలో కేడీసీసీబీ బ్యాంకు ఈ ఘనతను సాధించడం చాలా ఆనందంగా ఉందని, వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు మూలనపడిన విషయం అందరికీ తెలిసిందే అని అన్నారు. ప్రజలకు, రైతులకు నిత్యం ఈ బ్యాంకులను అందుబాటులో ఉంచేందుకు, సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, దీని ఆధారంగానే నేడు కేడీసీసీబీ బ్యాంకు అరుదైన సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుందన్నారు. ఈ సర్టిఫికెట్‌ను సాధించేలా కృషి చేసిన కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాంని మరియు సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. భవిష్యత్తులో ఇలాంటివి మరెన్నో మైలురాళ్లు దాటాలని, కూటమి ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కాంక్షిస్తున్నాను.

# మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే వేమిరెడ్డి



కొవ్వూరు (చైతన్యరథం): విడవలూరు మండల పరిధిలోని ఊటుకూరు పెద్దపాళెం మత్స్యకార గ్రామ పెద్దలు తమ నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ మత్స్యకార సంఘం పెద్ద కాపుగా ఆదంగారి కనకయ్య, నడిం కాపుగా కొండూరు ఏడుకొండలు, చిన్న కాపుగా కొండూరు అమరేంద్ర, మరియు క్యాషియర్‌గా పాపారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో ఆరుగురు మత్స్యకార ప్రముఖులను గ్రామ పెద్ద మనుషులుగా సంఘం సభ్యులు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మత్స్యకార నాయకులు నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కాపులు మరియు మత్స్యకార పెద్దలకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సమక్షంలో తెలుగుదేశంపార్టీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి మత్స్యకార పెద్దలకు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నూతన కార్యవర్గం మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి వారి ఆర్థికాభివృద్ధికి అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. మత్స్యకారులకు ప్రభుత్వం నుండి అందాల్సిన సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా కృషి చేస్తానని మత్స్యకార నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాపులతో పాటు పలువురు మత్స్యకార నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాజధాని అమరావతి నిర్మాణానికి చిన్నారి రిహాన్ విరాళం

**• అభినందించిన నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కాకర్ల సురేష్**



ఉదయగిరి (చైతన్యరథం): దిలావర్ భాయి వీధికి చెందిన ఖలిద్ కుమారుడు చిన్నారి రిహాన్ తన హుండీ డబ్బులను అమరావతి నిర్మాణానికి విరాళంగా అందజేశాడు. ఉదయగిరిలో గత సోమవారం రాత్రి సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని భారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, శాంత కుమారి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో రిహాన్ తాను చాలా కాలం నుంచి పొదుపు చేసుకున్న డబ్బులను తన తండ్రి ఖలిద్‌తో కలిసి ఎమ్మెల్యే దంపతులకు అందజేశాడు. సీఎం చంద్రబాబు అంటే తనకు ఎంతో ఇష్టమని ఈ సందర్భంగా చెప్పాడు. మన రాజధాని అమరావతికి మా వంతుగా ఇది విరాళమని తెలిపాడు. రిహాన్ చర్యకు ఎమ్మెల్యే దంపతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అతని పెద్ద మనసుపై ప్రశంసలు కురిపించారు. రిహాన్ తండ్రి ఖలిద్ దివ్యాంగుడు. పోలియో వల్ల ఒక కాలు సరిగా ఉండదు. తెలుగుదేశం వీరాభిమాని. వైసిపి హయాంలో తెలుగుదేశం తరపున ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాడు. పాలకోవా తయారుచేసి ఉదయగిరిలో వీధుల్లో అమ్ముతుంటాడు. కష్టపడి పనిచేసే తత్వం. నిజాయితీపరుడు. నలుగురికి సేవ చేయడంలో ముందుంటాడు. ఉదయగిరిలో ఎవరిని అడిగిన ఈ విషయం చెబుతారు. ఇటీవల వింజమూరులో సీఎం బహిరంగ సభలో తన దివ్యాంగ పెన్షన్ డబ్బులు 6వేల రూపాయలను బహిరంగ సభ వేదికపై సీఎం చంద్రబాబు సహాయనిధికి స్వయంగా అందజేశాడు. సీఎం చంద్రబాబు అతని మంచి మనసుపై ప్రశంసల వర్షం కురిపించారు.

# మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో మంత్రి కొల్లు రవీంద్ర ఆకస్మిక తనిఖీ

**●అస్తవ్యస్త పార్కింగ్‌పై అసంతృప్తి, వెంటనే చర్యలకు ఆదేశం**

**●ఓపీ రద్దీ, సిబ్బంది కొరత, పరికరాల అవసరంపై సమీక్ష**

**●రోగుల సంతృప్తే లక్ష్యం - పారిశుధ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి**



మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, విద్యా, వైద్య రంగాలకు బడ్జెట్‌లో భారీ నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం మంత్రి ఆకస్మికంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని తనిఖీ చేశారు. స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుకుంటూ ఆసుపత్రి ప్రాంగణంలోకి వచ్చిన ఆయన, అక్కడ అస్తవ్యస్తంగా నిలిపి ఉన్న వాహనాలను గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పర్యవేక్షకులు, పార్కింగ్ ఇన్‌చార్జిని పిలిపించి, వాహనాలను నిర్దిష్ట పార్కింగ్ ప్రదేశంలోనే నిలిపేలా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్‌లో స్థలం లేకుంటే ఆసుపత్రి బయటే ఉంచేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించిన మంత్రి, అక్కడి ఏర్పాట్లు, వసతులు, పారిశుధ్యాన్ని సమీక్షించారు. మరోసారి తనిఖీ చేస్తానని, అప్పటికి ఏ లోపం కూడా లేకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని హెచ్చరించారు. రోగులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, తేడా వస్తే సహించేది లేదని తెలిపారు. ఆసుపత్రి అంతటా రోగులతో మమేకమై వైద్య సేవల తీరును అడిగి తెలుసుకున్న మంత్రి, వైద్యులు అందుబాటులో ఉన్నారా, మందులు సక్రమంగా ఇస్తున్నారా, సౌకర్యాలు ఎలా ఉన్నాయన్న విషయాలపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. అనంతరం పర్యవేక్షకులు, సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లతో సమావేశమై ఆసుపత్రిలో ఉన్న పరికరాలు, అవసరమైన సదుపాయాలపై చర్చించారు. ప్రతిరోజూ సుమారు 1600 మంది ఓపీ రోగులు వస్తున్నారని, 605 పడకలతో ఆసుపత్రి ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా నడుస్తోందని మంత్రి తెలిపారు.

ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు మచిలీపట్నంలోనే నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. స్టాఫ్ నర్సుల కొరత సుమారు 90 మంది ఉందని, దాన్ని త్వరలో భర్తీ చేయాల్సి ఉందన్నారు. కొన్ని పరికరాలు, వెంటిలేటర్ల అవసరం ఉన్నట్లు వైద్యులు తన దృష్టికి తీసుకొచ్చారని, సీఎస్ఆర్ నిధులు, ప్రభుత్వ నిధులతో వాటిని సమకూర్చే ప్రయత్నం చేస్తామని మంత్రి తెలిపారు. ప్రతి మంగళవారం సదరం పరీక్షలు ఉండటంతో సాధారణ ఓపీ రోగులకు ఇబ్బంది కలుగుతున్నట్లు గమనించామని, ఈ రెండు సేవలకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. డైట్ భవనంలో ఏర్పాట్లు చేసే విషయమై డీఎంహెచ్ఓతో చర్చిస్తామని చెప్పారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. వైద్యులు మంచి సేవలు అందిస్తున్నప్పటికీ, ప్రజల్లో సంతృప్తి స్థాయి మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పర్యటనలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ లీలా ప్రసాద్, ఆర్ఎంఓ నిరంజన్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, భగత్ సింగ్‌నాయక్, ఎస్సీ విజిలెన్స్ కమిటీ సభ్యులు విద్యాసాగర్ పాల్గొన్నారు.

# జలకళను సంతరింపజేయడమే అధికారుల లక్ష్యం : కందుల నారాయణరెడ్డి



మార్కాపురం (చైతన్యరథం): పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం నియోజకవర్గంలో జల కళను సంతరింప చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. మంగళవారం మార్కాపురం కలెక్టరేట్లో జలధార - జల హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మార్కాపురం నియోజకవర్గంలోని 102 చెరువులను బాగు చేసి వాటిని వచ్చే వర్షాకాలంలో నీటితో నింపేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇరిగేషన్, డ్వామా, వీబీజీరాంజీ పథకం సిబ్బంది సహకారంతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దాతల సహకారంతో కొన్ని పనులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ... భవిష్యత్తులో మార్కాపురం ప్రాంతంలో నీటి సమస్య రాకుండా ఉండాలంటే ఈ పథకాన్ని సమగ్రంగా ఉపయోగించుకోవడం ఒక్కటే మార్గం అని తెలిపారు. చెరువులు, కాలువలు, సప్లై ఛానల్‌లలో చిల్లకంప ఎక్కువగా ఉందని దాన్ని గ్రామస్తులు, మరి కొంతమంది దాతలు సహకారంతో తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిరోజు రివ్యూ చేస్తున్నారని వివరించారు. దానికి అనుగుణంగా అధికారులు పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

# 750 ఎకరాల బీడు భూములు సాగులోకి తేవడమే లక్ష్యం : ఎమ్మెల్యే సోమిరెడ్డి

**●మరో నెలలో జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేస్తామని వెల్లడి**



సర్వేపల్లి (చైతన్యరథం): నియోజకవర్గం వెంకటాచలం మండలం పూడిపర్తిలో దశాబ్దాలుగా బీడుగా ఉన్న భూములను మాజీమంత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నప్పటికి దళిత, గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, బీడు భూములకు నీళు ంచేందుకు చెక్ డ్యాం నిర్మించడంతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు తీసుకొస్తామన్నారు. త్వరలోనే జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేస్తామన్నారు. పూడిపర్తిలో 1981లో 191 మంది దళితులకు 382 ఎకరాలు పంపిణీ చేయడం జరిగిందని, దాదాపు 45 ఏళు గా ఈ భూములను బీడుగా మారాయని, 382 ఎకరాలు పోను మరో 158 ఎకరాలు పంపిణీ చేయాల్సి ఉందని, అడవిగా మారిన ఈ భూములను గత జనవరిలో అధికారులతో కలిసి సందర్శించానని, అప్పటి నుంచి మిషన్లతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 230 ఎకరాలు శుభ్రం చేయడం జరిగిందని, మరో 320 ఎకరాలు క్లియర్ చేసే పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టుపై నాలుగైదు రోజుల్లో అధికారులతో మరో సమావేశం నిర్వహిస్తామని, ఈ ప్రాంతంలో చెక్ డ్యాం నిర్మించి మరో ప్రాంతంలో లిఫ్ట్ పెట్టాలనే ఆలోచన చేస్తున్నామని అన్నారు. జలధార కార్యక్రమంలో భాగంగా చెక్ డ్యాం నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, మరో 37 ఎకరాల గిరిజనుల భూములకు కూడా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు ఇస్తామన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ఈ భూములకు సాగునీరు అందించి సాగులోకి తీసుకొస్తామని, 1992లో 71 మంది నిరుద్యోగులకు మరో 71 హెక్టార్లు పంపిణీ చేయడం జరిగిందని, ఆ భూముల్లో కొందరు రొయ్యల సాగు చేసుకుంటుండగా, మరికొందరు వాటిని బీడుగా పెట్టారని, ఆ భూములనూ సాగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఈ భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు అవసరమైతే ఎంపీ నిధులతో మరిన్ని వసతులు కల్పించే ప్రయత్నం చేస్తామన్నారు.

# శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు బోల్తా



శ్రీశైలం (చైతన్యరథం): శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు బోల్తాపడింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా సురక్షితంగా బయటపడ్డారు. శ్రీశైలం నుంచి మార్కాపురం వెళ్తుండగా.. దోర్నాల మండలం చిన్నారుట్ల-తుమ్మలబైలు సమీపంలోని మలుపు వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బస్సు వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## పారదర్శకత, సమాచారం, సేవల్లో వేగం పెంచేందుకే స్మార్ట్ ఫోన్లు ఇస్తున్నాం : ఎమ్మెల్యే సునీత

**●మూడు మండలాలలోని 120మంది యానిమేటర్లకు ఫోన్లు పంపిణీ**

**●మహిళా సంఘాల సభ్యులకు మెరుగైన సేవలందించాలన్న ఎమ్మెల్యే సూచన**



రాప్తాడు (చైతన్యరథం): స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే సేవల్లో వేగం పెంచడం, కచ్చితమైన సమాచారం, పారదర్శకత కోసమే యానిమేటర్లకు స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్నట్టు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల యానిమేటర్లకు ప్రభుత్వం మంజూరు చేసిన సెల్ ఫోన్లను ఆమె పంపిణీ చేశారు. పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతతో పాటు మూడు మండలాల అధికారులు, యానిమేటర్లు పాల్గొన్నారు. మొత్తం 120మందికి ఈ సెల్ ఫోన్లు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతంలో పరిపాలన, ఇతర కార్యక్రమాలను ఆధునీకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక బృందాల కార్యకలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి.. ప్రభుత్వం యానిమేటర్లకు ఉచిత మొబైల్ ఫోన్‌లను పంపిణీ చేస్తోందన్నారు. దీని ద్వారా రికార్డులన్నీ సెల్ ఫోన్ లో ఉండేలా చేసుకోవచ్చన్నారు. యానిమేటర్లు ఈ సెల్ ఫోన్ల ద్వారా రుణాలు, గ్రూపు నిర్వహణ, మరియు పుస్తకాల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని రికార్డ్ చేసి, నేరుగా రాష్ట్ర సర్వర్‌లకు అప్‌లోడ్ చేయడానికి వీలు ఉంటుందన్నారు. ఏ సభ్యురాలు ఎంత డబ్బు చెల్లిస్తున్నారు.. అది బ్యాంక్ వరకు చేరుతోందా లేదా, ఇంకా ఎంత చెల్లించాలి వంటి సమగ్ర వివరాలు సెల్‌ఫోన్‌లో నిక్షిప్తమవుతాయన్నారు. ఇది వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు పారదర్శకత, నమ్మకాన్ని పెంచుతుందన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

## పులివెందుల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యం: బీటెక్ రవి



పులివెందుల (చైతన్యరథం): పులివెందుల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి వ్యాఖ్యానించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని ఈ సందర్భంగా బీటెక్ రవి భరోసా ఇచ్చారు.

## సమస్యల పరిష్కారానికి జమ్మలమడుగులో ప్రజాదర్బార్

**●ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన టీడీపీ నేత భూపేష్‌రెడ్డి**




జమ్మలమడుగు (చైతన్యరథం): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్‌రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మైలవరం మండలం వద్దిరాల గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరగా... స్పందించిన ఆయన వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలన్నారు. గ్రామంలోని బీసీ కాలనీ రామాలయం నందు నూతన బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరాగా... జంగం కాలనీలో ఇళ్ల పట్టాలు మిగిలి ఉన్నాయని, ఈ పట్టాలను నిరుపేదలకు పంపిణీ చేయాలని వారు కోరారు. వద్దిరాల గ్రామంలో 1500 జనాభా ఉన్నారని స్మశాన వాటికను తీర్చిదిద్దాలన్నారు. తిప్పలూరు గ్రామంలో నీటి సమస్య ఎక్కువగా ఉందని, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామంలో రాజీవ్‌నగర్ నందు వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వారు భూపేష్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. కొండాపురం మండలం దొబ్బుడుపల్లె, తిరుమలయపల్లె, రాగి కుంట గ్రామాలలో పాఠశాలలు ఉన్నప్పుడు మాత్రమే ఆర్టీసీ బస్సు నడుపుతున్నారని, అలాకాకుండా కంటిన్యూగా బస్సు నడపోవాల్సిందిగా ఆర్టీసీ మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఎర్రగుంట్లలోని టిడ్కో ఇళ్ల కేటాయింపు సమస్యలను పరిష్కరించాలని కోరారు. తన వద్దకు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేష్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## రాయదుర్గంలో చరిత్ర సృష్టించిన చంద్రబాబు జన్మదిన వేడుకలు

**●అధినేత సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు రాష్ట్రానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ ...**

**వినూత్నంగా దశ మహావిద్య కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



రాయదుర్గం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు రాష్ట్రానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వినూత్నంగా దశ మహావిద్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ప్రగతి పండుగ పేరుతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. ఇవే కాకుండా నియోజకవర్గంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పేలా భువన విజయం సాంస్కృతిక కార్యక్రమాలు, కబడ్డీ, బ్యాట్మింటన్ లాంటి క్రీడా పోటీలు, నిర్వహించారు. అలాగే భక్తులకు నిత్య అన్నదానం, వస్త్రదానం చేపట్టారు. యువత, మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొనేలా కార్యక్రమాలు రూపకల్పన చేయడం విశేషం. ఈ కార్యక్రమాలు రాయదుర్గం నియోజకవర్గంలో ఆధ్యాత్మికత, అభివృద్ధి, సామాజిక చైతన్యాన్ని కలగలిపిన విధంగా పది రోజులపాటు కొనసాగాయి.

**కాలవ నిబద్ధత...**

తమ నాయకుడిపై ఉన్న అచంచలమైన అభిమానాన్ని ఆధ్యాత్మిక రూపంలో ఎమ్మెల్యే కాలవ చాటుకున్నారు. ఆయన సతీసమేతంగా స్వయంగా దీక్షలో ఉండి, ప్రతి రోజూ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతి రోజు ఒక్కో దేవతను ఆవాహన చేసుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాయదుర్గం గడ్డపై వెలసిన జంబుకేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పది రోజుల పాటు సాగిన ఈ హోమాలు నియోజకవర్గంలో సరికొత్త వాతావరణాన్ని నింపాయి. ఈ హోమాల్లో కేవలం ఎన్డీఏ పక్ష కూటమి నేతలు, కార్యకర్తలే కాకుండా సామాన్య ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూర్ణాహుతి రోజున రాయదుర్గం ఆధ్యాత్మిక క్షేత్రాన్ని తలపించింది. వచ్చిన భక్తులందరికీ ప్రసాద వితరణ మరియు అన్నదానం ఏర్పాటు చేశారు. దైవ కృపతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో కొనసాగుతారని, రాయదుర్గం పుణ్యభూమిలో జరిగిన ఈ హోమ ఫలితం రాష్ట్రమంతటికీ శుభం చేకూరుస్తుందని వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. "నాయకుడి క్షేమం... రాష్ట్రానికి శుభం" అనే నినాదంతో సాగిన ఈ పది రోజుల ఉత్సవం భక్తికి, అభిమానానికి నిదర్శనంగా నిలిచింది. కాలవ శ్రీనివాసులు చేపట్టిన ఈ అద్భుత ఆధ్యాత్మిక యజ్ఞం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ వైభవం రాష్ట్ర ప్రగతికి కొత్త ఊపిరిని ఇస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఒకవైపు హోమాలతో ఆధ్యాత్మిక పరిమళం, మరోవైపు ప్రారంభోత్సవాలతో అభివృద్ధి పలకరింపు. వెరసి రాయదుర్గంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నిర్వహించిన ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు రాష్ట్రంలోనే ఒక చారిత్రాత్మక ఘట్టంగా మారుతోంది.

**ప్రగతిబాట పట్టిన రాయదుర్గం...**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకల సందర్భంగా రూ.కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాయదుర్గం నియోజకవర్గంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. రాయదుర్గం పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కొత్తగా నిర్మించిన సిమెంట్, తారు రోడ్లు, తాగునీటి పైపు లైన్, డ్రైనేజీ వ్యవస్థలు, భవనాలకు భారీ ఎత్తున ప్రారంభోత్సవాలు జరిగాయి. ముఖ్యగా గోనబావిలో ఆగిపోయిన బాలికల ఆశ్రమ పాఠశాల రూ. 12కోట్లతో పునః ప్రారంభించారు. నేమకల్లులో రూ. 27కోట్ల విలువైన సూర్యాఘర్ పథకాన్ని ప్రారంభించారు. వీటితో పాటు గోకులం షెడ్లు, తాగునీటి పథకాలు, రాయదుర్గం ఆస్పత్రిలో తాగు నీటిశుద్ధి కేంద్రం ప్రజలకు అంకితం చేశారు. దేశం గర్వించతగ్గ జాతీయ నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహర్షి వాల్మీకి విగ్రహాలను విష్కరించారు. రాయల నాటి చారిత్రక ఘట్టాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన భువన విజయం నాటకం ఆద్యాంతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. యువ నాయకుడు కాలవ భరత్ ఆధ్వర్యంలో కాలవ ఫౌండేషన్ క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. బ్యాడ్మింటన్, కబడ్డీ లాంటి పోటీలు నిర్వహించి క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు. మరోవైపు పేదలకు ఇంటి పట్టాల పంపిణీ, రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందచేశారు. ప్రజల అవసరాలు తీర్చే అభివృద్ధి కార్యక్రమాలే ముఖ్యమంత్రికి ఇచ్చే అసలైన జన్మదిన కానుకని స్థానిక నేతలు అభిప్రాయపడుతున్నారు.

**రాయదుర్గం అభివృద్ధికి ప్రముఖుల హామీలు...**

నియోజకవర్గ పరిధిలో పలు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధుల మంజూరుకు మంత్రుల నుండి స్పష్టమైన హామీ లభించింది. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా నియోజకవర్గానికి పలువురు మంత్రులు, ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే కాలవ వారి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వినతి మేరకు ఆయా పనులకు సంబంధించిన మంత్రులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నియోజవర్గంలో పలు గ్రామీణ రహదారుల అభివృద్ధి, విస్తరణకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అంగీకరించారు. రాయదుర్గం ఏరియా ఆసుపత్రికి అవసరమైన వైద్య నిపుణులు, ఇతర సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పనతో పాటు ఆగిపోయిన భవన నిర్మానాలు పూర్తి చేయడానికి రాష్ట్ర వైద్య మరియు ఆరోగ్య శాఖ మంత్రి సూర్య కుమార్ యాదవ్ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను గొట్టిపాటి రవికుమార్‌కు వివరించడంతో ఆయన వెంటనే స్పందించారు. అవసరమైన వ్యవసాయ విద్యుత్ సర్వీసులతో పాటు ట్రాన్స్ ఫార్మర్లు, మూడు కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరుకు హామీ ఇచ్చారు.

**పాల్గొన్న ప్రముఖులు...**

నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే పాలవ శ్రీనివాసులు నిర్వహించిన పది రోజుల కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. పది రోజులపాటు నిర్వహించిన అభివృద్ధి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లో మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్‌లతో పాటు ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్, శాప్ చైర్మన్ రవినాయుడు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బి.కె పార్థసారథి, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల సునీత, ఎమ్మెస్ రాజు, పల్లె సింధూర రెడ్డి, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి వెంకట ప్రసాద్, సురేంద్రబాబు, జెసి అస్మిత్ రెడ్డి, బండారు శ్రావణి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే ఆర్.మాధవి



కడప (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రెడ్డప్పగారి మాధవిరెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం కడపలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించిన ఆమె... వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి అందిన అర్జీలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే... ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా ఆమె భరోసా ఇచ్చారు. వైసీపీ హయాంలో రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్థంగా మార్చేశారని, దోచుకోవడమే లక్ష్యంగా భూములు కబ్జా చేశారని, వారి పాపాలు ఇప్పటికి ప్రజల్ని వెంటాడుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థలను ప్రక్షాళన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గల్ఫ్‌లో వెల్లువెత్తిన అభిమానం



ఖతార్‌లో...


రక్తదాన శిబిరం


సౌదీ అరేబియాలో...

**గల్ఫ్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను గల్ఫ్ దేశాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఐ టీడీపీ గల్ఫ్ కౌన్సిల్‌లోని బ్రెహెయిన్, కువైట్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, ఒమాన్‌లకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సౌదీ అరేబియా, రియాద్, జెడ్డా, దమ్మామ్, ఖోబర్  సభ్యులు ఖాలిద్ సైఫుల్లా, జానీబాషా షేక్, రాజశేఖర్ చెన్నుపాటి, సారధినాయుడు వడ్లమూడి, శిల్ప గడ్డం, అక్షిత మందవ, నరేష్ చెన్నుపాటి, సుచరిత కందుల, ముజమ్మిల్ షేక్, జుబైల్ సభ్యులు కోగంటి శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, దశరథం, ప్రసాద్, రావి సురేష్, షాజిద్‌ఖాన్, బాలాజీ, నాగ గోవింద్, ఖతార్ సభ్యులు గొట్టిపాటి రమణయ్య, నరేష్ మద్దిపాటి, రవి పొనుగుమాటి, బొడ్డు రామారావు, జేవీవీ సత్యనారాయణ, సుధాకర్ కొడాలి, విక్రమ్ సుఖవాసి, గోవర్ధనరెడ్డి, నరేష్ నూతలపాటి, మల్లిరెడ్డి సత్యనారాయణ, స్వప్న పొనుగుమాటి, వాణి సుఖవాసి, కిరణ్‌కుమారి ఈగలపాటి, కడియాల ప్రశాంతి, అనూష, లక్ష్మి గొట్టిపాటి, రజని బొందలపాటి, వంశీప్రియా, వాసంతి బేతిని, జ్యోతి బొర్రా, కనకమహాలక్ష్మి, శిరీష మలసాని, ఒమాన్ సభ్యులు గారపాటి సత్య శ్రీధర్ రాఘవేంద్ర, కాంతేటి వాసుబాబు, రాజేష్, నాగరాజు, అనిల్ నాగిడి, రామచంద్ర బొల్లినా, అనిల్ టెల్లా, మురళీకృష్ణ, హరికృష్ణ, శ్రీనివాస్, దుబాయ్ సభ్యులైన విశ్వేశ్వరరావు మోతుకూరి, తులసికుమార్ ముక్కు, రాజా రవి, ప్రసాదు దారపనేని, రాయుడు శేష నూకరాజు, మహ్మద్ రబ్బానీ, మల్లికార్జున, తోట కిషోర్, మల్లికార్జున, బాబ్జాన్, సురేష్ నాయక్, కువైట్ సభ్యులు కుదరవల్లి సుధాకరరావు, మద్దిన ఈశ్వర్‌నాయుడు, వీసీ సుబ్బారెడ్డి, రషీదా బేగం, వేణుగోపాల్‌స్వామి, రాహుల్, గాదిరాజు శివ, సాయి, కొల్లి ఆంజనేయులు, నాయనిపాటి విజయకుమార్, వెంకట్ కోడూరి, దివాకర్ ఓలేటి, ఉదయప్రకాష్, రాచూరి రెడ్డి మోహన్, ముస్తాక్‌ఖాన్, నారాయణమ్మ, రెడ్డయ్య చౌదరి, దుగ్గినేని మురళి, మాలిసేటి రవి, కరీముల్లా, శంకర్‌యాదవ్, రామకృష్ణ, మురళి కేశినేని, శ్రీకాంత్, బ్రెహెయిన్ సభ్యులు రఘునాథ్‌బాబు, హరిబాబు, సతీష్ శెట్టి, మోహన్, ఏవీ రావు, బాలకృష్ణ, సతీష్ బొల్లా, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.


యూఏఈలో...


సౌదీ అరేబియా దమ్మామ్‌లో...


రియాద్‌లో...


కువైట్‌లో...



ఒమాన్‌లో...

# అమెరికాలో చంద్రబాబు జన్మదిన సంబరాలు

## సెయింట్ లూయిస్‌లో రక్తదానం చేసి అభిమానం చాటుకున్న ప్రవాసాంధ్రులు

**సెయింట్ లూయిస్:** అమెరికాలోని సెయింట్ లూయిస్ నగరంలో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పసుపు దళం, కూటమి కార్యకర్తల కోలాహలం మధ్య పుట్టినరోజు ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు పార్టీ తరపున ప్రశంసాపత్రాలు అందజేశారు. విదేశాల్లో ఉన్నప్పటికీ చంద్రబాబు జన్మదినాన్ని తమ ఇంటి పండుగలా జరుపుకోవడం చూస్తే దేశం దాటినా టీడీపీపై, చంద్రబాబు కుటుంబంపై అభిమానుల ప్రేమ ఏమాత్రం తగ్గలేదని స్పష్టమవుతోంది. ఈ వేడుకల్లో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ సభ్యులు చెంచు వేణుగోపాల్‌రెడ్డి (అధికార ప్రతినిధి), సురేన్ పాతూరి, రాజా సూరపనేని (తానా రీజినల్ కో–ఆర్డినేటర్), కిషోర్ ఎర్రపోతిన, రవి పొట్లా, సుధాకర్ నర్రా, వంశీ పాతూరి, వీరా, నాగకుమార్ బెల్లంకొండ, వెంకట్ గౌని, మురళి పుట్టగంటి, జనసేన నాయకులు విజయ్ సాక్షి, సత్య తదితరులు పాల్గొన్నారు. వందల సంఖ్యలో కూటమి అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఏపీ అభివృద్ధికి చంద్రబాబునాయుడు చేస్తున్న కార్యక్రమాలకు, అమరావతి నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐల తరపున పూర్తి మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా కూటమి సభ్యులు ప్రకటించారు.








## రాత్రివేళ వాహన రాకపోకలపై ఆంక్షలు

పశ్చిమబెంగాల్: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా ద్విచక్ర వాహనాల రాకపోక లపై ఎన్నికల కమిష న్ కీలక ఆంక్షలు విధించింది. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి హింసకు తావులేకుండా స్వేచ్ఛగా, సజావుగా సాగేందుకు వీలుగా బైక్ ర్యాలీలపై నిషేధం, పిలియన్ రైడింగ్స్ పై ఆంక్షలు అమల్లోకి తెచ్చింది. ఈ ఆంక్షలు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈనెల 23న మొదటి విడత పోలింగ్ జరిగే 152అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈసీ విధించిన ఆంక్ష లు అమలులో ఉంటాయి. ఈసీ ఆదేశాల ప్రకారం, సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ రోడ్లపై బైకులు, వాహనాలను అనుమతించ రు. వైద్యం, కుటుంబ ఫంక్షన్ల వంటి ఎమర్జెన్సీ అవసరాలకు మాత్రం మినహాయింపు ఉంటుంది. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి బెదిరింపులు, అడ్డంకులకు వీల్లే కుండా బైక్ ర్యాలీలపై పూర్తిగా నిషేధం విధించినట్టు ఈసీ తెలిపింది. అత్యవసర సందర్భాల్లో మినహా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పిలియన్ రైడింగ్‌పై నిషేధం అమల్లో ఉంటుం ది. పోలింగ్ రోజు పరిమితమైన సడలింపులను ఈసీ కల్పించింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఓటింగ్, ఇతర అత్యవసర పనుల కోసం పిలియన్ రైడర్స్‌గా ట్రావెల్ చేసేందుకు కుటుంబ సభ్యులను అనుమతిస్తారు. ఎవరైనా వ్యక్తులు మినహాయింపులు కోరుకుంటే స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ముందస్తుగా లిఖితపూర్వక అనుమతి పొందా ల్సి ఉంటుంది. షెడ్యూల్ ప్రకారం పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ వచ్చే గురువారం(23న) జరుగనుంది.

### కేరళలో భారీ పేలుడు..
## పలువురి దుర్మరణం

తమిళనాడు విరుదునగర్‌లోని బాణసంచాలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాద ఘటన మరువక ముందే.. కేరళలో మరో విషాదం నెలకొంది. త్రిస్సూర్ లోని ఓ బాణసంచా ఉత్పత్తి కేంద్రంలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు మృతిచెందారు. మరో 40 మంది గాయపడ్డారు. క్షత గాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమా చారం. త్రిస్సూర్ తిరువంబడిలోని ఓబాణసంచా తయారీ యూనిట్లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 24న జరగాల్సిన నమూనా బాణ సంచా కోసం ఆ కేంద్రంలో సామ గ్రిని ఉత్పత్తి చేస్తు న్నట్టు తెలుస్తోంది. ఒక్కసారిగా పేలుడు సంభవించ డంతో ఆ శబ్దం సుమారు కొన్ని కిలోమీటర్ల మేర వినిపించినట్టు స్థానికులు తెలిపారు. తొలుత దీన్ని భూప్రకంపనలుగా భావించినట్టు వారు తెలిపారు. పేలుడు అనంతరం ఆ ప్రాంతమంతా దట్ట మైన పొగలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. అయితే నల్లటి పొగలు, మరోసారి పేలుడు సంభవించిన కారణంగా సహాయక చర్యలు కష్టతరంగా మారాయని అక్కడి అధికారులు వెల్లడించారు. ఆ యూనిట్లో పేలని బాణసంచా పదార్థాలు ఇంకా ఉన్నాయనే అనుమానం తో అత్యంత జాగ్రత్తగా సహాయక కార్యకలాపాలు సాగుతున్నాయి. పేలుడుకు గల కచ్చితమైన కారణా లేమిటో ఇంకా తెలియరాలేదు.

# మమతకు గుడ్‌బై చెప్పే సమయం వచ్చేసింది



కుర్సెయోంగ్: పశ్చిమబెంగాల్‌లో ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేయనుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా (ఫాఎట్ రాష్ట్రుష్ట్ర) అన్నారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఉద్వాసన చెప్పే సమయం ఆసన్నమైందని చెప్పారు. కుర్సెయోంగ్‌లో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, డార్జిలింగ్ లో గూర్ఖా కమ్యూనిటీ చిరకాల సమస్యలకు సత్వర పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 'బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన 6 నెలల్లోనే గూర్ఖాల సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారాన్ని అందిస్తాం. గత టీఎంసీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు గూర్ఖాల ఆందోళనలను పట్టించుకోవడంలో విఫలమయ్యాయి' అని అమిత్ షా అన్నారు. గూర్ఖాల చరిత్రను అణిచివేసేందుకు మమతా దీదీ ప్రయత్నించారని, గూర్ఖాలకు జరుగుతున్న అన్యాయాలకు ముగిం పు పలికే సమయం వచ్చిందని అన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, టీఎంసీ మన కొండ ప్రాంతాలను రక్తంతో పెయింట్ వేశారని, గూర్ఖాలకు జరిగిన అన్యాయాలకు నరేంద్ర మోదీ నాయకత్వంలో తెరపడుతుందని చెప్పారు. 'గూర్ఖా సోదరులపై వందలాది తప్పుడు కేసులు పెట్టారు. వాటన్నింటినీ జూలై 31వ తేదీలోగా ఉపసంహ రిస్తాం. గూర్ఖా ఉద్యమాన్ని వాళ్లు అణిచివేశారు. మేము ఆ కేసులన్నీ ఉపసంహరిస్తాం. ఇక నిరసనలకు తావులేని విధంగా సమస్యలను పరిష్కరిస్తాం' అని అమిత్‌షా భరోసా ఇచ్చారు.

**జైళ్లకు పంపిస్తాం..**

సందేశ్‌ఖాలీ వంటి ఘటనలను అమిత్‌షా ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మహిళలపై నేరాలు పెరిగాయని, బీజేపీ అధికారంలోకి రాగానే ఆ నేరాలకు బాధ్యులైన వారందరినీ జైళ్లకు పంపిస్తామని అమిత్‌షా చెప్పారు. కుర్సెయోంగ్, కుల్తి, సల్టోని, ఛాందిపూరూర్ తదితర కీలక ప్రాంతాల్లో అమిత్‌షా మంగళవారం సుడిగాలి ప్రచారం సాగించారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా జరుగనుం డగా, మే4న ఫలితాలు వెలువడతాయి.

# కౌంటింగ్ వరకూ స్ట్రాంగ్ రూమ్‌లు తెరవద్దు..
### ఈసీ కీలక ఆదేశాలు




తిరువనంతపురం: కేరళలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారు లు, రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల కమిషన్ మంగళ వారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపు ముందు వరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ స్ట్రాంగ్‌రూమ్‌లు తెరవరాదని ఆదేశాలిచ్చింది. కోజికోడ్‌లోని పెరంబ్ర నియోజకవర్గంలో ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్‌రూమ్‌ను తెరిచారని, పాలక్కాడ్‌లోని నెన్మర నియోజక వర్గంలో మరో స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచేందుకు ప్రయత్నం చారని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కేరళ చీఫ్ ఎలక్టోరల్ అధికారి రతన్ యు కేల్కర్ తాజా ఆదేశాలు జారీ చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌లు కానీ, సీల్‌వేయని రూములు కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవవ ద్దని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సమగ్రత, పారదర్శకత, భద్రతను పరిరక్షించేందుకు అధికారులంతా ఈ సూచనలను పాటించాలని కోరారు. కాగా, ఏ ఒక్క స్ట్రాంగ్ రూమ్‌ను తెరవ లేదని కోజికోట్ జిల్లా యంత్రాంగం వివరణ ఇచ్చింది. పోలింగ్ రికార్డుల వెరిఫై, అప్‌డేట్ కోసం సీల్ చేయని మెటీరియల్ రూమ్‌ను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తెరిచినట్టు జిల్లా ఎన్నికల అధికారిగా కూడా ఉన్న కలెక్టర్ స్నేహిల్ కుమార్ సింగ్ తెలిపారు. బిల్డింగ్ మొదటి అంతస్తులోని సీల్ వేసిన గదిలో ఈవీఎంలు, వీవీపాట్‌లు ఉన్నాయని, కేంద్ర పరిశీలకులు, అభ్యర్థు ల ఏజెంట్ల పర్యవేక్షణలో ఉన్న ఈ సీల్డ్ గదిని ఎవరూ తెరవలేదని చెప్పారు. 140 నియోజకవర్గాలున్న కేరళ అసెంబ్లీకి పోలింగ్ ఏప్రిల్ 9న జరిగింది. మే 4న ఫలితాలు వెలువడతాయి.

# ఎన్నికల వేళ చిక్కుల్లో యూసఫ్ పఠాన్!
### దాడి కేసులో మామ, బామ్మర్ది అరెస్ట్



త్వరలో పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. గెలుపే లక్ష్యంగా అన్ని ప్రధాన పార్టీలు విస్తృతంగా ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తున్నాయి. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయిలో ఉంది. ఇక పశ్చిమ బెంగాల్ ఎన్నికల వేళ టీఎంసీ ఎంపీ, టీమిండియా మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్ చిక్కుల్లో పడ్డారు. ఓ వ్యక్తిపై దాడి చేశారనే ఆరోపణలతో యూసుఫ్ పఠాన్ మామ,ఆయన కుమారుడు, మరో బంధువు కలిసి ఒక వ్యక్తిపై, అతని కుటుం బంపై దాడి చేశారనే ఆరోపణలతో ముంబై పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. మహానగరం ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో ఒక కారు వెళ్తున్న క్రమంలో గుంత లోని నీరు రోడ్డు పక్కన ఉన్న వ్యక్తిపై చిమ్మింది. ఈ చిన్న కారణంతో ఆగ్రహానికి గురైన నిందితులు,కారులో ఉన్న వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. అది కాస్తా చిలికి చిలికి గాలివానలా మారి.. పరస్పర దాడుల వరకు వెళ్లింది. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో రంగం లోకి దిగిన బైకుల్లా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించారు. ఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించారు. దాడికి ఉపయోగిం చిన కర్రలు, బేస్ బాల్ బ్యాట్లను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. నిందితులపై బీఎన్ఎస్ సెక్షన్ 118(2), 115(2), 324, 352, 351(2), 3(5) కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం ముగ్గురిని అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ ఎన్నికల వేళ, ఒక సిట్టింగ్ ఎంపీ అయిన యూసఫ్ పఠాన్ బంధువులు ఇలాంటి గొడవల్లో అరెస్ట్ కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రత్యర్థి పార్టీలు ఈ అంశాన్ని ప్రచారంలో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# శబరిమల కేసులో కొనసాగుతున్న వాదనలు



న్యూఢిల్లీ: శబరిమల కేసు విచారణలో భాగం సుప్రీంకోర్టులో రాజ్యాంగ ధర్మాసనం ముందు మంగళవారం వాదనలు కొనసాగుతున్నాయి. విగ్రహం కేవలం వస్తువు కాదు.. హిందూ ధర్మంలో విగ్రహం అనేది కేవలం మట్టి లేదా రాయి కాదు, అది నిర్దిష్ట లక్షణాలు కలిగిన 'సజీవ దైవం' అని పిటీషనర్ తరపు సీనియర్ న్యాయవాది వివి గిరి తన వాదన వినిపించారు. దేవాలయంలో ప్రతిష్టించిన విగ్రహానికి చట్టపరమైన వ్యక్తిత్వం ఉంటుందంటూ సుప్రీంకోర్టు ధర్మాసనానికి ఆయన వివరణ ఇచ్చారు. శబరిమల అయ్యప్పస్వామి 'నైష్ఠిక బ్రహ్మచారి' రూపం లో ఉంటారని.. ఆ స్వామి ప్రత్యేక లక్షణాలను గౌరవించడం ఆరాధనలో భాగమేనని పేర్కొన్నారు. ప్రతి దేవాలయానికి దాని కంటూ ఒక ప్రత్యేకమైన ఆరాధనా పద్ధతితోపాటు సంప్రదాయం ఉంటుందని వివరించారు. వాటిని మార్చడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు ధర్మాసనానికి గుర్తు చేశారు. గుడికి వెళ్ళేది దైవంపై నమ్మకాన్ని చాటుకోవడానికి.. అంతేకానీ అక్కడి దైవ లక్షణాల ను లేదా సంప్రదాయాలను ప్రశ్నించడానికి కాదని వి.వి.గిరి తన వాదనలు వినిపించారు. అలాగే మతపరమైన హక్కులు, ఆచారాల పరిధిపై రాజ్యాంగ ధర్మాసనం ముందు వి.వి.గిరి సుదీర్ఘ వాదనలు వినిపించారు. ఒక వ్యక్తి తన మతాన్ని అనుస రించాలనుకున్నప్పుడు, ఆ ఆలయ సంప్రదాయాలకు లోబడి ఉండాలని సీనియర్ అడ్వకేట్ వి.వి.గిరి స్పష్టం చేశారు. రాజ్యాంగ నైతికత కంటే మతపరమైన విశ్వాసాలు, ఆచారాలకే ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా వి.వి గిరి అభిప్రాయ పడ్డారు.

# ఓవరాక్షన్‌కు సైలెన్స్ కౌంటర్!

- అమెరికాకు తలనొప్పిగా మారిన ట్రంప్ అత్యుత్సాహం
- ట్రంప్ ప్రగల్భాలకు బెదిరేది లేదంటున్న ఇరాన్
- హర్మూజ్‌ను అమెరికా దిగ్బంధించడంపైనా గుర్రు
- అనిశ్చితిలో పడిన అమెరికా-ఇరాన్ మలివిడత చర్చలు





అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు డెడ్‌లైన్ దగ్గరపడుతోంది. దానికి ఇంకా గంటల సమయమే ఉంది. మలివిడత చర్చల గురించి అంతా టెన్షన్ పడుతుండగా.. 'నేనే ముందు ప్రకటనలు చేయాలి' అనేలా ట్రంప్ వైఖరి ఇరాన్‌ను ఆగ్రహానికి గురిచేస్తోంది. దీంతో చర్చలు జరుగుతాయో, లేదో తెలియని సందిగ్ధావస్థ నెలకొంది. ట్రంప్ బెదిరిస్తే.. తగ్గేదేలే అని ఇరాన్ పట్టుదల ప్రదర్శిస్తోంది. పాకిస్థాన్ వేదికగా జరిగిన చర్చల కోసం అమెరికా – ఇరాన్ ప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కానీ అక్కడ ఎలాంటి ఫలితం రాకపోయేసరికి ఇప్పటికే ఇంధన సంక్షోభం ఎదుర్కొంటోన్న ప్రపంచం తీవ్ర ఆందోళనలోకి వెళ్లిపోయింది. సీజ్‌ఫైర్ ముగిసేలోపు రెండోదఫా చర్చలుంటాయని ప్రకటనలు వినిపించడం తో కాస్త ఊరట కనిపించింది. కానీ అంతలోనే సీనియర్ స్టాఫ్ సలహాలను పక్కన పెట్టిన ట్రంప్.. చర్చల కోసం జరుగుతోన్న దౌత్య ప్రయత్నాలను దెబ్బతీసేలా బహిరంగ ప్రకటనలు చేశారు. ఇరాన్ వెళ్లిన పాక్ మధ్యవర్తులు ఇచ్చిన సమాచారంపై మాట్లాడటం మొదలుపెట్టారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

అమెరికా షరతులకు ఇరాన్ అంగీకరించినట్టు ట్రూత్‌లో ట్రంప్ పలికిన ప్రగల్భాలే.. ఇప్పుడు పీటముడిని మరింత బిగించినట్టు కనిపిస్తోంది. వాస్తవంగా వాటిని అంగీకరించేందుకు ఇరాన్ సిద్ధంగా లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. శుద్ధి చేసిన యురేనియాన్ని అప్పగించడం సహా పలు డిమాండ్లకు ఇరాన్ అంగీకరించిందని, యుద్ధం ముగిసిందని ట్రంప్ బహిరంగంగా ప్రకటనలు చేశారు. ఈ వ్యాఖ్యలు ఇరాన్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి. అధ్యక్షుడి ప్రకటనలను ఆ దేశం తోసిపుచ్చింది. చర్చల కోసం జరుగుతోన్న ప్రయత్నాలను పక్కన పెడతామని తేల్చి చెప్పేసింది. ట్రంప్ అత్యుత్సాహం.. వారం రోజులుగా కాస్త ఆశావహంగా కనిపిస్తోన్న వాతావరణాన్ని దెబ్బతీసింది.

### ఇరాన్ నాయకత్వంలో చీలికపై కలవరం..!

ఈ సమస్య ఒకవైపు ఉండగా.. ఇరాన్‌లోని నాయకత్వంలో చీలిక ఉందన్న నిఘావర్గాల సమాచారం అమెరికాను మరింత కలవరానికి గురిచేస్తోందట. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ బృందానికి, ఐఆర్జీసీకి మధ్య విభేదాలున్నాయనే అనుమానాలున్నాయి. కరడుగట్టిన ఐఆర్‌జీసీ నాయకుల చేతుల్లోకి ఇరాన్ వెళ్లిందన్న వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఒకవేళ ఒప్పందం కుదిరితే ఎవరు చేసిన సంతకం చెల్లుబాటు అవుతుందనే ప్రశ్న ఇప్పుడు అగ్రరాజ్యాన్ని వెంటాడుతోంది.

### కాల్పుల విరమణ ఉల్లంఘించేలా..

ఇక, ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్.. ఇరుదేశాల చర్చల్లో కీలకాంశం. యురేనియం శుద్ధిచేయడం పూర్తిగా ఆపేయాలని యూఎస్ పట్టుబడుతోంది. ఇదంతా ఒక క్రమంలో జరగాలని ఇరాన్ కోరుకుంటోంది. ప్రస్తుతానికి ఈ యురేనియం శుద్ధిని తాత్కాలికంగా నిలిపివేసి, తర్వాత కఠిన పర్యవేక్షణలో పరిమితంగా అనుమతించాలంటోందని చర్చల వివరాలు వెల్లడిస్తున్నాయి. ఇదే చర్చల్లో ప్రధాన అడ్డంకిగా ఉంది. ఒకవేళ ఇరాన్ అంగీకరిస్తే ప్రపంచవ్యాప్తంగా ఫ్రీజ్ చేసిన ఆస్తుల్లో కొంత మొత్తాన్ని విడుదల చేసే అంశాన్ని అమెరికా యోచిస్తోందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

ఇదీ.. చాలదన్నట్టు కాల్పుల విరమణ సమయంలో హర్మూజ్‌ను అమెరికా దిగ్బంధించి, ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు సాగించే నౌకలను అడ్డుకుంటోంది. హర్మూజ్ సమీపంలో టెహ్రాన్ నౌక తౌస్కాపై వాషింగ్టన్ బలగాలు దాడి చేయడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనతోపాటు తమ నౌకల రాకపోకలపై దిగ్బంధనం విధించడంతో ట్రంప్ దౌత్య ప్రయత్నాలను దెబ్బతీశారని ఇరాన్ ఆరోపించింది. ఇరాన్‌తో చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మంగళవారం పాకిస్థాన్లోని ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. ట్రంప్ బెదిరింపుల మధ్య ఇరాన్ ప్రతినిధుల రాకపై ఇంకా అనిశ్చితి నెలకొంది.

## చర్చలు తప్ప వాళ్లకు మరోమార్గం లేదు

ఇరాన్ లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. కాల్పుల విరమణను పొడిగించడం తనకు ఇష్టం లేదన్నారు. చర్చలు జరపడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదన్నారు. ఈ విరామ సమయాన్ని వినియోగించుకుని అమెరికా సైన్యం అదనపు ఆయుధ సామగ్రిని సమకూర్చుకుందన్నారు. తాను ఆదేశిస్తే ఇరాన్‌పై దాడులను తిరిగి ప్రారంభించడానికి సైన్యం సిద్ధంగా ఉందని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ తెలిపారు. తదుపరి చర్చల్లో పురోగతి ఉంటే కాల్పుల విరమణ కొనసాగిస్తారా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. కాల్పుల విరమణను కొనసాగించాలని కోరుకోవడం లేదన్నారు. తమకు అంత సమయం కూడా లేదన్నారు. మరోవైపు కాల్పుల విరమణ గడువు మంగళవారమా? బుధవారం అర్ధరాత్రితో ముగుస్తుందా? అన్న విషయంపై స్పష్టత లేదు.



## అమెరికా కన్నుగప్పిన ఇరాన్

**దిగ్బంధనాన్ని తప్పించుకుని ఇరాన్ జలాల్లోకి సూపర్ ట్యాంకర్**

హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా కట్టుదిట్టమైన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకొని ఇరాన్‌కు చెందిన ఓ సూపర్ ట్యాంకర్ తిరిగి తమ జలాల్లోకి చేరుకున్నట్టు తెలుస్తోంది. నౌకల ట్రాకింగ్ డేటా ప్రకారం.. 20 లక్షల బ్యారెళ్ల చమురుతో నిండిన ఈ సూపర్ ట్యాంకర్ మార్చిలో ఇరాన్‌నుంచి ఇండోనేసియాకు బయలుదేరింది. రియూ ద్వీప సమూహానికి చేరుకున్నాక.. మరొక సూపర్ ట్యాంకర్‌లోకి ఆ చమురును బదిలీ చేసింది. అనంతరం తిరిగి ప్రయాణం ప్రారంభించింది. ఒకవైపు అమెరికా దిగ్బంధనం కొనసాగుతుండగానే.. దాన్ని తప్పించుకొని స్వదేశీ జలాల్లోకి చేరుకొంది. త్వరలోనే అది ఖర్గ్ ద్వీపానికి వెళ్లనుంది. ఈ చర్య అమెరికా దిగ్బంధనంపై సాధించిన గొప్ప విజయంగా టెహ్రాన్ అభివర్ణించింది. అయితే దీనిపై అమెరికా ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇదిలాఉండగా.. అమెరికా– ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఇరుదేశాల మధ్య జరగాల్సిన రెండోవిడత చర్చలపై అనిశ్చితి నెలకొంది. ఈ క్రమంలో అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకొని.. ఇరాన్ నౌక తన సొంత జలాల్లోకి ప్రవేశించడం కీలక పరిణామంగా మారింది.

## చైనానుంచి ఇరాన్‌కు క్షిపణి రసాయినాల..!

**సీజ్ చేసిన నౌకతో గుట్టు రట్టయిందంటున్న అమెరికా**

ఐక్యరాజ్యసమితిలో యూఎస్ మాజీ రాయబారి, రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ సంచలన ఆరోపణలు చేశారు. హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ పతాకంతో ప్రయాణిస్తున్న 'తౌస్కా' అనే వాణిజ్య నౌకను ఇటీవల అమెరికా సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ నౌకలో క్షిపణి తయారీలో ఉపయోగించే రసాయనాలు ఉన్నాయని నిక్కీ హేలీ పేర్కొన్నారు. ఈమేరకు ఆమె ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. ఇటీవల హర్మూజ్ జలసంధిలో అమెరికా స్వాధీనం చేసుకొన్న నౌక చైనా నుంచి ఇరాన్‌కు వెళుతుందని నిక్కీ హేలీ పేర్కొన్నారు. క్షిపణి తయారీలో వినియోగించే రసాయనాలను అందులో తరలిస్తున్నట్టు



ఆరోపించారు. నౌకను ఆపాలని యూఎస్ దళాలు అనేకసార్లు హెచ్చరించినా, అది పట్టించుకోలేదన్నారు. దీంతో యుద్ధంలో ఇరాన్‌కు చైనా సైనిక సాయం అందిస్తోందనే విషయాన్ని తోసిపుచ్చలేమని వ్యాఖ్యానించారు.

### నౌకను తక్షణమే విడుదల చేయండి..

అమెరికా తమ వాణిజ్య నౌకను సీజ్ చేయడంపై ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్రంగా మండిపడింది. నౌకను, అందులోని సిబ్బందిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఇది వెంటనే జరగకపోతే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఓ ప్రకటనలో అమెరికాను హెచ్చరించింది. ఈ ఆపరేషన్‌లో సిబ్బందిని, వారి కుటుంబాలను బెదిరించి అమెరికా దళాలు.. బందీలుగా చేసుకున్నాయని ఆరోపించింది. అంతర్జాతీయ సంస్థలు వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, నౌకను, అందులోని సిబ్బంది క్షేమంగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరింది. జాతీయ ప్రయోజనాలను, తమ పౌరుల హక్కులను కాపాడుకొనేందుకు ఇరాన్ అన్ని మార్గాలను వాడుతుందని వెల్లడించింది.

## గురుద్వారాలో ఆర్థిక తగాదా జర్మనీలో కత్తులు దూసుకున్న వైరివర్గాలు

జర్మనీలోని గురుద్వారాలో హింసాత్మక ఘర్షణ చోటుచేసుకుంది. రెండు బృందాల మధ్య చిన్నగా మొదలైన గొడవ, చిలికి చిలికి పెద్దదై.. ఒకరిపై మరొకరు పదునైన ఆయుధాలు, కత్తులతో దాడి చేసుకునేవరకు వెళ్లింది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. జర్మనీలోని గురుద్వారాలో జరిగిన ఈ ఘటనలో దాదాపు 40మంది పాల్గొన్నారు. ఘర్షణ హింసాత్మకంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించినట్టు జర్మన్ మీడియా పేర్కొంది. దాడులు చేసేందుకు పదునైన కత్తులు, పెప్పర్ స్ప్రే, తుపాకీలు ఉపయోగించినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘర్షణకు అసలు కారణం ఏంటనేది తెలియరాలేదని, దానిపైనే దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

"ప్రణాళిక ప్రకారమే ఈ దాడులు చేసినట్టు అనిపించింది. సమావేశంలో ఉన్న కొందరు ప్రార్థనకు ముందు అకస్మాత్తుగా పెప్పర్ స్ప్రే తీసుకొని తమ ప్రత్యర్థులపై చల్లారు. తర్వాత వారిలో ఓ వ్యక్తి గన్‌తో కాల్పులు జరిపాడు. ఆ దాడికి పాల్పడిన వారి వద్ద పదునైన కత్తులు కూడా ఉన్నాయి. మాజీ బోర్డు సభ్యులకు, ప్రస్తుత బోర్డు సభ్యులకు గురుద్వారా నిధుల నిర్వహణ విషయంలో వివాదాలు ఉన్నాయి. తుది నిర్ణయం ఎవరు తీసుకోవాలనే విషయంపై ఈ సమావేశం ఏర్పాటుచేశారు. ఘర్షణలు మొదలవగానే కొందరు భయంతో అక్కడినుంచి పారిపోయారు" అని ఈ ఘర్షణను ప్రత్యక్షంగా చూసినవారు చెబుతున్నారు.

# ఆ ఐదో ఓవర్ వెనక అసలు కథ ఇదే!

## గన్‌తో బెదిరించి కెప్టెన్‌ను మార్చిన బిష్ణోయ్ గ్యాంగ్

టీ20 ప్రపంచకప్ 2026 ముగిసి దాదాపు రెండు నెలలు అవుతోంది. ఫైనల్‌లో న్యూజిలాండ్ పై ఘన విజయం సాధించి టీమిండియా ట్రోఫీని ముద్దాడింది. ప్రపంచ కప్ నేపథ్యంలో కెనడా జట్టు ను చుట్టుముట్టిన ఫిక్సింగ్ ఆరోపణలు తాజాగా సంచలనం రేపుతున్నాయి.

దీనిపై ఐసీసీ అవినీతి నిరోధక యూనిట్ విచారణ జరుపుతోంది. దీంట్లో భాగంగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నా యి. క్రికెట్ కెనడా ఫిక్సింగ్ ఆరోపణల్లో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌పాత్ర ఉందన్న ఆరోపణలు క్రీడా ప్రపంచాన్ని షాక్‌కు గురిచేస్తున్నాయి.

**గన్‌తో బెదిరించి..**

టీ20 ప్రపంచ కప్ టోర్నీకి కేవలం మూడు వారాల ముందు అనూహ్యంగా క్రికెట్ కెనడా..తమ జట్టు కెప్టెన్‌ను మార్చింది. ఉన్నట్టుండి దిల్‌ప్రీత్ బజ్వాను కెప్టెన్‌గా ప్రకటించింది. ఈ అంశంపై కూడా ఐసీసీ అవినీతి నిరోధక టీమ్ విచారణ జరిపింది. కెనడియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ కథనం ప్రకారం.. జూలై 2025లో బ్రిటీష్ కొలం బియాలోని ఒక రెస్టారెంట్‌లో జరిగిన సంఘటన ఈఫిక్సింగ్ కుంభకోణానికి పునాది వేసింది. అక్కడ భోజనం చేస్తున్న కెనడా జాతీయ జట్టు స్టార్ ప్లేయర్ దగ్గరకు ఇద్దరు వ్యక్తులు వచ్చి తాము బిష్ణోయ్ గ్యాంగ్ ప్రతినిధులమని పరిచయం చేసుకున్నారట. దిల్‌ప్రీత్ బజ్వాను జట్టులోకి తీసు కోవడమే కాకుండా.. అతడిని కెప్టెన్‌గా నియమిం చడానికి మద్దతు ఇవ్వాలని.. లేదంటే కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించినట్లు సమాచా రం. పాయింట్ బ్లాకులో గన్ పెట్టి బెదిరించి జట్టు కెప్టెన్‌ను అనూహ్యంగా మార్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి.





**వివాదాస్పదంగా ఐదో ఓవర్..**

టీ20 ప్రపంచ కప్ 2026లో గ్రూప్ స్టేజ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కెనడా కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా వేసిన ఐదో ఓవర్ అనుమానాస్పదం గా మారిందని కెనడాకు చెందిన ఇన్వెస్టిగేటివ్ కార్యక్రమం 'ది ఫిఫ్త్ ఎస్టేట్' తెలిపిన సంగతి తెలి సిందే. ఆ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి కేవలం 35 పరుగులే చేసిన కివీస్.. బజ్వా వేసిన ఐదో ఓవర్లో 15 పరుగులు రాబట్టిం ది. అందులో ఒక నో బాల్, ఒక వైడ్ ఉండటం గమనార్హం. అక్కడి నుంచి మ్యాచ్ స్వరూపమే మారిపోయిందని సదరు డాక్యుమెంటరీ ఆరోపణ. ఈ అంశంపై కూడా ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ కన్నేసింది. బజ్వాను ప్రశ్నించడమే కాకుండా, మొబైల్ ఫోన్‌ను కూడా పరిశీలించినట్లు సమాచారం. ఈ క్రమం లోనే గ్యాంగ్‌స్టర్లతో అతడికి లింకులు ఉన్నట్లు వెలుగులోకి వస్తు న్నాయి. జైలులో ఉంటూనే నెట్‌వర్క్ నడిపే బిష్ణోయ్.. ఇప్పుడు క్రికెట్ బెట్టింగ్ మాఫియాలోకి కూడా ప్రవేశించాడని కథనాలు వెల్లడిస్తున్నాయి.

**బోర్డు ప్రమేయం ఉందా..?**

కేవలం ఆటగాళ్లే కాకుండా, క్రికెట్ కెనడా ప్రెసిడెంట్ అరవిందర్ ఖోసా కూడా ఈ ముఠాకు సహకరిస్తున్నారని ఆరోప ణలు వస్తున్నాయి. దిల్‌ప్రీత్ బజ్వాను కెప్టెన్ చేయడంలో ఖోసా కీలక పాత్ర పోషించారని, ఇది కేవలం మ్యాచ్‌లు ఫిక్స్ చేసి డబ్బు సంపాదించడానికే అని కొందరు బోర్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే ఖోసా ఈ ఆరోపణలను కొట్టిపారేశారు. ఇదంతా తనపై జరుగుతున్న రాజకీయ కుట్ర అని ఆయన వాదిస్తున్నారు. మరో వైపు, మాజీ కోచ్ ఖుర్రం చోహాన్ కూడా గతంలో మ్యాచ్ ఫిక్సింగ్ కోసం బోర్డు సభ్యుల నుంచి ఒత్తిడి ఎదుర్కొన్నట్లు పేర్కొనడం సంచలనం రేపుతోంది. మొత్తంగా చూస్తే, కెనడా క్రికెట్ చుట్టూ ఏర్పడిన ఈ ఫిక్సింగ్ మబ్బులు అంతర్జాతీయ క్రికెట్‌లో కలకలం రేపుతున్నాయి. బిష్ణోయ్ గ్యాంగ్ పాత్ర నిజమైతే, ఇది కేవలం క్రీడా అవినీతి కాకుండా అంతర్జాతీయ స్థాయి నేర జాలం వరకు విస్తరించిన కేసుగా మారే అవకాశం ఉంది.

# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. టీమిండియా మహిళల స్థానాలివే!




ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా మహిళలు దూసుకెళ్తున్నారు. టీ20 ఫార్మాట్‌కు సంబంధించిన ర్యాంకింగ్స్ జాబితాను తాజాగా ఐసీసీ ప్రకటించింది. యువ ప్లేయర్ షెఫాలీ వర్మ టాప్ 5లోకి అడుగుపెట్టడానికి అత్యంత చేరువలో ఉంది. మరోవైపు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ టాప్ 10కి అడుగుదూరంలో ఉంది. కాగా ఆస్ట్రేలియా క్రికెటర్ జార్జియా వాల్ 815 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఆ తర్వాతి స్థానాల్లో బెత్ మూనీ(788), హేలీ మ్యాథ్యూస్(767) కొనసాగుతున్నారు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన షెఫాలీ.. రెండు స్థానాలు ఎగబాకి 731 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. ఆమె ఇటీవల సాధించిన వేగవంతమైన అర్ధ శతకం ర్యాంకింగ్స్‌లో ఎదుగుదలకు దోహదపడింది. ఇదే సమయంలో స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన 762 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కూడా ఫామ్‌లోకి వచ్చిందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. సఫారీలపై తొలి మ్యాచ్‌లో అజే యంగా 47 పరుగులు చేసిన హర్మన్.. రెండు స్థానాలు మెరుగుపరచుకుని 639 రేటింగ్ పాయింట్లతో 11వ స్థానానికి చేరుకుంది. టాప్-10లోకి అడుగుపెట్టడానికి అడుగు దూరంలో ఉంది. కాగా జెమీమా రోడ్రిగ్స్ 637 పాయింట్లతో 14వ స్థానానికి పడిపోయింది.

**బౌలింగ్ విభాగంలో సాదియా ఇక్బాల్ టాప్**

బౌలింగ్ విభాగంలో పాకిస్థాన్‌ప్లేయర్ సాదియా ఇక్బాల్ 743పాయింట్లతో తన అగ్రస్థానాన్ని కాపాడుకుంది. దక్షిణాఫ్రికాకు చెందిన నాన్‌కులు లేకో మలబా ఏకంగా ఆరు స్థానాలకు ఎగబాకి 704 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. టీమిండియా స్టార్ ప్లేయర్ దీప్తి శర్మ 705 పాయింట్లతో ఐదో స్థానానికి పడిపోయింది. రేణుకా సింగ్(699) 9వ స్థానంలో ఉండగా, అరుంధతీ రెడ్డి(665) 12వ స్థానంలో కొనసాగుతోంది. ఆల్‌రౌండర్ల జాబితాలో కెర్ 508 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.

# ఐపీఎల్ నుంచి ఆయుశ్ మాత్రే ఔట్



ఐపీఎల్ 2026లో చెన్నైసూపర్ కింగ్స్‌కు భారీ షాక్ తగిలింది. మంచి ఫామ్‌లో ఉన్న సీఎస్కే బ్యాటర్ ఆయుశ్ మాత్రే ఐపీఎల్‌కు దూరమయ్యా డు. కండరాల గాయం కారణంగా మిగతా సీజన్ లో అతడు ఆడబోడని సీఎస్కే ఎక్స్ వేదికగా ప్రక టించింది. ఏప్రిల్ 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచులో ఆయుశ్ తొడ కండరాల గాయానికి గురైన సంగతి తెలిసిందే. అతడు గాయం నుంచి కోలుకోవడానికి దాదాపు 6-12 వారాల సమయం పడుతుందని టీమ్ వెల్లడిం చింది. 18 ఏళ్ల ఆయుశ్ మాత్రే ఈ సీజన్‌లో సీఎస్కేకు అత్యంత కీలక ప్లేయర్. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో 201 పరుగులు సాధించి, 177 స్ట్రైక్ రేట్‌తో దూసుకెళ్లాడు. రెండు హాఫ్ సెంచరీలతో జట్టుకు వేగవంతమైన ఆరంభాలు అందిస్తూ ఈ ఏడాది సీఎస్కే టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అద్భుత మైన ఫామ్‌లో ఉన్న స్టార్ ప్లేయర్ ఇలా గాయంతో టోర్నీకి దూరమవ్వడం..సీఎస్కే జట్టుకు పెద్ద లోటే.

**ప్రత్యామ్నాయం ఎవరంటే...?**

ఆయుశ్ మాత్రే టోర్నీకి దూరం అవ్వడంలో సీఎస్కే మేనేజ్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంపై తల నొప్పి మొదలైంది. మాత్రే తరహాలో అగ్రెసివ్ బ్యాటింగ్ సామర్థ్యం ఉన్న ప్లేయర్ల లిస్ట్‌లో ఉర్విల్ పటేల్ ముందంజలో ఉన్నాడు. గత సీజన్‌లో 28 బంతు ల్లోనే సెంచరీ నమోదు చేసి సంచలనం సృష్టించిన సంగ తి తెలిసిందే. మరోవైపు, అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా భారీ ధరకు కొనుగోలు చేసిన కార్తిక్ శర్మ కూడా ఒక ఎంపికగా ఉన్నా.. అతడి ఫామ్ స్థిరంగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.యువ ఆటగాడు సస్రిక్ చికారా పవర్‌ప్లేలో దూకుడు చూపించే సామర్థ్యంతో మరో ఆప్షన్‌గా కనిపిస్తు న్నాడు. మొత్తంగా, మాత్రే గాయం సీఎస్కేకు పెద్ద తలనొప్పిగా మారగా, ప్లేఆఫ్ రేసులో నిలవాలంటే సరైన ప్రత్యామ్నాయాన్ని ఎంపిక చేయడం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. కాగా చెన్నై జట్టు ఇప్పటికి ఆరు మ్యాచుల్లో రెండు గెలిచి పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో కొనసాగుతోంది.

# ఓటమిపై గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ కామెంట్స్

ఐపీఎల్ 2026లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో గుజరాత్ టైటాన్స్ 99 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది. తిలక్ వర్మ (101 నాటౌట్) రికార్డు శతకంతో ముంబై ఇండియన్స్ విజయంలో కీలక పాత్ర పోషించా డు. మరోవైపు గుజరాత్‌కు ఇది హ్యాట్రిక్ విజయాల తర్వాత తొలి పరాజయం. ఈ మ్యాచ్‌లో ముంబై నిర్దేశించిన 200 పరుగుల లక్ష్య ఛేదనలో గుజరాత్ చేతులెత్తేసింది. 15.5 ఓవర్లలో 100 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది. మ్యాచ్ అనంతరం గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఓటమిపై కీలక వ్యాఖ్యలు చేశాడు. మధ్య ఓవర్లలో ఎక్కువ పరుగులు ఇవ్వడం మ్యాచ్ ఫలితంపై ప్రభావం చూపిందని అభిప్రాయ పడ్డాడు. 'ఈ పిచ్ కాస్త మందకొడిగా, నెమ్మదిగా ఉందని మా జట్టు ఆట ఆరంభంలోనే గుర్తించింది. అయినప్పటికీ ముంబై జట్టును భారీ స్కోరు చేయకుండా కట్టడి చేయడంలో మా బౌలర్లు విఫలమ య్యారు. పిచ్‌పై 160-170 పరుగులే ఎక్కువ స్కోరు.మా బౌలర్లు మధ్య ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయలేకపోవడం వల్ల ప్రత్యర్థి జట్టు అదనపు పరుగులు సాధించింది. ఈమ్యాచ్ నుంచి ఎన్నో పాఠాలు నేర్చు కోవాలి. వాటిని భవిష్యత్తులో అమలు చేయాల్సిన అవ సరం ఉంది' అని శుభ్‌మన్ గిల్ వెల్లడించాడు. 'వికెట్ కొంచెం నెమ్మదిగా ఉంది. బంతి సరిగా బ్యాట్‌పైకి రాక పోవడం బౌలర్లకు సవాలుగా మారింది. మధ్య ఓవర్లలో ఒకే లెంగ్త్‌ను కచ్చితంగా పాటించలేకపోయాము. ఈ ఓటమిని పెద్ద అవరోధంగా చూడటం లేదు. ఇకపై బయట మైదానాల్లో జరిగే మ్యాచ్‌ల్లో తిరిగి విజయాల బాట పట్టేందుకు ఈ మ్యాచ్ ఓటమి ఓ గుణపాఠం. జట్టు ప్రదర్శనను మెరుగుపరచుకోవడానికి అవసరమైన మార్పు లు చేసుకుంటాం' అని గిల్ తెలిపాడు. మొత్తంగా, గిల్ ఈ మ్యాచ్‌లో జరిగిన తప్పిదాలను గుర్తించి, వాటిని సరిదిద్ద కుంటే మళ్లీ అనేక విజయాలు సాధిస్తామనే ఆశాభావం వ్యక్తం చేశాడు.




## సూర్యవంశీకి వచ్చిన క్రేజ్ అతడికి రాలేదు..

### అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఐపీఎల్ 2026లో యువ బ్యాటర్ల హవా కొనసాగుతోంది. వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ మాత్రే వంటి ప్లేయర్లు సంచలనాలు సృష్టిస్తున్నారు. అయితే పంజాబ్ కింగ్స్ యువ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్యకు ఎక్కువగా హైప్ రాలేదు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై కేవలం 37 బంతుల్లోనే 93 పరుగులు చేసి తన మెరుపు ఇన్నింగ్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ సీజన్‌లో ఇప్పటికే ఆడిన ఐదు మ్యాచుల్లో 211 పరుగులు సాధించి అదరగొడుతున్నాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అయితే వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ మాత్రేకు వచ్చినంత క్రేజ్ ప్రియాంశ్ ఆర్యకు రాలేదని అభిప్రా యపడ్డాడు. 'ఏ బ్యాటర్‌నూ తక్కువ చేయాలని కాదు కానీ ఇప్పు డున్న యువ బ్యాటర్లలో ప్రియాంశ్ ఆర్య అదరగొడుతున్నాడు. అతడి ఆట తీరు చూస్తే చూడముచ్చటేస్తోంది. ప్రియాంశ్‌లో పెద్ద ఇన్నింగ్స్ ఆడే సామర్థ్యం ఉంది. షాట్ల రేంజ్ కూడా చాలా ఎక్కువ గా ఉంది. అతడే భారత క్రికెట్‌కు భవిష్యత్తు అని అనిపిస్తోంది. వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ మాత్రేలకు వచ్చినంత క్రేజ్.. ప్రియాంశ్ ఆర్యకు రాలేదు' అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ 246 పరుగులు చేయగా.. ఆయుశ్ మాత్రే 201 పరుగులు చేశాడు. ప్రియాంశ్ ఆర్య 211 పరుగులు చేశాడు. ఇదిలా ఉంటే, పంజాబ్ కింగ్స్ జట్టు ఇప్పటి వరకు ఆడిన మ్యాచుల్లో అన్నీ గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసా గుతోంది. ఆరు మ్యాచుల్లో ఐదు గెలవగా ఒకటి వర్షం కారణంగా రద్దు అయింది.



# ఆ చాన్స్ ఎవరికో..!



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న సినిమా ‘పెద్ది’. తాజాగా ఈ మూవీ షూటింగ్ అప్డేట్ ఇచ్చారు దర్శకుడు. మరో ఆరు రోజుల్లో మొత్తం షూటింగ్ పూర్తవుతుందని తెలిపారు. మూవీ సెట్లో తనతో కలిసి చరణ్ తీసిన సెల్ఫీని అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫొటోకు క్షణాల్లో వేల ‘లైక్’లు వచ్చాయి. ఈ సినిమా జూన్‌లో థియేటర్లలోకి రానుంది. విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు.

ఇదిలావుంటే, ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ కోసం ఓ రేంజ్‌లో కసరత్తులు జరిగినట్టు తెలిసింది. ప్రత్యేక గీతాన్ని కూడా లాస్ట్ షెడ్యూల్లో షూటింగ్ చేయనున్నట్టు సమాచారం. ఈ పాట విషయంలో ఇప్పటికే పలువురి హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి.

పూజాహెగ్డే, శ్రీలీల, సమంత, మృణాల్ ఠాకూర్, మానస వారణాసి, ఆయేషా ఖాన్.. ఇలా జాబితా పెద్దదే. వీరిలో ఎవరో ఒకరు నటించాల్సి ఉందంటూ ప్రచారం జరిగింది. కానీ, దీనిపై చిత్ర బృందం ఇప్పటి వరకూ స్పందించలేదు. దీంతో మరో రూమర్ చక్కర్లు కొడుతోంది. ‘విరూపాక్ష, ‘అఖండ-2’ తదితర చిత్రాల ఫేమ్ సంయుక్త.. ‘పెద్ది’లోని స్పెషల్ సాంగ్‌లో చరణ్ సరసన ఆడిపాడనుందంటూ తాజా సమాచారం. దీనిపైనా అధికారిక ప్రకటన లేదు. మరి. ఈ ప్రత్యేక గీతం అవకాశం ఎవరికి దక్కిందో తెలియాలంటే వేచి చూడాల్సిందే.

# ఆ రోజు తుపానేనట!

ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. “తుపాను తన లక్ష్యాన్ని కనుగొంది. 2027 జూన్ 11న థియేటర్లలో రావడం ఖాయం” అంటూ కొత్త విడుదల తేదీతోపాటు ఓ అప్డేడేట్‌ను పంచుకుంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నట్టు తెలిపింది. మొదట ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావించారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండడంతో దీన్ని ఈ యేడాది జూన్ 25కు వాయిదా వేశారు. అయితే ఇంకా షూటింగ్ పూర్తికాకపోవడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మిగిలిఉండడంతో ఇప్పుడు వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ప్రశాంత్ నీల్ మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా దీన్ని రూపొందిస్తున్నారు. సినిమా



ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా ఉండేలా చూస్తున్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. ‘డ్రాగన్’ పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న సినిమా కోసం ఎన్టీఆర్ తన లుక్ మార్చుకున్నారు. బరువు తగ్గి నాజూగ్గా కనిపిస్తున్నారు. ఈ సినిమాపై ఆడియన్స్‌లో భారీ అంచనాలే ఉన్నాయి.

# పార్ట్-3 ఉంటుంది, ఇప్పుడు కాదు

కన్నడ చిత్ర పరిశ్రమను మరోస్థాయికి తీసుకెళ్లిన సినిమాలు ‘కేజీయఫ్-1’, ‘కేజీయఫ్-2’. వీటి కథ, అందులోని యాక్షన్‌కు సినీ ప్రియులు ఫిదా అయిపోయారు. అందుకే ఈ హిట్ ఫ్రాంచైజీలో ‘కేజీయఫ్-3’ కోసం అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎప్పటికైనా వస్తుందనే ఆశ ఉన్నా.. అది ఎప్పుడనే ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేదు. తాజాగా హీరో యశ్ కూడా దానిపై స్పష్టత ఇవ్వలేదుగానీ.. మూవీ తప్పకుండా ఉంటుందన్నారు. దానికి చాలా సమయం పడుతుందని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రస్తుతం భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉండటమే ఈ క్రేజీ సీక్వెల్ ఆలస్యానికి ఓ కారణంగా చెప్పారు. దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో తరచూ మాట్లాడుతూనే ఉన్నానని, సరైన సమయంలోనే ‘కేజీయఫ్-3’



ప్రారంభమవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి మూడు భారీ చిత్రాల్లో నటిస్తున్నారు యశ్. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘టాక్సిక్’ జూన్ 4న విడుదల కానుంది.

నితీశ్ తివారీ రూపొందిస్తున్న ‘రామాయణ’లో రావణుడిగా కనిపించనున్నారు యశ్. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది.ఫస్ట్ పార్ట్ ఈ ఏడాది దీపావళికి, సెకండ్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ప్రశాంత్ నీల్ విషయాని కొస్తే.. ఎన్టీఆర్ హీరోగా ఓ పవర్ఫుల్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇది 2027 జూన్ 11న బాక్సాఫీసు ముందుకు వస్తుంది.



## ఈఎన్ఈ-2:

## ఈసారి థాయిలాండ్‌లో..

టాలీవుడ్ యూత్‌కి బాగా నచ్చిన పలు ఎంటర్టైనర్ చిత్రాల్లో ఈ నగరానికి ఏమైంది ఒకటి. విశ్వక్‌సేన్ హీరోగా దర్శకుడు తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన సినిమా గత 2018లో వచ్చి అప్పుడు థియేటర్స్‌లో ఆకట్టుకోకపోయినా తర్వాత మాత్రం కల్ట్ స్టేటస్ తెచ్చుకుంది. ఇక ఈ సినిమాకి పార్ట్-2 ఇప్పుడు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనితో ఈ ప్రాజెక్ట్ పై మరిన్ని అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమా తాలూకా షూట్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతుంది. తాజాగా చిత్ర యూనిట్ షేర్ చేసుకున్న పిక్ ఒకటి వైరల్‌గా మారింది. ఇందులో వివేక్ అండ్ గ్యాంగ్ తమ కార్‌లో కలిసి మరో రైడ్‌లో చిల్ అవుతున్నట్టు కనిపిస్తున్నారు. ఇది థాయిలాండ్‌లో అన్నట్టు కూడా తెలిపారు. సో ఈసారి గోవానుంచి థాయిలాండ్ కి వీళ్ళ రచ్చ షిఫ్ట్ అయ్యింది అని చెప్పవచ్చు. సో ఈసారి ఎంటర్టైన్మెంట్ డోస్ ఎలా

# తెలుగులోకి వాలా-2

మలయాళ చిత్ర పరిశ్రమలో బాక్సాఫీస్‌వద్ద కాసుల వర్షం కురిపించిన బ్లాక్ బస్టర్ మూవీ ‘వాలా-2’ ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌ను నేచురల్ స్టార్ నాని సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ట్రైలర్ చూస్తుంటే, ఇది కేవలం నవ్వులే కాదు, యువత ఆలోచనలను ప్రతిబింబించే చిత్రమని అర్థమవుతోంది. చదువులో వెనుకబడి, ఇంట్లో తిట్లు తింటూ, సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు కోసం పోరాడే నలుగురు సామాన్య కుర్రాళ్ల కథే ఈ ‘వాలా-2’. కామెడీ, ఎమోషన్స్ మరియు స్నేహం కలగలిసిన ఈ ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. మలయాళంలో ఈ చిత్రం ఇప్పటికే రూ.210 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, గత రికార్డులను తిరగరాసింది. షైన్ స్క్రీన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత సాహు గారపాటి ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. హాషీర్, అలన్ బిన్ సిరాజ్, అజిన్ జాయ్, వినాయక్ ప్రధాన పాత్రల్లో నటించగా, సావిన్ ఎస్ఎ దర్శకత్వం వహించారు. ఈ వేసవి సందడిని రెట్టింపు చేస్తూ ఏప్రిల్ 24న చిత్రం థియేటర్లలోకి రానుంది.




# జోష్‌లో జైలర్-2

మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం ‘జైలర్’. దీనికి కొనసాగింపుగా ‘జైలర్-2’ వస్తోన్న సంగతి తెలిసిందే. అగ్రహీరో రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్టు తెలుపుతూ టీమ్ కొన్ని ఫొటోలు పంచుకుంది. భారీస్థాయిలో ఇది రానున్నట్టు తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. త్వరలోనే విడుదల తేదీని కూడా టీమ్ వెల్లడించనున్నట్లు తెలుస్తోంది. విడుదలకు సిద్ధమవుతోన్నవేళ ఇటీవల ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు లీక్ కావడం చిత్ర యూనిట్‌ను ఆవేదనకు గురిచేసింది. ‘జైలర్-2’ సెట్లో తీసిన కొన్ని సన్నివేశాలు సోషల్ మీడియాలో లీకయ్యాయి. ఈ వీడియోను షేర్, ప్రచారం చేసిన ఖాతాలకు వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు చేపట్టడంతోపాటు బయటకు వచ్చిన సన్నివేశాల వీడియోను ఆ ఖాతాలనుంచి తొలగించడానికి అవసరమైన చర్యలను చేపట్టినట్టు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ప్రకటించింది.

